బుధవారం 31-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 256

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



మెరుగైన ప్రజా జీవనమే ధ్యేయం

ప్రజల జీవనం మరింత మెరుగ్గా ఉండేందుకే నా ప్రతీ నిర్ణయం: ప్రధాని మోదీ - 6లో



మీ కోసం మళ్లీ ఆడతా..

అభిమానులకు ధోని సంకేతం.. వచ్చే ఏడాది ఐపీఎల్ ఆడే చాన్స్ - 12లో

న్యూస్‌రీల్

మనీశ్ సిసోడియాకు చుక్కెదురు



మద్యం స్కామ్ కేసులో ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. బెయిల్‌పై విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొంది.

వివరాలు 6లో ▸

పెట్టుబడులకు అత్యంత అనుకూలం శ్రీసిటీ



తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఆర్‌ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, అడెలా ఎలక్ట్రికల్స్ పరిశ్రమలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. అలాగే ఆయన సమక్షంలో ఎన్‌జీసీ, టిల్ హెల్త్‌కేర్, మాగ్నమ్, ఎవర్ సైన్ మౌల్డర్స్, బాంబే కోటెడ్ స్పెషల్ స్టీల్స్, టీవీకే గ్రూప్ కంపెనీలు పరిశ్రమల స్థాపనకు ఎంవోయూలు చేసుకున్నాయి. ఈ పరిశ్రమల పెట్టుబడి విలువ రూ.500 కోట్లు కాగా 1,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

వివరాలు 2లో ▸

రుతుపవనాల్లో కదలిక



నైరుతి రుతుపవనాల్లో ఎట్టకేలకు కదలిక వస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో రుతుపవనాలు నైరుతి, ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 4కల్లా రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయని పేర్కొంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

వివరాలు 3లో ▸

ఊరూరా సంబరం

నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా రాష్ట్రమంతా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆనందోత్సాహం

- గ్రామగ్రామాన ర్యాలీలు
- కేకులు కట్ చేసి స్వీట్లు పంచిన వైఎస్సార్‌సీపీ నేతలు
- పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు.. పేదలకు దుస్తుల పంపిణీ



విజయనగరం జిల్లాలోని విశాఖ-అరకు రోడ్డులో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

సాక్షి నెట్‌వర్క్: నవరత్నాల బాటలో సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు బైక్ ర్యాలీలతో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాయి. పలుచోట్ల నేతలు కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజమైన అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో రుజువు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సజ్జల పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. నవరత్నాల ద్వారా సమ సమాజ నిర్మాణంలో ముఖ్యమంత్రి జగన్ నిమగ్నమయ్యారని చెప్పారు. కాపీ కొట్టిన పథకాలతో

మిగతా 2వ పేజీలో ▶



పతకాలతో కన్నీటి గంగ

భావోద్వేగానికి గురైన రెజ్లర్లు

- పతకాలను గంగలో పడేసే తీవ్ర చర్యలకు పాల్పడవద్దని సముదాయించిన సన్నిహితులు
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న రెజ్లర్లు
- బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఐదు రోజుల గడువు విధింపు

లైంగిక వేధింపుల ఆరోపణల విషయంలో భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వచ్చిన అగ్రశ్రేణి రెజ్లర్లు మంగళవారం తీవ్ర చర్యకు సిద్ధమయ్యారు. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇక తాము సాధించిన పతకాలకు విలువ లేదంటూ వాటిని గంగా నదిలో పడేస్తామని వారు ప్రకటించారు. ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన బజరంగ్ పూనియా, సాక్షి మలిక్...ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన వినేశ్ ఫొగాట్ తమ పతకాలతో హరిద్వార్‌లోని గంగాతీరానికి చేరారు. అక్కడ తమ నిరసనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కన్నీటిపర్యంతమయ్యారు. అయితే గంగలో పతకాలు పడేసే తీవ్ర చర్యలకు పాల్పడవద్దని కోరిన రెజ్లర్ల సన్నిహితులు త్వరలో న్యాయం దక్కుతుందని వారిని సముదాయించారు. దాంతో చివరకు తమ నిర్ణయాన్ని మార్చుకొని వెనుదిరిగారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఐదు రోజుల గడువు ఇచ్చారు. మరో వైపు రెజ్లర్లపై పోలీసు చర్యను అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య తీవ్రంగా ఖండించింది. తగిన రీతిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. త్వరలోనే ఎన్నికలు నిర్వహించకుంటే భారత రెజ్లింగ్ సమాఖ్య గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించింది.

12లో



విజయవాడలోని నిర్మల్ హృదయ్ భవన్‌లో చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి

'నిర్మల్ హృదయ్'లో సీఎం జగన్ దంపతులు

- నూతన భవనాన్ని ప్రారంభించి శిలా ఫలకం ఆవిష్కరణ
- మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పించి చిన్నారులతో గడిపిన సీఎం వైఎస్ జగన్, భారతి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం విజయవాడలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ నిర్మల్ హృదయ్ భవన్‌ను సందర్శించారు. నిర్మల్ హృదయ్‌లో నూతనంగా నిర్మించిన హోమ్ ఫర్ సిక్ అండ్ డైయింగ్ డెస్టిట్యూట్స్ భవనాన్ని సీఎం ప్రారంభించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. రాఘవయ్య పార్కు సమీపంలోని నిర్మల్ హృదయ్ భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతికి నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం

మిగతా 2వ పేజీలో ▶

2 నుంచి 'టెన్త్' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఉదయం 9.30 నుంచి 12.15 గంటల వరకు పరీక్షల నిర్వహణ

రాష్ట్రంలో 915 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు.. ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేధం



సాక్షి, అమరావతి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షల కోసం 2,12,221 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 915 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తామని ఎస్‌ఎస్‌సీ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి మంగళవారం తెలిపారు. విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి

మిగతా 14వ పేజీలో ▶



జిల్లా పరిధిలో అయితే.. ఇతరులకూ బదిలీల చాన్స్

- సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో అదనంగా మరికొందరికీ వీలు
- తొలుత 4 కేటగిరీల వారికి మాత్రమే అవకాశం
- తాజాగా 'ఇతరుల' కేటగిరీ కూడా ఆన్‌లైన్‌లో..
- దరఖాస్తు చేసుకునేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్

- వివరాలు 2లో

కవిత అసలైన పెట్టుబడిదారు!



- అరుణ్ పిళ్లై ఆమె ప్రతినిధిగా కార్యకలాపాల్లో పాల్గొన్నారు
- ఢిల్లీ మద్యం విధానం కేసు అనుబంధ చార్జిషీట్‌లో ఈడీ ఆరోపణ
- దినేశ్ అరోరా, సమీర్, ఇతరులతో ఆమె పలుమార్లు భేటీ
- పిళ్లై వాంగ్మూలంలో ఈ వివరాలన్నీ వెల్లడించారన్న ఈడీ
- 278 పేజీలతో చార్జిషీట్.. 53 సార్లు కవిత పేరు ప్రస్తావన
- దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు.. జూన్ 1కి విచారణ వాయిదా

14లో

1,650 మంది జనాభా ఉండే గ్రామంలోనే 270 మందికి పింఛన్లా!

రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రశంసలు

3లో



మన చేరికల కమిటీ చైర్మన్‌గారే! పక్కా వ్యూహంతో వెళ్తున్నారు!!

బడి గంట రోజే 'కానుక'

12న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా కానుక

- 7 నాటికే అన్ని స్కూళ్లకు చేరుకోనున్న కిట్లు
- మండల కేంద్రాల్లో క్షుణ్ణంగా నాణ్యతా తనిఖీలు.. పర్యవేక్షణ, తనిఖీలకు రెండు బృందాలు
- మొత్తం 39,96,064 కిట్లు
- జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12వతేదీన స్కూళ్లు పునఃప్రారంభమయ్యే రోజే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అదే రోజు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించి ప్రతి వస్తువును నిర్దిష్ట సమయంలోగా స్కూళ్లకు తరలించేలా తేదీలను నిర్ణయించారు. జూన్ 7వతేదీ నాటికే విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో పాఠశాలలకు చేరుకునేలా చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, స్కూళ్లకు తరలింపు ప్రక్రియ పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఇటీవల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జగనన్న విద్యా కానుకలో ప్రతి వస్తువును మండల కేంద్రాల్లో నాణ్యత తనిఖీలు చేసేలా ఒక బృందాన్ని, పర్యవేక్షణ కోసం మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. మండల స్థాయి బృందాలకు సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా స్థాయిలో

మిగతా 10వ పేజీలో ▶

20% గ్రామాల్లోనే స్థిరాస్తి విలువల సవరణ

- ఆ గ్రామాల్లోనూ చాలా పరిమితంగానే సవరించే అవకాశం.. 80 శాతం గ్రామాల్లో సవరణ లేదు
- కరోనా కారణంగా మూడేళ్లుగా జరగని పూర్తి స్థాయి సవరణ
- ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే జూన్ 1 నుంచి అమలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 20 శాతం గ్రామాల్లో మాత్రమే స్థిరాస్తుల మార్కెట్ విలువలను సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 80 శాతం గ్రామాల్లో మార్కెట్ విలువలను సవరించడం లేదు. రాష్ట్రంలోని 298 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 12,256 గ్రామాలు, అర్బన్ ఏరియాలు ఉండగా.. వాటిలో 2,318 గ్రామాలు, అర్బన్ ఏరియాల్లో మాత్రమే మార్కెట్ విలువలను సవరించనున్నారు. అదికూడా ఆయా ప్రాంతాల్లో పెరిగిన భూముల విలువలను బట్టి స్వల్పంగానే సవరించాలని నిర్ణయించారు. ఈ సవరణ 10 నుంచి 30 శాతం లోపే ఉండనుంది. రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

సీఎం జగన్‌కు అధికారుల శుభాకాంక్షలు


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి


ముఖ్యమంత్రి తో సీఎంవో అధికారులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కి పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎస్ జవహర్ రెడ్డి, సీఎం స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, సీఎం కార్యదర్శులు కె.ధనుంజయ్ రెడ్డి, రేవు ముత్యాలరాజు, అదనపు కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలి

సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: సీఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలిపారు. 'దేవుని దయతో, మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తయింది. నాపై ఎంతో నమ్మకంతో మీరు ఈ బాధ్యతను అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఈ నాలుగేళ్ళ కాలంలో 98%కి పైగా ఎన్నికల హామీలను మన ప్రభుత్వంలో అమలు చేశాం. వివిధ రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం' అని ప్రజలకు వివరించారు. 'మీకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. మన ప్రభుత్వంపై మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

సీఎంను కలిసిన రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ సభ్యులు


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ చైర్‌పర్సన్, అథారిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వారు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్ ఫిర్యాదుల అథారిటీ ఏర్పాటైన తర్వాత తొలిసారి చైర్‌పర్సన్ జస్టిస్ జె.ఉమాదేవి ఆధ్వర్యంలో అథారిటీ సభ్యులు బి.ఉదయలక్ష్మి(రిటైర్డ్ ఐఏఎస్), బి.శ్రీనివాసులు (రిటైర్డ్ ఐపీఎస్), కె.వి.గోపాలరావు (రిటైర్డ్ ఐపీఎస్)లు సీఎంను కలిశారు.

పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలు పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తోన్న 316 కాంట్రాక్ట్ లెక్చరర్లు, 144 వర్క్‌షాప్ అటెండెంట్ల సేవలను పునరుద్ధరిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. వీరు 2023–24 విద్యా సంవత్సరానికిగాను జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పరిధిలో అయితే.. 'ఇతరుల'కూ బదిలీల ఛాన్స్

సాక్షి, అమరావతి: బదిలీల ప్రక్రియలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. బదిలీల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి కొత్తగా 'ఇతరుల' కేటగిరిని కూడా జోడించింది. ఈ నెల 3 వరకు ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమిచ్చిన ప్రభుత్వం.. ప్రస్తుతం వారు పనిచేస్తోన్న జిల్లాల (ఉమ్మడి జిల్లాల ప్రాతిపదిక) పరిధిలో బదిలీ కోరుకునే వారికి ప్రభుత్వం మొదట 4 కేటగిరీలకే వీలు కల్పించింది. ఒంటరి మహిళ లేదా వితంతువు.. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు.. దంపతులు ఉద్యోగులై వేర్వేరు చోట్ల పని చేస్తున్న వారు.. పరస్పర అంగీకార బదిలీ కోరుకుంటున్న వారు.. ఈ కేటగిరీల వారు మాత్రమే బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇవి వర్తించని వారి నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు కొత్తగా 'ఇతరుల' కేటగిరిని కూడా జోడించింది. ఇందులో వీరు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ఆ పోర్టల్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. బదిలీలలో మొదట పేర్కొన్న 4 కేటగిరి బదిలీల దరఖాస్తులు పరిశీలన అనంతరమే 'ఇతరుల' కేటగిరిలో దరఖాస్తు చేసుకున్న వారికి వీలు కల్పించనున్నారు.

ఊరూరా సంబరం..


విశాఖలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


కడపలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ అధ్యక్షుడు కళ్లార్పకుండా అబద్ధాలాడుతున్నారని విమర్శించారు.

కర్నూలులో కోలాహలంగా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు మేయర్ రామయ్య, నంద్యాల ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదన్, ఇషాక్ బాషా, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, కంగాటి శ్రీదేవి, సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, తొగురు ఆర్థర్, బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు.

'తూర్పు'న ఘనంగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. కొవ్వూరులో హోంమంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రాజానగరంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. తునిలో మంత్రి దాడిశెట్టి రాజా కేక్ కట్ చేశారు. కాకినాడలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. రామచంద్రపురంలో మంత్రి వేణు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు.

విజయనగరంలో సేవా కార్యక్రమాలు..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించాయి. ఎస్.కోట, బొబ్బిలి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు.

'ప్రకాశం'లో మిన్నంటిన సంబరం

ప్రకాశం జిల్లాలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంకే వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్ నేతృత్వంలో కేక్ కటింగ్, భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నారాంబాబు, కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చీమకుర్తిలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురంలో పార్టీ నేతలు కేక్ కట్ చేశారు.

వైఎస్సార్ జిల్లాలో వేడుకగా..

వైఎస్సార్ కడప జిల్లావ్యాప్తంగా వేడుకలు జరిగాయి. కడపలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు పూలమాలలు వేసి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. ప్రొద్దుటూరులోని కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. కమలాపురం నగర పంచాయితీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ నేతలకు కేక్ పంచారు. పులివెందుల పురపాలక కార్యాలయంలో


ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. జమ్మలమడుగులో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో జెడ్పీ చైర్మన్ కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు.

చిత్తూరులో చరిత్రాత్మకం..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం సదుంలో మంత్రి పెద్దిరెడ్డి కేక్ కట్ చేశారు. తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, ఎమ్మెల్సీ భరత్ తదితరులు పాల్గొన్నారు. పెడన నియోజవకర్గానికి చెందిన పలువురు ఎంపీపీలు, పార్టీ నేతలతో కలసి మంత్రి జోగి రమేష్ శ్రీవారిని దర్శించుకుని రాష్ట్రంలో సంక్షేమ పాలన పదికాలాల పాటు కొనసాగాలని వేడుకున్నారు. తిరుపతిలోని ఇందిరా మైదానంలో ఎమ్మెల్యే భూమన, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష కేక్ కట్ చేశారు. శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేశారు. సత్యవేడు నియోజక వర్గవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్వేటి నగరంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. గూడూరులో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శాంతినగర్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విశాఖలో వైభవంగా..

ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ఘనంగా సంబరాలు జరిగాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అంబికాబాగ్ రామాలయం కళ్యాణ మండపంలో కేక్ కట్ చేసి దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్‌లు కోలా గురువులు, జాన్ వెస్లీ, వి.మధుసూదన్‌రావు కార్యక్రమంలో పాల్గొన్నారు. గాజువాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భీమిలి నియోజవర్గంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి ఆనందపురం నుంచి తగరపువలస వరకూ ర్యాలీ నిర్వహించారు. పెందుర్తి నియోజవర్గంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అధ్వర్యంలో వేపగుంట నుంచి పెందుర్తి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజవర్గంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కేక్ కట్ చేశారు. చోడవరం నియోజకవర్గం గర్నికంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పాయకరావుపేటలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు కేక్ కట్ చేశారు. అనకాపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ కేక్ కట్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేటలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాగులాపల్లి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొన్నారు.

కృష్ణాలో కదం తొక్కిన శ్రేణులు

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జగ్గయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నందిగామలో ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గం విసన్నపేటలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి కేక్ ట్ చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేశారు. గుడి వాడలో ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పామర్రులో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

పేదల పెన్నిధి

వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటివద్దే అందిస్తూ పేదలకు రాష్ట్రం స్వర్గధామంలా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని మొగల్రాజపురం మీడియా అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారిందని అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంసీ.దాస్ చెప్పారు. నాగార్జున వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ.శ్రీనివాస్‌రెడ్డి, జర్నలిజం విభాగాధిపతి జి.అనిత, కార్యక్రమంలో పాల్గొన్నారు.

'నిర్మల్ హృదయ్'లో సీఎం జగన్ దంపతులు


నిర్మల్ హృదయ్ భవన్‌లో చిన్నారులతో సీఎం వైఎస్ జగన్ దంపతులు

▶ మొదటి పేజీ తరువాయి

సాదరంగా స్వాగతం పలికారు. నిర్మల్ హృదయ్ భవన్‌లో చిన్నారులు సెబాస్టియన్, మేఘన ముఖ్యమంత్రి దంపతుల వెంట ఉన్నారు. చిన్నారులు ముందుండి సీఎం జగన్ దంపతుల చేయి పట్టుకుని నడిపించారు. అనంతరం ఆశ్రమంలోని మదర్ థెరిస్సా చిత్రపటానికి సీఎం జగన్ దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవన్‌లోని అనాథ పిల్లలు, వృద్ధులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీలు రూహుల్లా, కల్పలతారెడ్డి, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్ హృదయ్ భవన్ నిర్వాహకులు, చిన్నారులతో సీఎం దంపతులు

పెట్టుబడులకు అత్యంత అనుకూలం శ్రీసిటీ

పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

వరదయ్యపాళెం: తిరుపతి జిల్లా ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో భారీ పారిశ్రామిక పార్కుగా విస్తరించిన శ్రీసిటీ సెజ్ పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఆయన మంగళవారం శ్రీసిటీలో ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, అడెలా ఎలక్ట్రికల్స్ పరిశ్రమలను ప్రారంభించారు. ఆయన సమక్షంలో ఎన్‌జీసీ, టిల్ హెల్త్‌కేర్, మాగ్నమ్, ఎవర్‌షైన్ మౌల్డర్స్, బాంబే కోటెడ్ స్పెషల్ స్టీల్స్, బీవీకే గ్రూప్ కంపెనీలు పరిశ్రమల స్థాపనకు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నాయి. ఈ పరిశ్రమల మొత్తం పెట్టుబడి విలువ రూ.500 కోట్లు కాగా 1,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ డైనమిక్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా నిలిచిందన్నారు. నూతన పారిశ్రామిక విధానంతో సమగ్ర సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధన స్టార్టప్‌లను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి పెంపు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆర్థికవ్యవస్థను మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానంలో ప్రాజెక్టుల వేగవంతమైన క్లియరెన్స్‌కు ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. శ్రీసిటీలో అభివృద్ధి చెందిన ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, అభివృద్ధి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, సత్యవేడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య, ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ, పరిశ్రమల కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు లంకా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నడుస్తోంది నవశకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనకు నాలుగు సంవత్సరాల పూర్తితో అంతటా పండుగ శోభ

- తెలుగునాట చరిత్రను తిరగరాసిన వైఎస్సార్‌సీపీ
- గొప్ప పరిపాలనతో జగన్ చరిత్రలో నిలిచిపోతారు
- పేదల పక్షాన నిలబడిన ఆయనకే ప్రజలు మళ్లీ పట్టం కడతారు
- చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు చెత్తకాగితంలా చూస్తున్నారు
- సీఎం జగన్ నాలుగేళ్ల పాలనపై వైఎస్సార్‌సీపీ నేతలు




సాక్షి నెట్‌వర్క్: సరిగ్గా నాలుగేళ్ల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారంతో ఏపీలో నూతన శకం ఆరంభమైందని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ నాలుగు సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న సీఎంకు వారు అభినందనలు తెలిపారు. ఆయన సారథ్యంలో అమలవుతున్న నవరత్నాలతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు విడదల రజిని, కారుమూరి నాగేశ్వరరావు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, సీదిరి అప్పలరాజు వేర్వేరుచోట్ల స్పందించారు. వారేమన్నారంటే..

ఏపీ వైపు.. ఇతర సీఎంల చూపు



దేశంలోని ముఖ్యమంత్రులు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి వైపు చూస్తుంటే చంద్రబాబు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి మహానాడులో ఆయన చిత్రపటానికి చంద్రబాబు దండలు వేయడం సిగ్గుచేటు. మహనీయుడు ఎన్టీఆర్ ఆత్మ ఆ సమయంలో క్షోభకు గురై ఉంటుంది. ఆయన జీవించిన సమయంలో చంద్రబాబు ఎన్టీఆర్‌ను ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా వెన్నుపోటు పొడిచి ఆయన పదవిని లాక్కున్నాడు. భగవంతుడు ఎన్టీఆర్‌కు ఐదు నిమిషాల ఆయుష్షు ఇస్తే అదే వేదికపై ఓ శూలంతో చంద్రబాబును చంపి.. తర్వాత ఎన్టీఆర్ వెళ్లిపోయేవాడు. మహానాడులో చంద్రబాబు చెప్పిన మాటలన్నీ అసత్యాలే. – మంత్రి జోగి రమేష్

చరిత్ర తిరగరాసిన వైఎస్సార్‌సీపీ



2019 అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లకు 151 సాధించి వైఎస్సార్‌సీపీ తెలుగునాట చరిత్ర తిరగరాసింది. అప్పటికి పదేళ్ల క్రితం 2009 మేలో కడప నుంచి లోక్‌సభకు భారీ మెజారిటీతో ఎన్నికైన వైఎస్ జగన్ దశాబ్ద కాలంలో ఏ యువ రాజకీయ నాయకుడు ఎదుర్కొనని అడ్డంకులు, ఇబ్బందులను ధైర్యంగా అధిగమించారు. తన తండ్రి దివంగత సీఎం వైఎస్సార్ బాటలో జనం మధ్య దివిటీలా కదులుతూ సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. నవరత్నాలు వంటి హామీలతో వైఎస్సార్‌సీపీ 2019లో చరిత్రాత్మక విజయం సాధించింది. కోవిడ్ వంటి విపత్కర సమయంలో ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి వైఎస్సార్సీపీ సర్కారు ప్రవేశపెట్టిన నగదు బదిలీ పథకాలు ఎంతగానో ఉపకరించాయి. – ఎంపీ వి.విజయసాయిరెడ్డి

బీసీలపై చంద్రబాబుది కపట ప్రేమ



అధికారంలో ఉన్నప్పుడు తాటతీస్తా, తోకలు కత్తరిస్తా అంటూ బీసీలను బెదిరించి, భయపెట్టిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ కల్పిస్తానంటూ కపట ప్రేమను ఒలకబోస్తున్నారు. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఒక్క బీసీనైనా రాజ్యసభకు పంపారా? నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీకి 8 రాజ్యసభ స్థానాలు దక్కితే.. అందులో 4 స్థానాలను సీఎం జగన్ బీసీలకు ఇచ్చారు. సీఎం జగన్ తన కేబినెట్‌లో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానం కల్పించారు. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.2.11 లక్షల కోట్ల లబ్ధిచేకూరిస్తే.. అందులో బీసీలకే రూ.99,680 కోట్లు ఇచ్చారు. – మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రాష్ట్ర దశ, దిశను మార్చిన ఘనత జగనన్నదే




రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పాటుపడుతూ రాష్ట్ర దశ, దిశను మార్చివేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. ఆయన సారథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. వివిధ రంగాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. రాష్ట్రంలో వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం బాటలో పయనిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి జాతీయస్థాయిలో పలువురి నాయకులకు ఆదర్శప్రాయుడిగా నిలిచారు. – ఎంపీ మోపిదేవి

సీఎం పథకాలవల్లే ధైర్యంగా గడపగడపకు



పేదలకు జగనన్న ప్రభుత్వం ఇంటిపట్టాలు ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే వాటిని చంద్రబాబు శ్మశానంతో పోల్చడం సరికాదు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌కు రాజకీయ భవిష్యత్ లేదు. ఆ పార్టీకి ప్రజలు సమాధులు కట్టడం ఖాయం. దేశంలో ఏ రాష్ట్రం కానీ, ఏ పార్టీ నేతలు కానీ గడప గడపకు వెళ్లిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నందునే ప్రజాప్రతినిధులు గడప గడపకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నారు. – డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చరిత్రలో నిలిచిపోయే గొప్ప పాలన



సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోయే గొప్ప పరిపాలన అందిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మా ప్రభుత్వం గొప్ప సంస్కరణలు తీసుకొచ్చింది. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక వంటి పథకాలను తీసుకువచ్చి పేద విద్యార్థికి విద్యను మరింత చేరువ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారు. ప్రభుత్వాసుపత్రులనూ ఆధునీకరించటంతో పాటు కొత్త ఆసుపత్రులను నిర్మించారు. ఐదు మెడికల్ కళాశాలలు ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా ఏకంగా 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. మహిళలకు ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారు. – మంత్రి విడదల రజిని

బాబు.. కపట నాటక సూత్రధారి



కపట నాటక సూత్రధారి చంద్రబాబు మరోసారి ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారం చేజిక్కించుకునేందుకు ఆరాటపడుతున్నాడు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సీఎం జగన్‌కు అభినందనలు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, ఎవరూ ఆలోచన చేయని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నారు. కరోనా కాలంలో వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు చేపట్టారు. 2014 ఎన్నికల మేనిఫె స్టోలో 650 వాగ్దానాలను చేసిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తరువాత అందులో కనీసం పదిశాతమైనా అమలుచేశారా? అదే జగన్ 98శాతం హామీలను అమలుచేశారు. బాబు రాజధాని పేరిట రైతుల భూములను కాజేశారు. – మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రగతిపథంలో రాష్ట్రం పరుగులు



సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీస్తోంది. 2018–19నాటికి రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 22వ ర్యాంకులో ఉంటే ఆర్‌బీఐ తాజా నివేదిక ప్రకారం అది ఒకటో స్థానంలో నిలవడం ముఖ్యమంత్రి పాలనకు నిదర్శనం. ఇదే ప్రజారంజక పాలనకు సూచి. ఈ విషయంలో ప్రతిపక్షాలు తమ మీడియా సపోర్టుతో బురదజల్లే కార్యక్రమం చేస్తున్నాయి. 2019కి తలసరి ఆదాయంలో ఏపీ 17వ స్థానంలో ఉండగా సీఎం జగన్ 9వ స్థానంలో నిలబెట్టారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఈజ్ ఆఫ్ డూయింగ్ ద్వారా అవలంబిస్తున్న నిర్మాణాత్మక కార్యక్రమాలతో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2018–19లో ఏపీ వ్యవసాయ వృద్ధి –6.5 శాతంతో దేశంలో 27వ స్థానంలో ఉంటే ప్రస్తుతం 8.5 శాతం వృద్ధిరేటుతో ఆరో స్థానంలో నిలబడింది. – మంత్రి చెల్లుబోయిన వేణు

టీడీపీ మేనిఫెస్టో విడ్డూరంగా ఉంది



చంద్రబాబుకు నీతి, నిజాయితీలు ఏమిలేవు. ప్రజలను తప్పుదారి పట్టించడానికి సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలను కాపీకొట్టి టీడీపీ మేనిఫెస్టో అని చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలపై ఒకప్పుడు విమర్శలు చేసి ఏపీ శ్రీలంకలా మారిపోతుందని, జనం సోమరులవుతారని అన్న చంద్రబాబు ఇప్పుడు ఆ పథకాలకే పేర్లు మార్చి మేనిఫెస్టో విడుదల చేయడం విడ్డూరంగా ఉంది. మా పథకాలపై లోకేశ్, చంద్రబాబు మాట్లాడిన మాటలు ఎవరూ మర్చిపోరు. జగనన్న ఇళ్లపై విమర్శలు చేసిన చంద్రబాబు ఒక్కరికైనా ఇల్లు కట్టి ఇచ్చారా? ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు రామోజీరావులు ఎన్ని రాతలు రాసినా రాష్ట్ర ప్రజలు నమ్మరు. తను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. 2024లో కూడా వైఎస్ జగన్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారు. – మంత్రి సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా...

'ఆడుదాం ఆంధ్ర'కు అపెక్స్ కమిటీ నియామకం

సాక్షి, అమరావతి: ఏపీలో క్రీడాకారులను గుర్తించడంతో పాటు యువతకు ఆరోగ్యకర జీవన శైలిపై అవగాహన కల్పించేలా 'ఆడుదాం ఆంధ్ర 2023–24' కార్యక్రమ నిర్వహణకు రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కమిటీ చైర్మన్ మరో 13 మంది మెంబర్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ ద్వారా 17 ఏళ్ల పైబడిన క్రీడాకారులను గుర్తించి ప్రతిభను వెలికితీసేలా రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా టోర్నీలు నిర్వహిస్తారు. గ్రామ/వార్డు స్థాయి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు 5 లెవల్స్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలతో పాటు యోగా, టెన్నికాయిట్, మారథాన్, ఇతర గ్రామీణ క్రీడలను ప్రోత్సహించనున్నారు. కమిటీలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, గ్రామ–వార్డు సచివాలయ, పంచాయతీరాజ్, ఆర్థిక, ఆరోగ్యశాఖ, సోషల్, ట్రైబల్, బీసీ వెల్ఫేర్, మున్సిపల్ శాఖల స్పెషల్ సీఎస్/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శులు, ఐఅండ్‌పీఆర్ కమిషనర్, శాప్ ఎండీ మెంబర్లుగా, క్రీడాశాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్–కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.కాగా, ఏపీ సొసైటీ ఫర్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ కమిటీని(ఏపీ స్టెప్) రెన్యువల్ చేస్తూ యువజన, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ మోహన్ ఉత్తర్వులిచ్చారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై 'యాత్ర'



ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): పోలవరం ప్రాజెక్ట్‌కు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల సమస్యలపై పోలవరం నుంచి అమరావతికి జీపు యాత్ర చేపడుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పోలవరానికి నిధులు విడుదల కాకుండా ప్రధాని మోదీ అడ్డుపడుతున్నారని అన్నారు. జూన్ రెండో వారంలో పోలవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం దారుణమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

1,650 జనాభా ఉన్న గ్రామంలోనే 270 మందికి పింఛన్లా!

రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి ప్రశంసలు

- గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన, అధికారులతో సమీక్ష
- గ్రామకంఠాల్లో ఇళ్లకు యాజమాన్య ధ్రువీకరణపత్రాల జారీకి జరుగుతున్న భూ సర్వేపై సమీక్ష

సాక్షి, అమరావతి/తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం 1,650 మంది (448 ఇళ్లు) జనాభా ఉన్న గుంటూరు జిల్లా చింతలపూడిలో 252 మందికి నెలనెలా పింఛన్లు ఇస్తోందని అధికారులు తెలపడంతో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్‌కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ఆయన ప్రశంసించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న కార్యక్రమాల సమీక్షతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆయన మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చారు. తాడేపల్లిలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాల అమలును స్వయంగా పరిశీలించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే, స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామ కంఠాల పరిధిలోని ఉండే ఇళ్లకు సంబంధించి యాజమాన్య హక్కుపత్రాలు ఇచ్చే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. గ్రామ పంచాయతీకి



సచివాలయ ఉద్యోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న చంద్రశేఖర్ కుమార్

కేటాయించిన 15వ ఆర్థికసంఘం నిధుల వినియోగంపై ఆరా తీశారు. పంచాయతీ ఆధ్వర్యంలో వివిధ పనులు చేపట్టిన అనంతరం ప్రస్తుతం పంచాయతీ ఖాతాలో ఇంకా రూ.3.89 లక్షలు ఆర్థికసంఘ నిధులు మిగిలి ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీకి కేటాయించిన నిధులను కేవలం సీసీ రోడ్ల నిర్మాణానికే పరిమితం కాకుండా గ్రామంలో సోలార్ విద్యుత్ ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణకు ఖర్చు పెట్టాలని చంద్రశేఖర్‌కుమార్ సూచించారు. గ్రామ పంచాయతీపై ఎలాంటి భారం లేకుండా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోందని అధికారులు ఆయనకు వివరించారు. గ్రామంలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి తెలిపిందని చెప్పారు. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ద్వారా గ్రామంలోని పేద విద్యార్థులు, నిరుద్యోగులు సైతం ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇతర పోటీపరీక్షలకు సమర్థంగా ప్రిపేర్ అయ్యే అవకాశం ఉంటుందని ఆయన మెచ్చుకున్నారు. అనంతరం ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో పర్యటించి అక్కడ అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, అదనపు కమిషనర్ సుధాకర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు జెడ్పీ సీఈవో మోహనరావు, డీపీవో కేశవరెడ్డి, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లానాయక్, దుగ్గిరాల తహశీల్దార్ మల్లేశ్వరి, చింతలపూడి సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మెడికల్ కళాశాలకు అనుమతి

- 150 సీట్లతో తొలి ఏడాది తరగతులు ప్రారంభం
- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే అనుమతులు రానున్నాయని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బోధనాసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రమాణాలకు తగినట్లుగా దశల వారీగా చేపట్టవలసిన పనులను పూర్తి చేశామని వెంకటేశ్వరరావు చెప్పారు. ఎన్ఎంసీ సభ్యులు సోమవారం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సుమారు రూ.435 కోట్లతో ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి అనుబంధంగా వైద్య కళాశాల నిర్మిస్తుందని తెలిపారు. బోధనాసుపత్రి స్థాయిని 350 పడకలకు పెంచామని చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 600 పడకలకు ఆధునిక వైద్య అందించే సామర్థ్యం మేరకు పెంచుతాన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్, డాక్టర్లు నాగరాజు మన్నార్, మనోజ్, మహేంద్ర, కె.. శ్రీనివాసరెడ్డి, బి. రాజేశ్వరి, ఏ.వెంకటలక్ష్మి, కె.అక్కమంబా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

జైనుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): జైనుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌కి వినతిపత్రాన్ని అందించినట్లు ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మనోజ్ కొఠారి మంగళవారం తెలిపారు. విజయవాడకి వచ్చిన సీఎంను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. జైన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తనను నియమించడపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.

నాపై దుష్ప్రచారాన్ని కాపులు నమ్మరు

- నా విజయం వెనుక వారున్నారు
- మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి, కట్ పేస్ట్ చేసి.. సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు పెట్టడంపై మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) మండిపడ్డారు. టీడీపీ మహానాడులో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు స్థానం లేదని.. పనికిమాలిన స్క్రాప్ నా కొడుకులకు పెద్ద పీట వేశారని మాట్లాడిన మాటలను పప్పు, తుప్పు నాయుడు లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోషల్ మీడియా బ్యాచ్.. వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ ప్రచారాన్ని కాపులు నమ్మరని చెప్పారు. అచ్చెన్నాయుడు లాంటి వాళ్ల ఫొటోలు పెట్టడానికి స్థలం ఉంది కానీ.. ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల ఫొటోలు వేయడానికి స్థలం లేదా? అని ప్రశ్నించానన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన కృష్ణాజిల్లా గుడివాడలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గతంలో అనంతపురం ఎంపీ మాధవ్‌ను సైతం ఇదేవిధంగా ఇబ్బందులకు గురిచేశారని, అయితే ప్రజలు వీరి పుకార్లను నమ్మలేదని చెప్పారు. తాను వంగవీటి రంగా కార్యక్రమాలన్నింటికి హాజరయ్యానని, వంగవీటి రాధా తన సోదరుడని పేర్కొన్నారు. తాను అన్నా అని పిలుస్తానని, అదేరీతిలో తనను వారి కుటుంబ సభ్యుడిగా గుర్తిస్తారని చెప్పారు. టీడీపీ, జనసేన కలిసి ప్రోత్సహించినా, రాధా ఎట్టి పరిస్థితుల్లో గుడివాడలో పోటీ చేయరని తెలిపారు. అది తన కుటుంబానికి, ఆయనకు మధ్య ఉన్న అనుబంధమని చెప్పారు. కాపు సోదరులు తన వెంటే ఉన్నారని, తన విజయంలో వారి పాత్ర ఉందన్నారు. 2024 ఎన్నికల్లో గుడివాడ గడ్డ కొడాలి నాని అడ్డా అని నిరూపిస్తామని ఆయన స్పష్టం చేశారు.

తూర్పుగోదావరిలో కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

ఉండ్రాజవరం: తూర్పుగోదావరి జిల్లా చిలకపాడులో మీనాక్షి సమేత ఐశ్వర్య సుందరేశ్వరస్వామి ఆలయ యంత్ర శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం బ్రహ్మశ్రీ వెలవలపల్లి చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వెలవలపల్లి సుబ్రహ్మణ్యంశాస్త్రి పర్యవేక్షణలో ఉదకశాంతి, శాంతిహోమం, కళాహోమం, తత్వాను సంధాన హోమాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డాక్టర్ డి.కె.శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, చిటికెన వెంకటేశ్వరరావు, చిటికెన రామకృష్ణ, చిటికెన నాగేశ్వరరావు దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివకుమార్ హోమంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయ సముదాయాన్ని సందర్శించి కొత్త విగ్రహాలను పరిశీలించారు. అనంతరం డి.కె.శికుమార్ మాట్లాడుతూ చిలకపాడులో తన మిత్రుడు శివాలయాన్ని నిర్మించారని చెప్పారు. షర్మిల తనకు చెల్లిలాంటిదన్నారు.



హోమంలో పాల్గొన్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్

తమకు మంచి రిలేషన్ ఉందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడనన్నారు. బీజేపీ స్థానం ఏమిటో కర్ణాటక ప్రజలు చెప్పారని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర మంత్రి సుధాకర్, తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.



భారీగా పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులు

2026-27 నాటికి రోజుకు 100 కోట్ల చెల్లింపులు

డెబిట్ కార్డ్‌ను అధిగమించనున్న క్రెడిట్ కార్డ్ • పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడి

దేశంలో డిజిటల్ చెల్లింపులు అంతకంతకూ పెరుగుతున్నాయి. 2026–27 నాటికి దేశంలో యూపీఐ చెల్లింపులు రోజుకు 100 కోట్ల లావాదేవీలకు చేరతాయని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. డిజిటల్ చెల్లింపుల్లో కూడా సింహభాగం ఉన్న రిటైల్ కొనుగోళ్ల కోసం చేసేవి మరింత పెరుగుతాయని వెల్లడించింది. దేశంలో యూపీఐ, కార్డు చెల్లింపుల సరళిని విశ్లేషిస్తూ 'ఇండియా పేమెంట్స్ హ్యాండ్‌బుక్' పేరిట పీడబ్ల్యూసీ ఇండియా తాజాగా నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. – సాక్షి, అమరావతి

- 2022–23లో దేశంలో 83.71 కోట్ల డిజిటల్ చెల్లింపులు జరిగాయి. వీటిలో రిటైల్ కొనుగోళ్ల వాటా 70 శాతం. అలాగే 2026–27 నాటికి దేశంలో మొత్తం 37,900 కోట్ల లావాదేవీలు జరుగుతాయని అంచనా వేసింది. ఇందులో రిటైల్ కొనుగోళ్ల కోసం చేసే చెల్లింపులే 90 శాతం ఉంటాయి.
- దేశంలో కార్డు చెల్లింపులు కూడా ఏటా పెరుగుతున్నాయి. ప్రస్తుతం క్రెడిట్ కార్డు చెల్లింపుల కంటే డెబిట్ కార్డులవే ఎక్కువగా ఉన్నాయి. కానీ 2024–25 నాటికి డెబిట్ కార్డులను క్రెడిట్ కార్డులు అధిగమిస్తాయి. ఎందుకంటే గత ఐదేళ్లుగా క్రెడిట్ కార్డ్ లావాదేవీలు ఏటా 21 శాతం చొప్పున పెరుగుతున్నాయి. అదే సమయంలో డెబిట్‌కార్డ్ చెల్లింపులు ఏటా 3 శాతమే పెరుగుతున్నాయని నివేదిక తెలిపింది.
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు కార్డుల ద్వారా రాబడిలో క్రెడిట్ కార్డుల వాటా ఏకంగా 76 శాతం ఉంది. డెబిట్ కార్డుల ద్వారా 24 శాతం రాబడే వస్తోంది. దీంతో బ్యాంకులు కూడా క్రెడిట్ కార్డుల వినియోగాన్ని పెంచేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. అందుకోసం క్రెడిట్ కార్డ్ ఆధారిత బీమా పథకాలను ఎక్కువగా తీసుకువస్తున్నాయి. 2021–22 కంటే 2022–23లో క్రెడిట్ కార్డ్ బీమా పథకాలు 42 శాతం పెరగడమే అందుకు నిదర్శనం. ఏటా వీటి టర్నోవర్‌ను కనీసం 33 శాతం పెంచాలని బ్యాంకులు లక్ష్యంగా పెట్టుకున్నాయని నివేదిక పేర్కొంది.

టెక్ బుడగ పేలుతోందా?

"రెండో డిజిటల్ విప్లవానికి నాంది పడింది. ప్రతి కంపెనీ, ప్రతి పరిశ్రమ ఆన్‌లైన్ సేవల వైపు మొగ్గుతోంది. ఇది మా కంపెనీకి లాభాలను ఒనగూర్చుతోంది"
- ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ ఆంక్షల వేళ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వ్యాఖ్య

"కోవిడ్ తర్వాత పరిస్థితులను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకోవడం కోసం 10 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాల్సి వస్తోంది"
కోవిడ్ వ్యాప్తి తగ్గిన ప్రస్తుత తరుణంలో సత్య నాదెళ్ల చేసిన తాజా ప్రకటన

దొడ్డ శ్రీనివాసరెడ్డి

ఒక్క మైక్రోసాఫ్ట్ మాత్రమే కాదు... అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి అనేక దిగ్గజ ఐటీ కంపెనీల తాజా పరిస్థితి సైతం ఇదే. వరుసగా ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నాయి. ఒక్కసారిగా వేలాది మందిని తొలగిస్తున్నాయి. కోవిడ్ కాలంలో శరవేగంగా విస్తరించిన ఐటీ, ఆన్‌లైన్ సేవలతో లాభాలు పిండుకున్న టెక్ కంపెనీల అభివృద్ధి బుడగ ఇప్పుడు పేలడానికి సిద్ధంగా ఉందా? బెజారెత్తిన టెక్ కంపెనీల పరిస్థితికి కారణం ఏమిటి? భవిష్యత్తులో వాటి పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందా?



- కోవిడ్ వేళ ఐటీ సేవలు పెరగడంతో దిగ్గజ కంపెనీల లాభాలబాట
- భవిష్యత్తును అంచనా వేసుకోకుండానే లక్షలాది మందికి ఉద్యోగాలు
- మహమ్మారి వ్యాప్తి తగ్గుముఖం పట్టాక తలకిందులైన పరిస్థితులు
- నష్టాలు తగ్గించుకొనేందుకు గతేడాది నుంచి ఉద్యోగాల్లో భారీ కోతలు
- కృత్రిమ మేధ, ఆటోమేషన్ రాకతో ఐటీ వ్యాపారంలో మరింత తిరోగమనం
- వాటికితోడు దెబ్బకొట్టిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక మాంద్యం, వడ్డీరేట్ల పెరుగుదల

ఏమిటీ డాట్‌కామ్ బుడగ?

గత శతాబ్దం చివర్లో ఇంటర్నెట్ వినియోగంలోకి వచ్చిన తరుణంలో దాని ఆధారంగా పుట్టుకొచ్చిన కంపెనీలు ఊహించని రీతిలో వృద్ధి చెందాయి. పేరు చివర డాట్‌కామ్ ఉన్న ప్రతి కంపెనీ విలువ వేలం వెర్రిగా పెరిగిపోయింది. 1995 నుంచి 2000 వరకు ఆన్‌లైన్ సేవల పేరిట వెలిసిన కంపెనీలన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగి శతాబ్దం చివరికి వచ్చే సరికి గాలిబుడగలా పేలిపోయాయి. ముందున్న కాలమంతా డాట్‌కామ్ కంపెనీలదే అని నమ్మిన వ్యక్తులు, సంస్థలు ఆయా కంపెనీల్లో భారీగా పెట్టుబడులు పెట్టాయి. ఉదాహరణకు 1994లో ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పడిన నెట్‌స్కేప్ అనే సంస్థ 1995లో అంటే కేవలం ఏడాది తరువాత పబ్లిక్ ఫండింగ్‌కు వెళ్తే ఒక్క రోజులోనే దాని మార్కెట్ క్యాప్ 278 కోట్ల డాలర్లకు చేరుకుంది. జనరల్ మోటార్స్‌కు ఈ విలువ సాధించడానికి 40 ఏళ్లు పట్టింది. 2001 వచ్చే సరికి ఈ డాట్‌కామ్ కంపెనీల విలువ కేవలం ఊహాజనితమని అర్థమై అందరూ పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో ఈ కంపెనీలన్నీ కుప్పకూలిపోయాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 'నాస్‌డాక్'లో 1995 నుంచి 2000 వరకు క్రమేపీ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ 800 శాతం పెరిగితే 2002 వచ్చే సరికి పెరిగిన మొత్తంలో 790 శాతం పడిపోయి దాదాపు మొదటికి వచ్చింది. దాంతో డాట్‌కామ్ బుడగ పేలిపోయింది.

ఉద్వాసనల పర్వం..


కోవిడ్ కాలంలో అనుకోకుండా వచ్చిపడిన అవకాశంతో అభివృద్ధి పుంతలు తొక్కిన టెక్ సంస్థలు శరవేగంగా విస్తరణపర్వం మొదలుపెట్టాయి. ప్రపంచం నలుమూలలకు విస్తరించే క్రమంలో లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చాయి. అమెజాన్ ఒక్కటే 2022 సెప్టెంబర్ నాటికి ఏడాది మొత్తం 5 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చింది. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాతోపాటు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి ఐటీ దిగ్గజాలు కూడా లక్షలాది ఉద్యోగాలు కల్పించాయి. గతేడాది చివరికి వచ్చే సరికి పరిస్థితులు మారడం మొదలైంది. లాభాల్లో కోత పడతుండటంతో కంపెనీలు ఉద్యోగులను తొలగిచడం మొదలుపెట్టాయి. ఒక్క 2022లోనే టెక్ కంపెనీలన్నీ కలిపి 1,64,411 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు లేఆఫ్స్ ఎఫ్‌వైఐ అనే సంస్థ సేకరించిన సమాచారంలో వెల్లడైంది. ఈ సంస్థ లెక్క ప్రకారం ఈ ఏడాది ఇప్పటికే 658 టెక్ కంపెనీలు 1,91,416 మంది ఉద్యోగులను తొలగించాయి. కేవలం టెక్ స్టార్టప్ కంపెనీలకు మాత్రమే నిధులు సమాకూర్చే సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) ఈ ఏడాది మార్చిలో కుప్పకూలడం ఐటీ కంపెనీలకు మరో శరాఘాతంగా పరిణమించింది. నిధుల కొరతతో అనేక కంపెనీలు మూతపడటమో, ఉద్యోగాలను తొలగించడమో చేశాయి. గతేడాది నవంబర్‌లో 11,000 ఉద్యోగాల కొతపెట్టిన మెటా... మళ్లీ ఈ ఏడాది మార్చిలో మరో 10 వేల మందిని తొలగించింది. అమెజాన్ 2022 నవంబర్‌లో 10,000 మంది, 2023 జనవరిలో 8 వేల మంది, మార్చిలో 9 వేల మంది ఉద్యోగులను తొలగించింది. యాక్సెంచర్ ఈ ఏడాదిలో ఇప్పటికే తన ఉద్యోగుల్లో 2.5 శాతం అంటే దాదాపు 19 వేల మందిని తొలగించింది. ట్విట్టర్‌ను కైవశం చేసుకున్న తర్వాత ఆ సంస్థలోని 80 శాతం మంది ఉద్యోగులను తొలగించామని ఎలాన్ మస్క్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అంటే దాదాపు 6 వేల మంది ఉద్యోగులను తొలగించారు. కాగ్నిజెంట్ ఈ నెల 4న 3,500 మందిని తొలగించింది. మైక్రోసాఫ్ట్ గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో అత్యల్ప ఆదాయం ఆర్జించింది. అమ్మకాలు 14 శాతం పడిపోయినట్లు సత్య నాదెళ్ల వెల్లడించారు.

ఎందుకీ పరిస్థితి

టెక్ కంపెనీల తిరోగమ నానికి ఒక్కసారిగా వచ్చిపడ్డ అనేక పరిణామాలు కారణం. కృత్రిమ మేధ, ఆటోమేషన్ ఒక కారణమైతే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక మాంద్యం, డాలర్ విలువ పెరగడం, అధిక వడ్డీలు, స్థాయికి మించిన ఉద్యోగుల సంఖ్య వంటి కారణాలు టెక్ ప్రపంచాన్ని ఇప్పుడు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో మొదలైన ఆర్థిక మాంద్యం ఛాయలు క్రమేణా విస్తరిస్తూ ద్రవ్యోల్బణానికి ఆపై అధిక వడ్డీలకు దారితీశాయి. ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలోనే కృత్రిమ మేధ, ఆటోమేషన్ ఉప్పెనలా వచ్చిపడి టెక్నాలజీ సంస్థల అభివృద్ధికి గండికొడుతున్నాయి. ఏఐ అత్యంత నాణ్యమైన, నమ్మకమైన ప్రత్యామ్నాయాలను సృష్టిస్తూ శరవేగంగా అన్ని రంగాలను కమ్ముకుంటోంది. ఇంతవరకు మానవ సంపదపై ఆధారపడి పనిచేస్తున్న టెక్ కంపెనీల ఉత్పాదనలను కృత్రిమ మేధ క్షణాల్లో అతిచౌకగా రూపొందిస్తుడటంతో ఆయా కంపెనీల ఆదాయంపై దెబ్బపడుతోంది. దాంతో గత్యంతరం లేక కంపెనీలు ఉద్యోగులను భారీగా తగ్గించుకొని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. టెక్ ప్రపంచాన్ని వేధిస్తున్న మరో కారణం ద్రవ్యోల్బణం. ప్రస్తుత ధరల స్థాయి గత 40 ఏళ్లలోనే అత్యధికం. పెరుగుతున్న వస్తువులు, సేవల ధరలతో వినియోగదారులు టెక్ కంపెనీల ఉత్పాదనలు, సేవలను భరించలేని స్థాయికి చేరుకుంటున్నారు. ధరలను అదుపు చేయడానికి ప్రభుత్వాలు వడ్డీ రేట్లను పెంచుతుండటం టెక్ కంపెనీలకు దెబ్బమీద దెబ్బగా పరిణమిస్తోంది. అమ్మకాలు తగ్గి ఆదాయం పడిపోతుండటం కంపెనీలు నడపడానికి రుణాలు తీసుకోలేక ఉద్యోగుల ఉద్వాసనకు ఉపక్రమించాయి. కరోనా వేళ మార్కెట్‌ను సరిగ్గా అర్థం చేసుకోలేక, తమ అభివృద్ధి శాశ్వతమని భావించి అడ్డగోలుగా ఉద్యోగులను తీసుకున్నామని మెటా అధిపతి జుకర్‌బర్గ్, సేల్స్‌ఫోర్స్ అధినేత మార్క్ బెన్యాఫ్ ఒప్పుకున్నారు. టెక్ దిగ్గజాలకు భిన్నంగా యాపిల్ కంపెనీ మాత్రం ఉద్యోగ నియామకాల్లో సంయమనం పాటించింది. కోవిడ్ కాలంలో ఉద్యోగుల సంఖ్యను కేవలం 20 శాతమే పెంచుకుంది. దాంతో ఇంతవరకు ఉద్యోగులను తొలగించని టెక్ దిగ్గజం యాపిల్ ఒక్కటే. టెక్ ప్రపంచంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు పాతికేళ్ల నాటి డాట్‌కామ్ బుడగను గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.

రుతుపవనాల్లో కదలిక

- రెండురోజుల్లో నైరుతి, ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతాల్లోకి విస్తరణ
- జూన్ 4 కల్లా కేరళలోకి ప్రవేశించే అవకాశం
- నేడు కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు



సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల్లో ఎట్టకేలకు కదలిక వస్తోంది. వారం రోజుల కిందట ఈ రుతుపవనాలు అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోకి సకాలంలోనే ప్రవేశించాయి. తర్వాత అవి ఊహించిన దానికంటే నెమ్మదిగా కదులుతున్నాయి. గురువారం నుంచి అవి చురుకుదనాన్ని సంతరించుకోనున్నాయి. ఒకటి, రెండురోజుల్లో ఈ రుతుపవనాలు మాల్దీవులు, కొమరిన్ ప్రాంతాలతో పాటు నైరుతి, ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతాల్లోని కొన్ని ప్రాంతాలకు, అనంతరం మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) మంగళవారం రాత్రి వెల్లడించింది. ఐఎండీ ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 4వ తేదీకల్లా నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశాలు మెరుగుపడ్డాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పశ్చిమ విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు మరత్వాడా, కర్ణాటక మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపోస్ఫిరిక్ స్థాయిలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రానున్న మూడురోజులు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. బుధవారం కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. రానున్న మూడురోజులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో పాటు ఒకటి, రెండుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని వివరించింది.

'పొగాకు' నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

- నేటి నుంచి జూలై 31వ తేదీ వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతలో పొగాకు వాడకంపై విముఖత పెంచే దిశగా టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్‌కు వైద్య, ఆరోగ్య శాఖ శ్రీకారం చుట్టింది. పొగాకు వినియోగంతో వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన పెంచడానికి 60 రోజుల పాటు వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించనుంది. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపెయిన్‌ను ప్రారంభించనుంది. జూలై 31వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్యాంపెయిన్‌ను నిర్వహించనుంది. ఈ సందర్భంగా అన్ని విద్యా సంస్థలలో 'పొగాకు వద్దు ప్రతిజ్ఞ'ను విద్యార్థులతో అధికారులు చేయిస్తారు. పొగాకుపై వ్యాసం, పెయింటింగ్, పోస్టర్, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహిస్తారు. ర్యాలీలు, ఇతర అవగాహన కార్యక్రమాలు చేపడతారు. గ్లోబల్ యూత్ టుబాకో సర్వే 2019 ప్రకారం 13–15 సంవత్సరాల వయస్సు విద్యార్థులలో దాదాపు ఐదవ వంతు మంది తమ జీవితంలో పొగాకు ఉత్పత్తి (ధూమపానం, మరేదైనా ఇతర రూపం) ఉపయోగించారని వెల్లడైంది. మరోవైపు దేశంలో ఏటా పొగాకు వినియోగం కారణంగా 13.5 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ఇదిలా ఉండగా పొగాకు నియంత్రణ చర్యల్లో భాగంగా విద్యా సంస్థలకు 100 గజాలలోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రతి పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలను ఒక టీచర్‌కు అప్పగించింది.

14 ఏళ్లలో చంద్రబాబు ఏం చేశారు?

- 9 ఏళ్లలో మోదీ సాధించింది శూన్యం
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

దాబా గార్డెన్స్ (విశాఖ దక్షిణ):టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రానికి ఏం చేశారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతా మోహన్ నిలదీశారు. మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కుప్పంలో కూడా అభివృద్ధి ఏమీ చేయలేదన్నారు. అక్కడ 70 శాతానికి ఓబీసీలుంటే ఒక్కరికీ న్యాయం చేయలేదన్నారు. 14 ఏళ్లపాటు ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ విస్మరించిన చంద్రబాబు వచ్చే ఐదేళ్లలో ఏదో చేసేస్తారంటే నమ్మాలా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సాధించింది శూన్యమని, బీజేపీ హయాంలో దేశం తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనతో దేశం వెనుక్కు పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో దేశంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు కొరత లేదని.. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా పోటీ చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగేలా తొలి సంతకం చేస్తామన్నారు.

చిరంజీవిని సీఎం చేసి ఉంటే బాగుండేది

కాంగ్రెస్ పార్టీ 2010లో కొంత పొరపాటు చేసిందని మోహన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవిని కిరణ్‌కుమార్‌రెడ్డికి బదులుగా మెగాస్టార్ చిరంజీవికి ఇచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో ఇళ్లు కట్టిందని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు.



సాక్షి
బుధవారం, 31 మే 2023

ప్రజాస్వామ్యంలో నిరంకుశ నేత

నిరంకుశులు అధికారంలో ఉంటే ప్రజాస్వామ్యం పేరుకే మిగులుతుంది. అతి జాతీయవాదం ప్రబలినప్పుడు ఆలోచనను అది మింగేస్తుంది. ఆ చేదు నిజానికి టర్కీ (తుర్కియే) మరోసారి సాక్షీభూతమైంది. తొలి దఫాలో ఫలితం తేలకపోయేసరికి రెండో దఫా సాగిన ఎన్నికలు, నాటకీయ ఫక్కీలో రోజుకొకరిది ఆధిక్యంగా మారిన ఎన్నికల ప్రచారం తర్వాత టర్కీ తాజా అధ్యక్ష ఎన్నికల్లో ఎర్డొగాన్ తన పట్టు నిలబెట్టుకున్నారు. ఎన్నికలు 'అత్యంత న్యాయవిరుద్ధంగా సాగా'యన్న ప్రత్యర్థి మాటలు ఎలావున్నా లెక్కల్లో అంతిమ విజయం ఎర్డొగాన్‌దే అయింది. దేశంలో ద్రవ్యోల్బణం ఆకాశానికి ఎగబాకినా, కరెన్సీ విలువ పాతాళానికి పడిపోయినా ఆయన మాత్రం ప్రపంచ వేదికపై దేశప్రతిష్ఠను పెంచానని పౌరులకు నమ్మబలికారు. కుర్దిష్ వేర్పాటువాదుల్ని తన ప్రత్యర్థి సమర్థిస్తున్నారంటూ నమ్మించారు. అతి జాతీయవాదంతో ఆధిక్యాన్ని నిలుపుకొన్నారు. అదే ఈ ఎన్నికల విద్దూరం.

2017లో రిఫరెండం ద్వారా టర్కీలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలనగా మార్చిందీ, ఆ పైన ప్రధాని పదవిని రద్దు చేసిందీ ఎర్డొగానే. న్యాయవ్యవస్థ, ఎన్నికల నిర్వహణ వ్యవస్థ సహా ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ నియంత్రణలో పెట్టుకున్న ఘనుడాయన. నైపుణ్యం కన్నా విధేయతే గీటురాయిగా అయినవాళ్ళతో వాటిని నింపేశారు. ప్రధాన స్రవంతి మీడియా అంతా చేతుల్లో ఉన్న ఆయనకు ఎన్నికల ప్రచారం పరాకాష్ఠకు చేరినవేళ 32 గంటల ప్రసార సమయం లభిస్తే, ప్రత్యర్థికి దక్కింది 32 నిమిషాలే. విజయానికై ఎంతకు దిగజారడానికైనా వెనుకాడకపోవడం ఆయన నైజం. దాంతో, దేశంలో ఎన్నడూ లేనన్నిసార్లు హత్యాయత్నం జరిగిన నేతగా పేరొందిన ప్రతిపక్షాల అభ్యర్థి కెమల్ కిలిచదరోగ్లూ చివరకు బహిరంగ సభల్లో బుల్లెట్ ప్రూఫ్ చొక్కా వేసుకొని, ప్రచారం చేయాల్సిన దుఃస్థితి. మాటల్లో సౌమ్యత, మనిషి కొంత మహాత్మా పోలికలతో 'గాంధీ కెమల్' అని ముద్దుగా అందరూ పిలుచుకొనే ప్రజాస్వామికవాది ఓడిపోయారు.

నిజానికి 600 సభ్యుల పార్లమెంట్‌కూ, అధ్యక్ష స్థానానికీ మే 14న జరిగిన ఎన్నికలు ప్రస్తుత అధ్యక్షుడిని ఇంటికి సాగనంపి, ప్రతిపక్షాల సమష్టి అభ్యర్థి కెమల్‌కు పట్టం కడతాయని భావించారు. ఎన్నికల జోస్యాలూ ఆ మాటే చెప్పాయి. తీరా జరిగింది వేరు. 6.4 కోట్ల మంది ఓటర్లలో 88 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొంటే, 49.5 శాతం ఓట్లు ఎర్డొగాన్‌కూ, 44.8 శాతం ప్రత్యర్థికీ వచ్చాయి. ఆయన కూటమి 'పీపుల్స్ అలయన్స్' పార్లమెంట్‌లో 323 స్థానాలు, ప్రత్యర్థి 'నేషన్ అలయన్స్'కు 213 స్థానాలు దక్కాయి. అధ్యక్ష పదవికి కావాల్సిన 50 శాతం ఓట్ల కోసం దేశ చరిత్రలో తొలిసారిగా కథ రెండో దఫా ఎన్నికల దాకా సాగింది. ఈ మదగజాల పోరులో సుమారు కోటి మంది సిరియన్ శరణార్థుల గోడు ఎవరికీ పట్టలేదు. ఇరుపక్షాలూ శరణార్థుల్ని వెనక్కి పంపేస్తామన్నాయి. సౌమ్యుడైన కెమల్ సైతం చివరకు ఓట్ల పునాదిని పెంచుకొనే వ్యూహంతో శరణార్థులపై కటువుగా మాట్లాడారు. అయినా లాభం లేకపోయింది. మే 28న రెండో దఫాలో 84 శాతం ఓట్లు పోలైతే, 48 శాతం వద్దే ప్రత్యర్థి ఆగిపోయారు. 52 శాతం ఓట్లతో ప్రస్తుత అధ్యక్షుడికే పట్టం దక్కింది.

ఇల్లలకగానే పండగ కాదన్నట్టు... ఎన్నికల్లో ఎర్డొగాన్ గెలిచారు కానీ, కథ అయిపోలేదు. అసలు కథ ఇప్పుడే మొదలైంది. ఇప్పటికి గెలిచినా, భిన్న ధ్రువాలుగా చీలిపోయిన దేశంలో, ఆయన అజెండాను ఇప్పటికీ 47 శాతం పైగా వ్యతిరేకిస్తున్నారని మర్చిపోరాదు. అందుకే, వరుసగా అయిదోసారి అధ్యక్షుడై, అధికారంలో మూడో దశాబ్దంలోకి అడుగిడుతున్న ఆయన ముంగిట అనేక సవాళ్ళున్నాయి. టర్కీలో ద్రవ్యోల్బణం 44 శాతానికి చేరింది. 2018 నుంచి ఇప్పటికి కరెన్సీ విలువ 80 శాతం క్షీణించింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 151 మిలియన్ డాలర్ల లోటులో పడ్డాయి. ఫిబ్రవరిలో 50 వేల మంది మరణించిన భారీ భూకంప వేళ సర్కార్ పనితీరూ అంతంత మాత్రమే. ఇన్ని కష్టాల మధ్యా యూఏఈ, సౌదీ, రష్యాల నుంచి గణనీయ విదేశీ సాయంతో బండి నెట్టుకొచ్చారు. రానున్న అయిదేళ్ళలో ఈ నిరంకుశ నేత ఆర్థికవ్యవస్థను ఎలా సుస్థిరం చేస్తారన్నది ఆసక్తికరం.

ఇక, భౌగోళికంగా ఆసియా – ఐరోపాల కొసన ఉండడం, ముస్లిమ్ ప్రపంచంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో వ్యూహాత్మకంగా అత్యంత కీలక ప్రపంచ దేశాల్లో టర్కీ ఒకటి. రష్యా నుంచి లాభపడుతున్న ఈ 'నాటో' సభ్యదేశపు విదేశాంగ విధానం స్పష్టమే. రష్యాకూ, పాశ్చాత్య ప్రపంచానికీ మధ్య సాగుతున్న ప్రస్తుత పోరాటంలో ఆ దేశం తన వైఖరిని మార్చుకోదు. పాశ్చాత్య ప్రపంచానికి కాక పుట్టేలా ప్రాంతీయంగా, విదేశీ వ్యవహారాల్లో వ్యూహాత్మక స్వతంత్రతను చూపనుంది. భారత్‌తో ఒకప్పుడు బలమైన బంధమున్నా, 370వ అధికరణం రద్దు తర్వాత కశ్మీర్‌పై ఎర్డొగాన్ ప్రకటనలు, పాక్‌తో సాన్నిహిత్యం నేపథ్యంలో మన సంబంధాలెలా ఉంటాయో వేచి చూడాలి.

మొత్తం మీద ఎన్నికలనేవి అన్నిసార్లూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్న నమ్మకాన్ని అందిస్తాయని చెప్పలేం. ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేసి, అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసే నిబంధనల్ని మార్చేసి, అసలు స్ఫూర్తికే తిలోదకాలిచ్చినప్పుడు ఎన్నికలు నామమాత్రమే! ప్రజాస్వామ్యం పేరుకే! సైన్యం తెర వెనుక ఉండి కథ నడిపే పాకిస్తాన్ సహా అనేక దేశాల్లో ఇదే ప్రహసనం. దశాబ్ది పైచిలుకుగా టర్కీలో ఎర్డొగాన్ చేసిందీ, జరిగిందీ ఇలాంటి ప్రజాస్వామ్య పరిహాసమే. కానీ, అధికారాన్ని నిలుపుకోవడానికి అక్కరకొచ్చిన ఈ ఆట ఆర్థిక కష్టాల్లోని దేశాన్ని ముందుకు నడిపించడానికి ఇకపైనా పనికొస్తుందా?

నిజాయితీయే నిజమైన విలువ

కామెంట్



కరణ్ థాపర్


చిన్మయ ఘరేఖాన్ రాసిన 'సెంటర్స్ ఆఫ్ పవర్: మై ఇయర్స్ ఇన్ ది ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్ అండ్ సెక్యూరిటీ కౌన్సిల్' అనే తాజా పుస్తకం ఆయన రాసుకున్న డైరీల ఆధారంగా రూపొందినది. పుస్తకంలోని రహస్యోద్ఘాటనలు ఇందిరా గాంధీని రెండు విధాలుగా చూపుతాయి. మనోహరంగా, ఆకర్షణీయంగా; అలాగే అభద్రత, అహంకారం కలిగి ఉండి, కుటుంబమే సర్వస్వం అయిన వ్యక్తిగా! ఇందిరా గాంధీలోని ఎవరికీ తెలియని మరికొన్ని కోణాలను కూడా ఘరేఖాన్ దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. ఈ విధంగా దేశాధినేతల గురించి, వారికి సమీపంగా దీర్ఘకాలం ఉన్నత పదవులను నిర్వహించినవారు తమ డైరీలలో నిజాయితీగా రాసి పెట్టుకున్న విశేషాలతో తెచ్చిన పుస్తకాలు ఎంతో విలువను, ప్రతిష్ఠను కలిగి ఉంటాయి.

డైరీలు రాసే సంప్రదాయం మన దగ్గర గట్టిగా లేకపోవడం సిగ్గు చేటు. మళ్లీ బ్రిటిష్ వాళ్లకు ఆ భాగ్యం ఉంది. అక్కడి శామ్యూల్ పెపిస్ నుంచి రిచర్డ్ క్రాస్‌మన్ వరకు, ఆపై ఉడ్రో వ్యాట్ దాకా... పఠనాన్ని మంత్రముగ్ధం చేస్తూ డైరీలు రాశారు. మరీ ముఖ్యంగా దేశాన్ని పాలిస్తున్న స్త్రీ, పురుషుల గురించి వారు తమ డైరీలలో మొత్తం బహిర్గతం చేశారు. లేకుంటే మనం ఆ విశేషాలను ఎప్పటికీ తెలుసుకోగలిగేవాళ్లం కాదు. వారి నిజాయితీనే ఆ డైరీలకుండే నిజమైన విలువ.

ఉడ్రో వ్యాట్ రాసిన మూడు సంపుటాల డైరీల గురించి నాటి 'సండే టైమ్స్' ఎడిటర్ ఆండ్రూ నీల్, ''ఈ దేశ పాలకులు, సామాజిక విశిష్టులకు సంబంధించి చేర్పులు లేని వాస్తవాలను ఇవి కలిగి ఉన్నాయి'' అని కితాబునిచ్చారు. మార్గరెట్ థాచర్ జీవిత చరిత్రకారుడైన ప్రముఖుడు చార్ల్స్ మోర్, ''ఆమె తన సన్నిహితుల సమక్షంలో ప్రజా కార్యక్రమాలపై వ్యక్తం చేసిన వ్యక్తిగత ప్రతిస్పందనలు తరచు ఆ డైరీలలో కనిపించేవి'' అని వ్యాఖ్యానించారు. ఇంకో మాటలో చెప్పాలంటే, అమూల్యమైన అంతర్నేత్ర దృష్టికి వారి డైరీలు నెలవుగా ఉండేవి.

ఇన్నాళ్లకు, మనకూ అలాంటి ఒక పోల్చుకోదగిన డైరీ లభ్యమైంది! చిన్మయ ఘరేఖాన్ రాసిన 'సెంటర్స్ ఆఫ్ పవర్: మై ఇయర్స్ ఇన్ ది ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్ అండ్ సెక్యూరిటీ కౌన్సిల్' అనే పుస్తకం ఆనాడు ఆయన రాసుకున్న డైరీల ఆధారంగా రూపొందినదే. పుస్తకంలోని విశేషాంశాలు ఇందిరా గాంధీని రెండు విధాలుగా చూపుతాయి. మనోహరంగా, ఆకర్షణీయంగా; అలాగే అభద్రత, అహంకారం కలిగి ఉండి, కుటుంబమే సర్వస్వం అయిన వ్యక్తిగా. మరోలా చెప్పాలంటే... ప్రధానమంత్రి వెనుక ఉన్న అసలు స్వరూపాన్నీ (కొన్నిసార్లు ఆ స్వరూపం లోపభూయిష్టంగా ఉంటుంది), అదే సమయంలో... అందరిలాంటి ఒక మామూలు మనిషినీ ఈ పుస్తకం దృగ్గోచరం చేస్తుంది.

మొదట చిన్న విషయాలు. సమావేశాలలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ తన చేతి గోళ్ల ఎగుడు దిగుడులను అందంగా సమం చేసుకుంటూ కనిపించేవారు. అయినప్పటికీ, ''సమావేశంలోని ఏ మాటా ఆమె చెవులను దాటి వెళ్లేది కాదు''. ఆమెకు కొన్ని గాఢమైన నమ్మకాలు ఉండేవి. ''ఇంటి నుండి ఆఫీసుకు బయల్దేరవలసిన ఘడియలను కూడా ఆమె జ్యోతిష్య పండితులు నిర్ణయించేవారు''. ఆమెలో హానికరం కాని 'పట్టిపీడించే ఆలోచనలు' (అబ్సెషన్స్) కొన్ని ఉండేవి. ''లేఖలు రాయడాన్ని ఇందిరా గాంధీ ఇష్టపడేవారు. అంతకంటే కూడా లేఖల చిత్తుప్రతుల్ని, ప్రసంగ పాఠాలను, సందేశాలను స్వయంగా సవరించడానికి ఆసక్తి కనబరిచేవారు''. ఇక ఆ పూట భోజనంలోకి ఏయే వంటకాలు ఉండాలన్నది నిర్ణయించడానికి గంటల సమయం వెచ్చించేవారు. కామన్‌వెల్త్ సదస్సుకు హాజరైన ప్రభుత్వాధినేతల కోసం ఆమె భారత దౌత్యవేత్త శంకర్ బాజ్‌పేయితో కలిసి మెనూ తయారీకి 45 నిముషాల సమయం తీసుకున్నారు. బ్రిటన్ రాణి గారికి ఉదయం పూట అల్పాహారంలో, మధ్యాహ్నం భోజనానికి, సాయంత్రం విందులోకి ఏమేమి తయారు చేస్తున్నారో ఆ జాబితానూ ప్రతిరోజూ తను చూడాలని కోరుకునేవారు.



చిన్మయ ఘరేఖాన్

బ్రిటన్ పట్ల ఇందిరా గాంధీ వైఖరి గురించి ఘరేఖాన్ తన పుస్తకంలో రాసిన విషయాలను చదివి నేను పరవశుడినయ్యాను. ''ప్రధాని ఇందిరా గాంధీ బ్రిటన్‌ను, ప్రధానంగా బ్రిటన్ రాచకుటుంబీకులను ఎప్పుడూ కూడా ఇష్టపడకుండా లేరు''. 1983లో రాణిగారికి లండన్‌లోని ఇండియన్ హై కమిషనర్ నివాస గృహంలో భోజన ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు... న్యూయార్క్ నుంచి నేరుగా భారత్‌కు తిరిగి వస్తున్న ఇందిరా గాంధీ అర్ధంతరంగా లండన్‌లో దిగి... భారత హై కమిషనర్, ఆయన భార్య ఆ ప్రత్యేక భోజన సందర్భాన్ని చక్కగానే నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని నిర్ధారించుకున్నారు. ''రాణి గారి సమక్షంలో ఎలా ప్రవర్తించవలసిందీ హై కమిషనర్‌కు చెప్పారు''. (ఎప్పుడూ కూడా రాణిగారి వైపు మీ వీపు భాగం తిరిగి ఉండకూడదని సూచించారు).

ఇందిరా గాంధీ తోట పని చేసేవారు. ఇంట్లో ఫర్నిచర్ అమరికల్లో తరచు మార్పులు చేస్తుండేవారు. వాకిళ్లకు, కిటికీలకు వేసే పరదాలలో కొత్త డిజైన్‌ల ఎంపిక కోసం ఇంటి అలంకరణ నిపుణులకు – ప్రత్యేక అతిథులను తోడుగా ఇచ్చి – విదేశాలకు పంపుతుండేవారు. ఆ ప్రత్యేక అతిథులలో రాజవంశీయుడైన మాధవరావు సింధియా కూడా ఒకరు.

1981లో ప్రిన్స్ చార్ల్స్ వివాహ మహోత్సవానికి హాజరు అయేందుకు అమితమైన ఆసక్తిని కనబరిచి కూడా చివరికి హాజరు కాలేకపోయినందుకు ఇందిరా గాంధీ ఎంతగానో నిరాశకు లోనయ్యారని ఘరేఖాన్ రాశారు. ''అప్పుడు ఆమెలో కనిపించిన ఆ స్థాయి నిస్పృహను మునుపెన్నడూ నేను చూడలేదు'' అని ఘరేఖాన్ తన డైరీలో పేర్కొన్నారు. చార్ల్స్ పెళ్లి వేడుకకు తను వెళ్లడం లేదని మొదట చెప్పిన రాష్ట్రపతి ఆ తర్వాత వెళ్లాలని నిర్ణయించుకోవడంతో ప్రధాని ఆగిపోవలసి వచ్చింది.

ఇందిరా గాంధీ నోబెల్ శాంతి బహుమతిని అమిత ఆపేక్షగా కోరుకున్నారని కూడా పుస్తకంలో ఉంది. బహుమతిని దక్కించే ప్రచారం కోసం ఒక కమిటీ కూడా ఏర్పాటైంది. ఆ కమిటీకి ఘరేఖాన్ అధ్యక్షుడిగా ఉన్నారు. నిజానికి 'ఘనత' పట్ల ఆమె భ్రాంతికి ఇదొక్కటే నిదర్శనం కాదు. ''ఇతర నాయకులను, చివరికి రాష్ట్రపతులను కూడా ఆమె తన దగ్గరికి పిలిపించుకోవడాన్ని గొప్పగా భావించేవారు''. ఆమె ప్రత్యేక సహాయకుడు ఆర్.కె. ధావన్ ఆమెను కలవవలసిందిగా రాష్ట్రపతులకు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా సమాచారం పంపేవారు.

ఇందిరా గాంధీలో ఉన్న ఒక వింతైన కోణాన్ని కూడా ఘరేఖాన్ దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. 1983 ఓస్లో పర్యటన సందర్భంగా సోనియా గాంధీ భారత రాయబారికి దిగువన ఉన్న వరుసలో కూర్చోవలసి వచ్చింది. ''అప్పుడు ప్రధాని ఇందిర... సోనియాను పైవరుసకు చేర్చారు''. అదేమీ నార్వే దేశ ప్రొటోకాల్‌కు అనుగుణంగా జరిగింది కాదు. సోనియాకు ప్రాముఖ్యం కల్పించడమే ఇందిరా గాంధీకి ప్రధానం అయింది.

నిజానికి రాయబారులను తక్కువగా చూడటం అసాధారణమేమీ కాదన్నట్లుగా కనిపించే అనేక సంఘటనల్ని ఈ పుస్తకం పేర్కొంది. ''ఇందిరా గాంధీ ఎంతో అలవోకగా రాయబారులతో ఉదాసీనంగా, ధిక్కారంగా ప్రవర్తించడాన్ని నేను గ్రహించాను'' అని రాసుకున్నారు ఘరేఖాన్.

ఘరేఖాన్ పేర్కొన్న సందర్భాలు ఎంత ఆసక్తిని రేకెత్తించేవీ, ఆంతరంగిక విషయాలను బహిర్గతం చేసేవీ అయినప్పటికీ... అవి ఇందిరా గాంధీ మరణించిన నలభై సంవత్సరాల తర్వాత పుస్తకంగా బయటికి వచ్చినవి. అదే మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీ హయాంలోని రాజకీయ ప్రముఖులెవరైనా డైరీలు రాసి ఉంటే అవి ఇప్పుడు ఇంకెంత ఆకట్టుకునేలా ఉంటాయో కదా? రచయితలకు కూడా ఆ డైరీలు ఆకర్షణీయతను తెస్తాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇక్కడెందుకీ ఎత్తుగడ?



గమనించండి. ఏ ఒక్క 'ధైర్యం గల జర్నలిస్టు' కూడా రెజ్లర్ల ఆరోపణల్లోని వివరాల్లోకి పోవడం లేదు. వాళ్లు మాట్లాడుతున్నదల్లా 'దేశం', 'గర్వం', 'పతకాలు'. ఈ జర్నలిస్టులే తరచుగా 'దుష్టుల చివరి ఆశ్రయం దేశభక్తి' అని ట్వీట్ చేస్తుంటారు.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అడిగితే ఇచ్చేయాలా?



పాకిస్తాన్ పాత్రికేయుల వివేకానికి ఎవరూ సాటిరారు. ఒక మహిళా జర్నలిస్టు ప్రకారం, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఒక బ్లాక్‌మెయిల్ చేసే సంస్థ. కాబట్టి ప్రపంచం ఒక్కటై దాన్ని మూసేయించాలి. ఎందుకు? ముందు ఇంటిని సంస్కరించుకొమ్మని చెప్పి పాకిస్తాన్‌కు డబ్బు ఇవ్వడానికి నిరాకరించినందుకు!

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

పవిత్ర స్నానం



నా భార్య మనసులోని కోరిక తీరింది – గంగా దసరా ఉత్సవ శుభవేళ (మే 30) రిషీకేశ్ దగ్గర పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించాం. హర్ హర్ గంగే, నమామి గంగే! (సిద్ధూ భార్య క్యాన్సర్‌తో పోరాడుతున్నారు.)

– నవజ్యోత్ సింగ్ సిద్ధు, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత

అంతా మాయ



ఇటీవలి వరకూ కోవిడ్ వల్ల కొందరు ఆరోగ్యవంతులైన యువతీ యువకులు చనిపోయారని అనుకున్నాను. కానీ ఆ సంఖ్య 'సున్నా' అయివుంటుందని ఎప్పుడూ ఊహించ లేదు. నిజం 'సున్నా'. ఇజ్రాయిల్ మంత్రిత్వ శాఖ అధికారిక ఆరోగ్య నివేదిక యాభై ఏళ్లలోపు వారిలో సున్నా మంది మరణించారని చెబుతోంది. అసలు మహమ్మారే లేదు కదూ!

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

వెనకేసుకొస్తున్నారు!



ఇన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్న రెజ్లర్లతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉంది. మన రెజ్లర్లను కాకుండా బీజేపీ ఆయన్ని కాపాడేంతగా ఆ ఎంపీ ప్రత్యేకత ఏమిటి?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అక్షర చిత్రకళా ప్రేమికుడు

బహుముఖ ప్రజ్ఞాశాలురు అరుదుగా ఉంటారు. అటువంటివారిలో శీలా వీర్రాజు ఒకరు. ఆయన చిత్రకళ, సాహిత్యం రంగాలలో అద్భుతంగా రాణించారు. ఓ పత్రికలో సబ్-ఎడిటర్ కమ్ ఆర్టిస్ట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1963 లో రాష్ట్రప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖలో అనువాదకుడుగా చేరారు. ఉద్యోగ జీవితంలో కొనసాగుతూనే తీరిక సమయాల్లో చిత్రాలు వేశారు. రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాలలోనూ ఉన్న పలు శిల్ప క్షేత్రాలను సందర్శించి చాలావాటిని తన రేఖల్లో బంధించారు. అలా వేసిన లేపాక్షి శిల్పాల స్కెచ్‌లను 1970లో హైదరాబాదు, బెంగుళూరు, జర్మనీలోని గోటింజెన్ నగరంలోనూ ప్రదర్శించారు. 1990లో ఈ స్కెచ్‌లను 'శిల్పరేఖ' పేరుతో వెలువరించారు. 2009లో 'శీలా వీర్రాజు చిత్రకారీయం' పేరుతో నీటి, నూనెరంగుల (వాటర్, ఆయిల్ కలర్స్) చిత్రాల పుస్తకాన్ని తీసుకొచ్చారు.

వీర్రాజు రచనల్లో ఎక్కువగా సున్నితమైన, హృదయగతమైన అంశాలు అగుపిస్తాయి. సంఘటన ప్రధానంగా కొన్ని కనిపించినా మనస్తత్వ చిత్రణ ప్రధానంగా రూపొందిన రచనలే ఎక్కువ. సాహిత్యంలోనూ, నిజ జీవితంలోనూ ఆయన కథలు, నవలల ఇతివృత్తాల్లో ప్రధానంగా ప్రేమ, స్నేహం, సౌందర్యారాధన, సౌజన్యం, సౌశీల్యం వంటి అంశాలే ఎక్కువగా చోటుచేసుకొన్నాయి.



శీలా వీర్రాజు

వ్యక్తుల మనస్తత్వాన్ని నిశితంగా పరిశీలించే ధోరణి, మనస్తత్వ చిత్రణ పట్ల ఆయనకున్న అభిలాష ఆయన రచనలన్నింటిలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 'వెలుగు రేఖలు', 'కాంతి పూలు', 'మైనా', 'కరుణించని దేవత' వంటి నవలలు శీలా వీర్రాజుకి ఎంతో పేరును తెచ్చాయి. 'కొడిగట్టిన సూర్యుడు', 'హృదయం దొరికింది', 'మళ్లీ వెలుగు', 'కిటికీ కన్ను', 'ఎర్రడబ్బా రైలు', 'శీలా వీర్రాజు కవిత్వం' (6 కవితా సంపుటాల గ్రంథం) వంటి కవితా సంపుటాలు వీర్రాజు సాహిత్య సృజనకు నిదర్శనం. వీరి కథలూ పలు సంపుటాలుగా వచ్చాయి. 'సమాధి', 'మబ్బు', 'శీలా వీర్రాజు కథలు', 'బండి చక్రం', 'రంగుటద్దాలు', 'పగా మైనస్ ద్వేషం', 'మనసులోని కుంచె', 'వాళ్ల మధ్య వంతెన', 'ఊరు వీడ్కోలు చెప్పింది' వంటివి ఎంతో ప్రజాదరణ పొందాయి. 'కలానికి అటూ ఇటూ' వ్యాస సంకలనం ఆయనకి మంచి పేరు తెచ్చింది.

'కొడిగట్టిన సూర్యుడు' కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ మొట్టమొదటి అవార్డు, 'మైనా' నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఉత్తమ నవల పురస్కారం, డా॥ బోయి భీమన్న వచన కవితా పురస్కారం, న్యూఢిల్లీ తెలుగు సాహితీ సమితి జీవన సాఫల్య పురస్కారం, అవంత్స సోమసుందర్ ట్రస్టు పురస్కారాలు వంటివెన్నో అందుకున్నారు. అంతటి ఘనత పొందిన 83 ఏళ్ళ శీలా వీర్రాజు 2022 జూన్ నెల 1వ తేదీన గుండెపోటుతో హైదరాబాదులో మరణించారు. ఆయన సాహిత్యానికీ, చిత్ర కళాసీమకూ చేసిన కృషిని ఎన్నటికీ మరువలేము.

– రేగుళ్ళ మల్లికార్జునరావు, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ

(రేపు శీలా వీర్రాజు ప్రథమ వర్ధంతి)

విజ్ఞానం రెక్కలు విరిస్తే మౌఢ్యం పురివిప్పదా?

అభిప్రాయం




ప్రొ॥ కట్టా సత్యప్రసాద్

జాతీయ విద్య, పరిశోధన, శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ఇటీవల ఒక సంచలన నిర్ణయం తీసుకొంది. పదవ తరగతి పాఠ్యాంశాల నుండి 'జీవ పరిణామ' సిద్ధాంతాన్ని తొలగించటం అది. 1859లో డార్విన్ జీవ పరిణామాన్ని శాస్త్రీయంగా ప్రతిపాదించిన తర్వాత మతం, సృష్టివాదులు చాలాకాలం పాటు వ్యతిరేకించారు. ఆటంకాలు కల్పించారు. సైన్సు సాధించిన విజయాలతో సంశయాలు సమసిపోయాయి. ఇప్పుడు డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం శాస్త్ర ప్రపంచంలో దాదాపు సర్వాంగీకారం పొందింది. కానీ ఇప్పటికీ ప్రకృతిలో జరుగుతున్న సహజ పరిణామాన్ని అంగీకరించడం ఇచ్ఛగించని వారు లేకపోలేదు. మన పాలకులు ఆ కోవకు చెందిన వారే! సైన్సుపై వారి వ్యతిరేకతలో భాగమే జీవ పరిణామంపై ఈ తాజా నిర్ణయం.

ఇది ఊహించిందే. గత కొన్ని సంవత్సరాలుగా మంత్రులు దీనిపై హేళనలు, వ్యతిరేకత చూపుతూనే ఉన్నారు. 2018లోనే మానవ వనరుల (విద్య) శాఖా మంత్రి 'కోతి నుండి మనిషి రావటాన్ని ఎవరి తాతలైనా చూశారా? చూసినట్లు చరిత్రలో ఆధారాలున్నాయా?' అంటూ జీవ పరిణామ సిద్ధాంతాన్ని గేలి చేయజూశారు. ఈ వ్యాఖ్య ప్రపంచ వ్యాపిత నిరసనలు రేకెత్తించింది. శాస్త్రజ్ఞులు గళం విప్పి ఖండించారు. సైన్సులో అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా పత్రిక 'నేచర్' దీనిపై స్పందించం గమనార్హం. ఇంతా జరిగాక మన అమాత్యులు కొంత లౌక్యంగా వెనక్కు తగ్గి జీవ పరిణామాన్ని వ్యతిరేకించే సదస్సులేమీ జరిపే ఆలోచన లేదనీ, పాఠ్యాంశంగా తొలగించేదీ లేదనీ వివాదానికి తెరదించారు. ఇప్పటి తొలగింపు నిర్ణయానికి ఆ ఎపిసోడ్ ఒక టీజర్ వంటిదేమో!

ఇంతకూ మనిషి కోతి నుండి పుట్టాడా? డార్విన్ సిద్ధాంతం అలా చెప్పిందా? మనుషులూ, కోతులూ రెండూ ప్రైమేట్స్ అనే క్రమానికి చెందినవి. మనుషులు కోతుల నుండి పరిణామం చెందలేదు. మనం చూస్తున్న ఏ ఇతర ప్రైమేట్ల నుండి కూడ ఆవిర్భవించలేదు. చింపాంజీతో పాటు మానవజాతి పూర్వీకులు ఒకరే. ఎప్పుడో 8–6 మిలియన్ సంవత్సరాల క్రితం జీవించిన ఆ కోతి వంటి జాతి నుండి మనతో సహా ఇతర హోమినిడ్లు వచ్చాయని జీవ పరిణామ సిద్ధాంతం చెబుతున్నది. వీటికి ఏమిటి ఆధారం? నియాండరతల్, డెనిసోవా గుహల్లో లభించిన మానవ రూప శిలాజాలు తిరుగులేని రుజువులుగా నిలిచాయి. డార్విన్ కేవలం శిలాజాలు, అవి చూపే సారూప్యతనే సాక్ష్యంగా చూపాడు. కానీ అణుజీవశాస్త్రం



అభివృద్ధితో డీఎన్ఏ లక్షణాలు, జీవుల మధ్య ఉండే ఏకత్వం, అవి చూపే వైవిధ్యం, సంబంధాలు నిర్ధారించటానికి సాధ్యమైంది.

గత సంవత్సరం నోబెల్ బహుమతి గెలుచుకున్న స్వాంటే పేబో శిలాజాల నుండి డీఎన్ఏను తీసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. శిలాజ డీఎన్ఏ అధ్యయనం లక్షలాది సంవత్సరాల క్రితం జీవించిన మనిషి జాతి పూర్వీకుల జన్యువులకూ నేటి ఆధునిక మానవుని జన్యువులకూ మధ్య ఉన్న సారూప్యతను రుజువు చేసింది. అందుకే నోబెల్ పురస్కారం లభించింది. శిలాజ నిదర్శనం ఉందంటే దొరికిన ఎముక లేదా పుర్రె లక్షల సంవత్సరాల నాటిదన్న గ్యారంటీ ఏమిటి? అనే నిత్య శంకితులకు స్వాంటే పేబో కచ్చితమైన జవాబు ఇచ్చారు. గణితంలో లెక్కలు ఎంత కచ్చితత్వాన్ని చూపిస్తాయో డీఎన్ఏ, జన్యు సంబంధిత ఫలితాలు కూడా అంతకుమించి నిక్కచ్చిగా ఉండటం విశేషం. ఈ నవ్య పరిశోధనలు డార్విన్ సిద్ధాంతానికి సరికొత్త రుజువుగా నిలిచాయి. కాలక్రమంలో పరీక్షలకు తట్టుకొని నిలిచిందే సరైన సిద్ధాంతమవుతుంది. నిక్కచ్చి రుజువులతో జీవపరిణామ సిద్ధాంతం మరింత సైంటిఫిక్‌గా, అంగీకార యోగ్యతను నిలబెట్టుకుంది.

పాఠ్యాంశాల నుండి ఈ సిద్ధాంతాన్ని తొలగించడానికి కోవిడ్‌ను కారణంగా చూపుతున్నారు. కోవిడ్ విషయాన్నే తీసుకుందాం! మన ప్రభుత్వం, మీడియా, వైద్యులు కోవిడ్ భయం పోలేదనీ, కొత్త 'వేరియంట్లు' వస్తున్నాయనీ ప్రజలను అప్రమత్తం చేయడం మన అనుభవంలోదే! అది వాస్తవం కూడా. వేరియంట్లు అంటే ఏమిటి? వైరస్ జన్యుక్రమంలో తేడా వస్తే అది కొత్త రకం లేదా వేరియంట్‌గా రూపొందుతుంది. ఇది యావన్మందీ అంగీకరించేదే. మరి డార్విన్ జీవ పరిణామం చెప్పేది కూడా అదే కదా! జీవుల జన్యుపదార్థంలో చోటు చేసుకునే మార్పులే నూతన జీవుల ఆవిర్భావానికీ కారణమవుతాయని! వైరస్ నుండి మానవుని వరకూ జరిగిన పరిణామానికి కాగడా పట్టే డార్విన్ సిద్ధాంతాన్ని పిల్లలకు దూరం చేసి ఏమి నేర్పాలనుకుంటున్నది మన ప్రభుత్వం? మనిషిని మనిషిగా నిలబెట్టి, స్వతంత్ర ఆలోచనాపరులుగా తీర్చిదిద్దటం కదా విద్య లక్ష్యం! సైన్సును మరుగుపరచటం, నిరాకరించటం సమర్థనీయం కాదు. సైన్సు దూరమయితే మౌఢ్యం పురులు విప్పుతుంది. అజ్ఞానపు చీకటి నుండి విజ్ఞాన ప్రపంచంవైపు మన విద్యార్థి లోకాన్ని నడిపించడం నేటి అవసరం.

వ్యాసకర్త జనవిజ్ఞాన వేదిక మాజీ (ఉమ్మడి) రాష్ట్ర అధ్యక్షులు

బుద్ధ బోధ సర్వస్వాలు

దేనిలో అయితే ఒక వస్తువును భద్రంగా అట్టిపెట్టుకొంటామో, అది పెట్టె అనబడుతుంది. దాన్నే సంస్కృతంలో పేటిక అనీ, ప్రాకృతంలో పిటకం అనీ అన్నారు. బుద్ధుడి కాలం 2600 ఏండ్ల క్రితం. ఆ కాలపు ప్రాకృత భాషలో పిటకం అనే పదానికి పెట్టె అనే కాకుండా, ధార్మిక వాఙ్మయం అనే అర్థం కూడా ఉండేది.

సమగ్ర బుద్ధవాణి అంతా వినయ పిటకం, సుత్త పిటకం, అభిదమ్మ పిటకం అనే మూడు భాగాలుగా విభజితమయ్యింది. వీటినే 'తిపిటకములు' (త్రిపిటకాలు) అంటారు. బుద్ధ వచనాలను మూడు పెట్టెల్లో పెట్టి కాపాడినారు గనుక వాటికి తిపిటకములు అనే పేరు వచ్చిందని చెప్పటం సరికాదు. బౌద్ధ వాఙ్మయాన్ని ఈ మూడు భాగాల్లో సంరక్షించి ఉంచినందున వీటిని తిపిటకములు అనటం ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఈ సంపూర్ణ సాహిత్యమంతా ఆ కాలపు జన భాష అయిన ప్రాకృతంలో ఒక భాగమయిన అర్ధమాగధి భాషలో ఉన్నది. ఈ భాష తిపిటకాల్ని పాలించి రక్షించినందున పాళీ అనబడింది. తిపిటక పాళీ అంటే తిపిటకాల్లో ఉన్న భాష. మొదట్లో ఏ ధార్మిక సంప్రదాయానికి చెందిన సాహిత్యమైనా, పిటకమనే పిలవబడేది. కానీ, రాను రానూ పిటకము అంటే బుద్ధ వచనాల్ని మాత్రమే సూచించే పదం అయింది. మూడు పిటకాల్లో ఉన్న ఉపదేశాలు మొత్తం 84,000. వీటిల్లో 82,000 బుద్ధునివి. 2,000 భిక్షువులవి. బుద్ధుడు చెప్తుండగా విని నేర్చుకొని తమ అనుభవానికి తెచ్చుకొన్న విషయాలనే భిక్షువులు చెప్పారు కాబట్టి వారి మాటలు కూడా శిరోధార్యమైనవి.



బుద్ధుని మహా పరినిర్వాణం తర్వాత సుభద్రుడనే వృద్ధ భిక్షువు తన సంతోషాన్ని ప్రకటిస్తూ అందరితో ఇలా చెప్పటం మొదలు పెట్టాడు: 'మనం బుద్ధుని నుండి విముక్తుల మైనాము. ఉపదేశాలతో ఆయన పీడిస్తుండేవాడు, ఇది ఉచితం, ఇది అనుచితం అని. ఇప్పుడు మనం ఇష్టం వచ్చింది చేస్తాం. ఏది ఇష్టం లేదో అది చెయ్యం.' ప్రముఖ శిష్యుడు, మహాస్థవిరుడైన మహాకాశ్యపుడనే భిక్షువు ఈ మాటలు విని ఖేద పడ్డాడు. బుద్ధవాణిని ఉన్నది ఉన్నట్లుగా సురక్షితం చేయ సంకల్పించాడు. 500 మంది సత్యసాక్షి స్థవిరులను ఒక చోట చేర్చి మూడు నెలల్లో రాజగృహంలో మొదటి 'సంగాయనం' (సహగానం) లేదా 'సంగీతి' ఏర్పాటు చేశాడు. సమస్త బుద్ధవాణిని శుద్ధ రూపంలో మౌఖికంగా సంగ్రహించి కూర్చారు. వినయ పిటకం విషయంలో ఉపాలి చెప్పినదాన్నీ, సుత్త పిటకం విషయంలో ఆనందుడు చెప్పినదాన్నీ ప్రామాణికంగా స్వీకరించారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.10.52 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** చిత్త తె.4.42 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.11.54 నుండి 1.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.32 నుండి 12.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.56 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.26.

పాకిస్తాన్ నుంచి క్షేమంగా..

- సీఎం చొరవతో బయటపడ్డ పాక్ బాధిత మత్స్యకారులు
- చేపల వేటకెళ్లి అక్కడి కోస్ట్‌గార్డుకి చిక్కి.. మూడేళ్ల పాటు జైలులో..
- ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్


మాట్లాడుతున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట (విశాఖ): ఐదు సంవత్సరాల పాటు పాకిస్తాన్ జైలులో మగ్గిపోయిన ముగ్గురు మత్స్యకారులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో బయట పడ్డారని ఆంధ్రప్రదేశ్ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. మంగళవారం విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఏపీ మరపడవల సంఘం కార్యాలయంలో విశాఖ చేరుకున్న మత్స్యకారులు పి.నారాయణరావు(ఐ.పోలవరం,పసువులంకగ్రామం), మైలపల్లి భాస్కరరావు (ఎచ్చెర్ల, కొయ్యాం గ్రామం), మాదే అన్నవరం (గజ్జికాయలపురం,కాట్రేకు కోన)తో కలిసి జానకీరామ్ విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్ బాధిత మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వీరికి అయిదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, మత్స్యకార భరోసా ఇవ్వాలని కోరారు. బతుకు తెరువు కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ముగ్గురు మత్స్యకారులు గుజరాత్ వీరావల్ ప్రాంతానికి వలస వెళ్లి చేపల వేట చేస్తూ 2018 నవంబర్‌లో పాకిస్తాన్ కోస్ట్ గార్డుకి చిక్కుకున్నారని ఏపీ సీఎం చొరవతో ఇప్పుడు బయట పడ్డారని వివరించారు. బుధవారం మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వీరిని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని జానకీరామ్ తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీకి సేఫ్టీ ఎక్స్‌లెన్స్ అవార్డు


సేఫ్టీ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకొంటున్న సింహాద్రి సేఫ్టీ డీజీఎం సదాశివరెడ్డి

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సింహాద్రి ఎన్టీపీసీకి 'సేఫ్టీ ఎక్స్‌లెన్స్' అవార్డు లభించింది. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ద్వారా సింహాద్రికి ఈ అవార్డు వచ్చింది. న్యూఢిల్లీలో హోటల్ లే మెరిడియన్‌లో ఈ నెల 29న జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నుంచి సింహాద్రి ఎన్టీపీసీ సేఫ్టీ విభాగం డీజీఎం పి.సదాశివరెడ్డి అవార్డును అందుకొన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

అనకాపల్లి జిల్లా పరవాడ దరి సింహాద్రి ఎన్టీపీసీలో రిజర్వ్ షట్‌డౌన్‌లో భాగంగా ఈ నెల 26న తాత్కాలికంగా నిలిపి వేసిన 2, 3 యూనిట్లలో మంగళవారం తెల్లవారు జామున విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. విద్యుత్ అవసరాల ఆధారంగా నాలుగో యూనిట్‌ను ఆదివారం అర్ధరాత్రి పునరుద్ధరించగా 2, 3 యూనిట్ల నుంచి మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. మొదటి యూనిట్ ఎప్పటిలా యథావిధిగా పనిచేస్తోంది. విద్యుత్ అవసరాల నేపథ్యంలో సంస్థలో నాలుగు యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతుందని సంస్థ అధికారులు తెలిపారు.

'ఘాట్'లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య


మొదటి ఘాట్ రోడ్‌లో వచ్చే వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఏఎస్పీ మునిరామయ్య

తిరుమల: తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెలుపల ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య, ఎంవీఐ కుసుమతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణలో భాగంగా ఘాట్ రోడ్డులోని ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్, విజిలెన్స్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 3 బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఘాట్ రోడ్డులో ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి వేగ నిరోధకాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఫాస్ట్ ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో ర్యాండమ్‌గా వాహనాలను ఫిట్‌నెస్ తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. తిరుమలకు వచ్చే ప్రతివాహనం 6 నెలలకోసారి కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొంది మాత్రమే రావాలని ట్యాక్సీ, సొంత వాహన యజమానులకు సూచించారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను తిరుమలకు తీసుకురావద్దని కోరారు. ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలకు గురయ్యే వాహనాలైన తుఫాన్, టెంపో వాహనాలను తిరుమలకు నిషేధించడమా, నియంత్రించడంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఎలక్ట్రిక్ బస్సు ప్రమాదంలో తిరుమల ట్రాఫిక్ విభాగంతో పాటు, ట్రాన్స్‌పోర్ట్ విభాగం కూడా దర్యాప్తు చేస్తోందని చెప్పారు. డ్రైవర్ నిర్లక్ష్యమా, సాంకేతిక లోపమా అనే విషయం దర్యాప్తులో తేలుతుందన్నారు. ఘాట్ రోడ్డులో అనుభవం ఉన్న డ్రైవర్లు మాత్రమే రావాలని సూచించారు. అధికారులందరూ కలిసి జీఎన్‌సీ టోల్ గేట్ వద్ద వాహన రికార్డులను పరిశీలించారు.

హజ్ యాత్రకు జూన్ 7న తొలి విమానం

విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు • రోజుకు 155 మంది హజీల పయనం



సాక్షి, అమరావతి: ఏపీకి చెందిన హజ్ యాత్రికులు ఈసారి విజయవాడ (గన్నవరం) విమానాశ్రయం నుంచి ప్రయాణం ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చేసిన కృషి ఫలించడంతో విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటైంది. దీంతో హజ్ యాత్రకు శ్రీకారం చుడుతూ జూన్ 7 న విజయవాడ నుంచి తొలి విమానం ఎగరనుంది. రోజుకు 155 మంది హజీలు విజయవాడ నుంచి వెళ్లనున్నారు. ఒక్కో బృందం 41 రోజుల పాటు హజ్ యాత్రను చేపట్టనుంది. ఏపీ నుంచి హజ్ యాత్రకు 2,116 మంది ఎంపికవ్వగా వీరిలో 1,115 మంది పురుషులు..1,001 మంది మహిళలున్నారు. కాగా, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,814 మంది వెళ్తున్నారు. అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు చెందిన హజీలు బెంగళూరు నుంచి వెళతారు. కృష్ణా, గుంటూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప తదితర జిల్లాలకు చెందిన వారు హైదరాబాద్ నుంచి వెళ్లనున్నారు. హజ్ యాత్రను విజయవంతం చేసేలా ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏపీ హజ్ కమిటీ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ పూర్తి చేసి యాత్రకు మార్గదర్శకాలను హజీలకు అందజేసింది. విజయవాడ-గుంటూరు ఎన్‌హెచ్‌లోని నంబూరు వద్ద మదరసాలో బస ఏర్పాట్లు చేసి భోజన, వసతి, రవాణా వంటి విభాగాల వారీగా కమిటీలను వేసి యాత్ర విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఒక్కో హజీకి రూ.3.8 లక్షల ఖర్చు

హజ్–2023కు దేశంలో 22 ఎంబార్కేషన్ పాయింట్‌లు ఉండగా వాటి నుంచి వెళ్లే హజీలు ఒక్కొక్కరికి ఎంత ఖర్చు అవుతుందన్నది కేంద్ర హజ్ కమిటీ నిర్ణయించింది. వాటిలో బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌ల నుంచి వెళ్లే వారికే తక్కువ ఖర్చు కానుంది. వాటితో పోల్చితే విజయవాడతో పాటు మరో 9 ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి వెళ్లేవారిపై అదనపు భారం పడుతోంది. కాగా, ఒక్కొక్క హజీకి విజయవాడ నుంచి రూ.3,88,580 గా ఖర్చును కేంద్ర హజ్ కమిటీ నిర్ణయించింది. ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారిపై పడుతోన్న అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తెలిసిన వెంటనే సీఎం జగన్ ఆదేశాలతో ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ అజామ్‌లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతిఇరానీ, కేంద్ర హజ్ కమిటీని సంప్రదించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే వారిపై అదనపు భారం తగ్గించే పరిస్థితి లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే హజీలపై పడుతోన్న అదనపు ఖర్చుల భారం రూ.14.51 కోట్లను విడుదల చేసింది.

రెండు గంటల పాటు చెట్ల కొమ్మల్లో..

- రక్షించిన స్థానికులు


వీరాంజనేయులును రక్షిస్తున్న స్థానికులు, గ్రానైట్ కార్మికులు

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరులో మంగళవారం కురిసిన భారీ వర్షానికి శివారు గ్రామమైన డేగరమూడి వాగుపై నేల చప్టా పైనుంచి ప్రవహించే నీటి ఉధృతికి ఓ ద్విచక్ర వాహనదారుడు వాగులో కొట్టుకెళ్లాడు. సుమారు రెండు గంటల పాటు ప్రాణాలు అరచేత పట్టుకుని తుమ్మచెట్ల కొమ్మలు పట్టుకుని వేలాడుతున్న బాధితుడ్ని డేగరమూడి వాసులు, స్థానిక గ్రానైట్ కార్మికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన పూనమనేని వీరాంజనేయులు (60) ద్విచక్ర వాహనంపై మార్టూరు నుంచి స్వగ్రామం బోడవాడకు బయలు దేరాడు. మండలంలోని ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి డేగరమూడి నేల చప్టాపై సుమారు రెండున్నర అడుగుల ఎత్తున నీరు ప్రవహించసాగింది. వీరాంజనేయులు ద్విచక్ర వాహనంపై వాగు దాటి అవతల వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రవాహ వేగానికి బైకుతో సహా వాగులో కొట్టుకుని వెళ్లాడు. నీటి ప్రవాహంలో కొట్టుకెళ్తున్న వీరాంజనేయులు అలా వెళుతూనే వాగుకు కుడి వైపు కట్టపై గుబురుగా పెరిగి ఉన్న తుమ్మ చెట్ల కొమ్మలు పట్టుకుని వేలాడుతూ రక్షించమని అరవసాగాడు. ఈ క్రమంలో గ్రామస్తులు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్రానైట్ కార్మికులు సబాన్, అవినీస్, సుభాష్ నిచ్చెనలు, తాళ్ల సాయంతో వాగులో దిగి వీరాంజనేయులుకు నిచ్చెన అందించి క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. సుమారు రెండు గంటల పాటు ప్రాణభయంతో తీవ్ర ఆందోళనకు గురైన వీరాంజనేయులును సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, ఏఎస్ఐ మహబూబ్ బాషా, సిబ్బంది సాయంతో తమ వాహనంలో ఎక్కించుకుని చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉన్మాదుల్లా.. కులవాదులు

975వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు




తాడికొండ: టీడీపీ ముసుగులో ఉన్న కులవాదులను నిత్యం చంద్రబాబు రెచ్చగొడుతున్న కారణంగా వారు అరాచక శక్తుల్లా తయారై ఉన్మాదంగా వ్యవహరిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 975వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. నిత్యం నిరసనలు, ధర్నాలు చేస్తూ అమరావతి అభివృద్ధికి బాబు, ఆయన సామాజిక వర్గమే అడ్డంకిగా మారిందని, పేదలకు ఇళ్ల స్థలాలివ్వడం ఇష్టంలేని వీరంతా అడ్డగోలు రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులవాదమే అజెండాగా రాష్ట్రంలో కుళ్లు రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటని, బాబు ఎన్ని ఎత్తుగడలు వేసినా చివరకు న్యాయం వైపే మొగ్గు ఉంటుందని తెలుసుకోవాలన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ–తిరుపతి–కాకినాడ టౌన్ మధ్య నడుపుతున్న వేసవి ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ–తిరుపతి ప్రత్యేక రైలు (07061) జూన్ 1న, తిరుపతి–కాచిగూడ (07062) జూన్ 2న, కాచిగూడ–కాకినాడ టౌన్ (07417) జూన్ 3న, కాకినాడ టౌన్–కాచిగూడ జూన్ 4న నడపనున్నట్లు తెలిపారు. అదే విధంగా సికింద్రాబాద్–డిబ్రుగర్ (07046) ప్రత్యేక వారాంతపు రైలు జూన్ 5, 12, 19, 26 తేదీలలోనూ, డిబ్రుగర్–సికింద్రాబాద్ (07047) రైలు జూన్ 8, 15, 22, 29 తేదీలలో నడపనున్నట్లు పేర్కొన్నారు.

2 నుంచి తిరుమలలో జ్యేష్ఠాభిషేకం

- మూడు రోజుల పాటు నిర్వహణ
- 4వ తేదీన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఆర్జిత సేవలు రద్దు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూన్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి, శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానసాగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం అలంకరించి ఊరేగిస్తారు. రెండోరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడో రోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచం మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు బంగారు కవచంతోనే ఉంటారు. జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్ 4వ తేదీ కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తుంది.

తెలంగాణ

రూ.2 వేల వాచీ.. రూ.59 వేలకు విక్రయం!

విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ముసుగులో క్యూ-నెట్ సంస్థ దందా

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఈ ఏడాది మార్చిలో జరిగిన అగ్నిప్రమాదం క్యూ-నెట్ మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) సంస్థ అక్రమ దందాను మరోసారి తెరపైకి తెచ్చింది. ఆ దుర్ఘటనలో చనిపోయిన ఆరుగురూ దీని ఉద్యోగులే. ఈ ఘటనపై నమోదైన కేసులను దర్యాప్తు చేసిన హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు.. ఈ సంస్థ సౌత్ ఇండియా ఆపరేషన్స్ హెడ్ గుమ్మడిల్లి రాజేశ్ అలియాస్ రాజేశ్ ఖన్నాను బెంగళూరులో అరెస్టు చేశారు. ఈ సంస్థ ఎంఎల్ఎం పేరిట తక్కువ ఖరీదైన వస్తువులను అత్యంత ఎక్కువ రేటుకు అమ్ముతోందని.. రూ.2 వేల వాచీని రూ.59 వేలకు విక్రయించినట్టు ఆధారాలు సేకరించామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

కేసులు నమోదవడంతో పేరు మార్చి..

హాంకాంగ్ కేంద్రంగా ఎంఎల్ఎం దందా చేస్తున్న క్యూ-నెట్‌పై అనేక కేసులు నమోదవడంతో.. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్, 'వీ-ఎంపైర్' పేర్లతో మళ్లీ దందా ప్రారంభించింది. ఈ సంస్థలో టెలీకాలర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ప్రమోటర్స్, టీమ్ లీడర్లుగా చాలామంది పనిచేస్తున్నారు. స్వప్నలోక్ కాంప్లెక్స్ ఐదో అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 511లో దీని కార్యాలయం ఉంది. రాజేష్ ఖన్నా, ఉపేందర్‌రెడ్డి, శివనాగ మల్లయ్య, కటకం మల్లేశ్, నాగమణి సహా 12 మంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా కనీసం రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు సంపాదించవచ్చంటూ ఎరవేయడం.. ఇప్పటికే 'వీ-ఎంపైర్'లో చేరినవారు నెలకు రూ.50వేల నుంచి రూ.1.5లక్షల దాకా సంపాదిస్తున్నారని అమాయకులకు ఎర వేస్తున్నారు.

మూడు కోట్లు వసూలు చేసి..

దీనిపై దర్యాప్తు చేసిన పోలీసు బృందం.. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే 159 మంది బాధితుల నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది. దేశవ్యాప్తంగా ఇంకా ఎంతో మంది బాధితులు ఉంటారని పోలీసులు తెలిపారు. రాజేశ్ ఖన్నా వద్ద లభించిన 35 బ్యాంకు ఖాతాల్లోని రూ.54 కోట్ల నగదును ఫ్రీజ్ చేశామని.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని వెల్లడించారు.

ఐపీఎల్ కప్‌కు చెన్నై శ్రీవారి ఆలయంలో పూజలు



సాక్షి, చెన్నై: ఐపీఎల్ విజేత చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు మంగళవారం సాయంత్రం చెన్నైకి చేరుకుంది. 16వ సీజన్‌లో సాధించిన కప్‌కు చెన్నై టీనగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు ఓనర్ ఎన్.శ్రీనివాసన్, టీటీడీ స్థానిక సలహామండలి చైర్మన్ ఏజే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

డైరెక్ట్ సెల్లింగ్ పేరిట రూ.1000 కోట్ల దందా!

దేశవ్యాప్తంగా వందల మందిని ముంచిన ఈ-స్టోర్ ఇండియా

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో ప్రారంభమైన ఈ-స్టోర్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా రూ. 1,000 కోట్ల దందా సాగించినట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. ప్రధానంగా రెండు రకాలైన స్కీములతో అమాయకులను ఆకర్షించి భారీ స్కామ్‌కు పాల్పడినట్లు తేల్చారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. డీసీపీ డాక్టర్ పి.శబరీష్, ఏసీపీ ఎస్.అశోక్ కుమార్‌లతో కలసి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. యాక్సస్ ఈ-కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ ఆయుర్‌కేర్ హెల్త్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ-స్టోర్ ఇండియాను నిర్వహిస్తోంది. దీనికి హిమాయత్‌నగర్, మలక్‌పేట ప్రాంతాలకు చెందిన మనీష్ కత్రి, సయ్యద్ అజ్మల్ సజ్జద్ మార్కెటింగ్ ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద నమోదు చేసుకున్న యాక్సస్ ఈ కార్ప్ సంస్థ తమ స్కీమ్‌లకు ప్రభుత్వ అనుమతి ఉందని నమ్మబలుకుతూ నిరుద్యోగులకు ఎర వేస్తోంది.

ఈ రెండు స్కీముల పేరుతో...

ఇండివిడ్యువల్ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ కింద అనేక మందిని ఈ-స్టోర్ ఇండియా సభ్యులుగా చేర్చుకుంది. ఎవరైనా రూ. 8,991 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే వారికి సంస్థ రూ. 9 వేల విలువైన ఆయుర్వేద ఉత్పత్తులు, కంపెనీ పేరుతో ఉన్న బోర్డు అందిస్తుంది. బోర్డును తమ ఇల్లు, దుకాణం ముందు తగిలించి ఆ ఫొటోను సంస్థకు పంపాలి. అప్పటి నుంచి కంపెనీ 36 నెలలపాటు నెలకు రూ. 1,100 చొప్పున ఇస్తామని చెప్పి పన్ను మినహాయింపుల తర్వాత రూ. 825 కొంతకాలం చెల్లిస్తుంది. ఈ సభ్యుడికి ఓ గుర్తింపు నంబర్ ఇచ్చి మరో రూ.9 వేల విలువైన ఈ-స్టోర్ ఉత్పత్తులను కొనేలా చేస్తుంది. అందుకు ప్రతిగా కొంతకాలం సభ్యుడికి చెల్లింపులు చేసి ఆపై బోర్డు తిప్పేస్తుంది. ఇక సూపర్ మార్కెట్ స్కీమ్‌లో పెట్టుబడి భారీగా ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ. 25 లక్షల చొప్పున చెల్లించి సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలి. దీనికి అద్దె, మౌలికవసతులు, ఉద్యోగులను తామే ఏర్పాటు చేస్తామని కంపెనీ నమ్మబలుకుతుంది.

వందల మంది నుంచి రూ. కోట్లు..

ఈ సంస్థ స్కీముల్లో చేరి దేశవ్యాప్తంగా అనేక మంది రూ. వందల కోట్లు నష్టపోయారు. ఇప్పటివరకు రూ. 1000 కోట్ల దందా చేసిన ఈ-స్టోర్ ఇండియా 300 మందిని ముంచింది. వారిలో రాష్ట్రానికి చెందిన 44 మంది కూడా ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు 9 మందిని నిందితులుగా గుర్తించి మనీష్, అజ్మల్ సజ్జద్‌లను అరెస్టు చేశారు.

చర్మం.. జర భద్రం!



సన్ బర్న్స్‌తో జాగ్రత్త అంటున్న నిపుణులు

- ఎండలో ప్రయాణాలతో చర్మ సమస్యలు • వేసవిలో బిగుతు వస్తువులు ధరించడంతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

లబ్బీపేట (విజయవాడ తూర్పు)

రాష్ట్రంలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఈ దశలో బయట తిరగడం వల్ల చర్మ సంబంధ వ్యాధులు సోకుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడతాయి. ఇవి మానవ శరీరంపై చర్మ వ్యాధులతోపాటు ఇతర సమస్యలు కలగజేస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సన్ బర్న్స్, రాష్ (చెమట పొక్కులు), చెమట గ్రంథుల వల్ల ఏర్పడే గడ్డలు (ఉడుకు గడ్డలు), ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, చికున్ ఫాక్స్, సన్ ఎలర్జీ, ఇతర చర్మ వ్యాధులతోపాటు మహిళలు మంగు వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎండలో తిరిగే వారితోపాటు ఉక్కపోత ప్రాంతాల్లో ఉండే వారు సైతం ఇలాంటి వ్యాధుల బారిన పడతారు. ఎండాకాలంలో వచ్చే సమస్యలివీ.

సన్ బర్న్స్

ఎండలో ఎక్కువగా తిరిగే వారు సన్ బర్న్స్‌కు గురవుతుంటారు. దీనివల్ల చర్మం అంతా కాలినట్టు మచ్చలు ఏర్పడతాయి. దీనిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. సన్‌బర్న్స్‌కు గురైన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నీరు, పానీయాలు సేవించాలి.

ఉడుకు గడ్డలు

ఇవి చెమట గ్రంథుల వల్ల ఏర్పడతాయి. అధిక ఉష్ణోగ్రతల్లో ఉండే వారికి ఎక్కువగా వస్తుంటాయి. చిన్నపాటి సెగ గడ్డలుగా వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. వీటి నివారణకు క్రీమ్స్, పౌడర్స్ అందుబాటులో ఉన్నాయి. వైద్యుని సలహా మేరకు యాంటీబయోటిక్ మందులు వాడాలి.

చెమట కాయలు

ఎండలో తిరిగే వారికి ఎక్కువగా రాష్ వస్తుంది. గాలి సోకని మందమైన దుస్తులు, సిల్క్ దుస్తులు ధరించిన వారు దీని బారిన పడతారు. దీనివల్ల చర్మమంతా కంది పోయినట్టు అనిపించడం, పొక్కులు రావడం జరుగుతుంది. వీటిని వైద్యుని సలహా మేరకు సన్‌స్క్రీన్ లోషన్స్ వాడటం ద్వారా అరికట్టవచ్చు.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

బిగుతుగా ఉండే వస్త్రాలు ధరించే వారికి.. స్నానం చేసిన తర్వాత చర్మాన్ని సరిగ్గా తుడుచుకోకుండా వస్త్రాలు ధరించే వారికి ఎక్కువగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. తొడల మధ్య తామర మాదిరిగా వచ్చి దురదలు ఎక్కువగా ఉంటాయి. ఇటువంటి వారు గోరు వెచ్చని నీటితో స్నానం చేయడంతోపాటు తేమ లేకుండా చర్మాన్ని శుభ్రంగా తుడిచి సంబంధిత కౌలనైన్ లోషన్లు రాయడం ద్వారా అరికట్టవచ్చు.

చికెన్‌ఫాక్స్

వేసవిలో వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో చికెన్‌ఫాక్స్ కూడా ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధిపై మూఢనమ్మకాలు ఉండటంతో ఎక్కువ మంది మందులకు దూరంగా ఉంటారు. దీంతో ముఖంపై గుంటలు పడటం వంటివి చోటుచేసుకుంటాయి. సకాలంలో మందులు వాడితే చర్మంపై ప్రభావం పడదు. సన్ ఎలర్జీతో చర్మంపై దద్దుర్లు , దురదలు వస్తాయి. దీని కారణంగా రాత్రి వేళ నిద్ర సరిగా పట్టదు.

ఈ జాగ్రత్తలు మేలు

- వేసవిలో శరీరానికి నూనె వంటి పదార్థాలు, సన్‌స్క్రీన్ లోషన్స్ రాసుకోవాలి.
- ఎక్కువగా ఎండకు ఎక్స్‌పోజ్ కాకుండా గొడుగు, తలకు టోపీ ధరించాలి.
- లూజు దుస్తులు, కాటన్ దుస్తులు వేసుకోవాలి.
- రాత్రి వేళల్లో సైతం గాలి సోకే ప్రదేశంలో నిద్రించాలి.
- స్నానం అనంతరం చర్మానికి పౌడర్ రాసుకుంటే చెమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు నివారించవచ్చు.
- ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ సోకిన వారు వాడిన టవల్స్‌ను మరొకరు వాడితే వారికీ ఇవి సోకే అవకాశం ఉంది. అందువల్ల టవల్స్‌ను వేడి నీటితో నానబెట్టి వాష్ చేయాలి.

ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలి

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా.. తగిన జాగ్రత్తలు పాటిస్తే చర్మ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. చికున్‌ఫాక్స్ విషయంలో మూఢనమ్మకాలకు పోకుండా మందులు వాడితే దాని ప్రభావం ముఖంపై పడదు. తేలికపాటి ఆహారం, ఆకు కూరలు, పళ్లు తీసుకుంటే చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవచ్చు.

– డాక్టర్ సీహెచ్ మమత, డెర్మటాలజిస్ట్, విజయవాడ

క్లుప్తంగా

బీజేపీపై శివసేన షిండే వర్గం అసంతృప్తి

సామ్నా సంపాదకీయంలో వెల్లడి

ముంబై: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన వర్గం అసంతృప్తితో రగిలిపోతోందని శివసేన(యూబీటీ) చెందిన సామ్నా పత్రిక పేర్కొంది. బీజేపీ తమ పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందంటూ 22 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు భావిస్తున్నారని, వీరు షిండే వర్గాన్ని వీడుతారని అందులో తెలిపింది. ఎంపీ గజానన్ కీర్తికార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా సామ్నా ఉటంకించింది. బీజేపీ కుట్రతో బందీలుగా మారిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడు బలవుతారో చెప్పలేమని వ్యాఖ్యానించింది. అదేవిధంగా, సీఎం షిండేను నడిపించేది డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలన్నీ బీజేపీ నేత ఫడ్నవీస్ వద్దే ఉన్నాయని సామ్నా పేర్కొంది. బీజేపీ చూపించిన సవతి తల్లి ప్రేమను జీర్ణించుకోలేకనే, ఆత్మగౌరవం కోసం 2019లో ఆ పార్టీతో అవిభాజ్య శివసేన సంబంధాలు తెంచుకున్నట్లు వివరించింది.

భారత్ అధ్యక్షతన జూలైలో ఎస్‌సీవో వర్చువల్ భేటీ

న్యూఢిల్లీ: జూలై 4న వర్చువల్‌గా జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి భారత్ అధ్యక్షత వహించనుందని విదేశాంగ శాఖ మంగళవారం తెలిపింది. సమావేశం వర్చువల్‌గా జరపడానికి కారణాలను మాత్రం వెల్లడించలేదు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం ఉజ్బెకిస్తాన్ రాజధాని సమర్కండ్‌లో జరగ్గా ప్రధాని మోదీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా అగ్రనేతలు హాజరయ్యారు. వంతుల వారీగా ఎస్‌సీవో భేటీ అధ్యక్ష బాధ్యతలు మొట్టమొదటిసారిగా భారత్‌కు దక్కాయి. ఈసారి భేటీకి భారత్‌తోపాటు సభ్యదేశాలైన చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, పాకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లతోపాటు పరిశీలక హోదాలో ఇరాన్, బెలారస్, మంగోలియాలను, అతిథిగా తుర్క్‌మెనిస్తాన్‌ను ఆహ్వానించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

కాంబోడియా రాజుతో ప్రధాని మోదీ చర్చలు

న్యూఢిల్లీ: కాంబోడియాతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ తెలిపారు. మొట్టమొదటిసారిగా భారత్‌లో పర్యటనకు వచ్చిన కాంబోడియా రాజు నొరొదొమ్ సిహమొని ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని ఈ సందర్భంగా సిహమొనికి హామీ ఇచ్చారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తెలిపింది. తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను సిహమొని కలిశారు.

చేతులు కలిపారా?



కర్ణాటక ఫార్ములాను రాజస్తాన్‌లో కూడా కాంగ్రెస్ హైకమాండ్ ప్రయోగించింది. ఉప్పు నిప్పుగా ఉన్న ఇద్దరు కీలక నేతలు అశోక్ గెహ్లాట్, సచిన్ పైలెట్‌ను ఒక్కటి చేసింది.

రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో ఇరువురు నేతలు కలిసి పనిచేయడానికి ఒప్పించింది. మరి గెహ్లాట్, పైలెట్ చేతులు కలిపినట్టేనా ? ఎన్నికల్లో కలసికట్టుగా పని చేస్తారా ? ఆచరణలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి.

కర్ణాటకలో సిద్దరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య విభేదాలను పరిష్కరించి ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ అదే ఫార్ములాను రాజస్తాన్‌లోనూ ప్రయోగించింది. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్‌ల మధ్య రాజీ కుదర్చడానికి స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో గెహ్లాట్, పైలెట్‌లు రాహుల్‌తో చర్చించాక ఇరువురు నేతలు కలిపి పని చేస్తారని కాంగ్రెస్ హైకమాండ్ చేసిన ప్రకటనపై రాష్ట్ర నేతల్లో విశ్వాసం కలగడం లేదు. ఎందుకంటే బీజేపీ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ కోసం సచిన్ పైలెట్ రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టిన గడువు బుధవారంతో ముగుస్తుంది. ఈ లోగా అధ్యక్షుడు ఖర్గే లేదంటే సీఎం నుంచి ఏదో ఒక ప్రకటన రాకపోతే సచిన్ పైలెట్ వ్యూహం ఎలా మార్చుకుంటారోనన్న ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి. రాహుల్‌తో భేటీలో ఈ సమస్యలకైతే సామరస్యపూర్వక పరిష్కారం లభించలేదు.

ఖర్గే వ్యూహం ఏంటి?

ఈ ఏడాది నవంబర్‌లోనే ఎన్నికలు ఉండడంతో ఇరువురు నేతల మధ్య పూర్తి స్థాయి అవగాహన కుదర్చడానికి సమయం అంతగా లేదు. చాలా తక్కువ సమయంలో ఇద్దరికీ సంతృప్తికరమైన చర్యలు ఎలా చేపడతారన్నది మరో పెద్ద సవాల్‌గా ఉంది. అశోక్ గెహ్లాట్ ప్రభుత్వ ప్రతిష్ట గత కొన్ని నెలలుగా మసకబారుతోంది. ఈ విషయంలో సీఎంకు అధ్యక్షుడు ఖర్గే ఘాటైన హెచ్చరికలు పంపినట్టు సమాచారం. కర్ణాటక తరహా ఫలితాలు రావాలంటే జూలై నాటికే 60% అభ్యర్థుల్ని ప్రకటించాలని అధ్యక్షుడు ఖర్గే గట్టిగా కసరత్తు చేస్తున్నారు. అది జరగాలంటే పైలెట్‌కు పీసీసీ అధ్యక్ష పదవి లేదంటే ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుంది. పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చి పైలెట్ అనుచరులకే అధికంగా సీట్లు ఇస్తే అధికార వ్యతిరేకత నుంచి కూడా బయటపడవచ్చునని ఖర్గే భావిస్తున్నారు. దీనిపై ఖర్గే, హైకమాండ్ ఒక మాట మీదకొస్తే పైలెట్‌ను పీసీసీ చీఫ్‌గా అంగీకరించడమో లేదంటే తానే సీఎం పదవికి రాజీనామా చేయడమో గెహ్లాట్‌కు అనివార్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం గెహ్లాట్ తన అనుచరులతో మాట్లాడుతూ అందరూ సహనంగా ఉండాలని పిలుపునిచ్చారు. పైలెట్‌కు పార్టీలో ఏ పదవి ఇవ్వాలో హైకమాండ్ నిర్ణయిస్తుందన్నారు. తనకు పదవి ముఖ్యం కాదని, ఎన్నికల్లో గెలుపు కోసం హైకమాండ్ ఏం చెబితే అదే చేస్తానని వ్యాఖ్యానించడం కొసమెరుపు మొత్తమ్మీద సచిన్ పైలెట్ తండ్రి, దివంగత రాజేశ్ పైలెట్ వర్ధంతి జూన్ 11 లోపు పైలెట్‌కు పార్టీలో కీలక పదవి ఇచ్చే అవకాశాలైతే అధికంగా కనిపిస్తున్నాయి.

చిక్కుముళ్లు ఎలా విప్పుతారో..!

అశోక్, పైలెట్ మధ్య విడదీయలేని చిక్కుముళ్లు ఎన్నో ఉన్నాయి. వసుంధరా రాజె ప్రభుత్వ హయాంలో అవినీతిపై విచారణ జరపాలని పైలెట్ డిమాండ్ చేస్తున్నప్పటికీ సీఎం గెహ్లాట్‌పై ఆయన వ్యక్తిగతంగా దూషణలకు దిగడంతో గెహ్లాట్ దీనిపై రాజీకి వచ్చే అవకాశాలు లేవని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో సంస్థాగతంగా పలు మార్పులు చేపట్టాలని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భావించారు. కానీ పైలెట్‌ను విశ్వాసంలోకి తీసుకోకుండా ఇవి చెయ్యడం అంత సులభం కాదు. సోమవారం ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో కూడా ఇరువురు నాయకుల మధ్య ఉన్న కీలక సమస్యలకు పరిష్కారం దొరకలేదు. రాహుల్, ఖర్గేలు తొలుత గెహ్లాట్‌తో చర్చించారు. అనంతరం సచిన్ పైలెట్‌తో చర్చలు జరిపారు. గంటల కొద్దీ సమావేశం జరిగినప్పటికీ గెహ్లాట్, పైలెట్ కలిసికట్టుగా పని చేస్తామని బహిరంగంగా చెప్పకపోవడం గమనార్హం.

సచిన్ పైలెట్ గత కొద్ది నెలలుగా చేస్తున్న డిమాండ్లపై వెనక్కి తగ్గే అవకాశాలు లేవు. వసుంధరా రాజె ప్రభుత్వ అవినీతిపై విచారణ, రాజస్తాన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఆర్‌పీఎస్‌సి) తిరిగి ఏర్పాటు చేసి కొత్త నియామకాలు చేపట్టడం పేపర్ల లీకేజీ వల్ల పరీక్షలు రద్దు ప్రభావం పడిన

డిమాండ్లపై పట్టు వీడని పైలెట్

విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించడమనే మూడు డిమాండ్లపై సచిన్ పట్టు వీడడం లేదు. రాహుల్‌తో సమావేశానంతరం అశోక్ గెహ్లాట్ పార్టీ హైకమాండ్ కీలకమని, పార్టీ పెద్దలు ఎవరికి ఏ పదవి ఇస్తారో ముందుగానే స్పష్టమైన హామీలు ఇవ్వరంటూ చేసిన వ్యాఖ్యలు కూడా భవిష్యత్‌లో జరిగే సమావేశాల్లో ప్రతిబంధకంగా మారే అవకాశాలున్నాయి.

సాక్షి నేషనల్ డెస్క్

సిసోడియాకు హైకోర్టులో చుక్కెదురు

బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు • బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేయొచ్చని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరించింది. సీబీఐ కేసులో బెయిలు కోరుతూ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ దినేశ్ శర్మ ధర్మాసనం విచారించింది. కేసులో వాదోపవాదనలు విన్నాక కేసు తీర్పును మంగళవారానికి రిజర్వ్‌చేస్తున్నట్లు 11వ తేదీనే హైకోర్టు తెలిపింది. ఈ మేరకు తీర్పును మంగళవారం జడ్జి వెలువరించారు. 'సౌత్ గ్రూప్‌కు ప్రయోజనం చేకూరేలా మద్యం విధానం రూపొందించారంటూ ఆయనపై వచ్చిన ఆరోపణల్లో చాలా తీవ్రత ఉంది' అంటూ బెయిల్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు. సీబీఐ విచారిస్తున్న ఈ కేసులో ఫిబ్రవరి 26న అరెస్టయి సిసోడియా బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. ' మద్యం సంబంధ కేసులు విచారణ దశలో ఉన్న ఈ తరుణంలో ఎక్సయిజ్‌పాలసీనిగానీ, ఇలాంటి ఆర్థిక విధానాన్ని రూపొందించిన ప్రభుత్వ అధికారాన్నిగానీ పరిశీలించలేం. ఆయన గతంలో 18 శాఖలను నిర్వహిస్తూ శక్తివంతమైన మంత్రిగా ఉన్నారు. డెప్యూటీ సీఎం, ఎక్సయిజ్ శాఖ మంత్రిగా చేసిన వ్యక్తి దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగులే అయిన సాక్షులను ప్రభావితం చేస్తాడు అనే సీబీఐ ఆరోపణను తోసిపుచ్చలేం. పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వకూడదని కోర్టు నిర్ణయానికొచ్చింది' అని జడ్జి చెప్పారు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడిలోకి

- కశ్మీర్‌లో లోయలో పడిన యాత్రికుల బస్సు
- 10 మంది దుర్మరణం
- 57 మందికి గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో యాత్రికులతో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిన ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రఖ్యాత మాతా వైష్ణోదేవి ఆలయ దర్శనార్థం బయల్దేరిన భక్తులు మరో 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఆలయానికి చేరతామనగా ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరారు. జమ్మూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృత్‌సర్ నుంచి బయల్దేరిన బస్సు త్రికూత పర్వతాలపై కొలువైన వైష్ణోదేవి ఆలయ బేస్‌క్యాంప్ ఉన్న కాత్రాకు వస్తోంది. కాగా మంగళవారం ఉదయం ఆరున్నరగంటల ప్రాంతంలో జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై ఝజ్జర్ కోట్లీ సమీపంలో కొండ మలుపు వద్ద వాలుగా ఉన్న వంతెన మీదకు వేగంగా వస్తూ ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో డివైడర్‌ను దాటి కుడివైపుకొచ్చి రెయిలింగ్‌ను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది మరణించారు. ప్రమాదవిషయం తెలియగానే స్థానికులు, సీఆర్‌పీఎఫ్, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఘటనలో 57 మంది గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిలో ఇద్దరి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బస్సు ప్రయాణికుల్లో చాలా మంది బిహార్ రాష్ట్రానికి చెందిన ఒక ఇంటి కుటుంబసభ్యులు, బంధువులే. చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు వెళ్తున్నామని ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వ్యక్తి చెప్పారు. ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ విచారంవ్యక్తంచేశారు.



జూన్‌లో నిఘా ఉపగ్రహం ప్రయోగిస్తాం

సియోల్: తరచూ పలు క్షిపణులు, అధునాతన ఆయుధాల ప్రయోగాలతో నిరంతరం దక్షిణ కొరియా, అమెరికాలను బెంబేలెత్తిస్తున్న ఉత్తరకొరియా మరో బాంబు పేల్చింది. త్వరలోనే దేశ మొట్టమొదటి సైనిక నిఘా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ప్రత్యర్థి దక్షిణకొరియాతో కలిసి అమెరికా చేపట్టే నిర్లక్ష్యపూరిత సైనిక విన్యాసాలపై కన్నేసి ఉంచేందుకు గగనతల నిఘా చాలా అవసరమని పేర్కొంది. కాగా, తమ గగనతలంలోకి ఈ ఉపగ్రహం ప్రవేశించినా, దాని శకలాలు కనిపించినా పేల్చి వేస్తామని జపాన్ హెచ్చరించింది.

మెరుగైన ప్రజా జీవనమే నా ధ్యేయం

- అందుకోసం నిరంతరం శ్రమిస్తా
- పాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ



న్యూఢిల్లీ: కేంద్రంలో పాలనాపగ్గాలు చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీ తన స్పందన తెలియజేశారు. 'దేశ ప్రజల జీవనం మరింత మెరుగ్గా ఉండాలనేదే నా ప్రతీ నిర్ణయానికి దిక్సూచి. భారతావని సేవలో మేం తొమ్మిది వసంతాలను పూర్తిచేసుకున్నాం. ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు, కృతజ్ఞతలతో నా హృదయం తృప్తితో నిండిపోయింది. ప్రజలు మరింత మెరుగైన జీవనం సాగించాలంటే ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచనకు అనుగుణంగానే ప్రతిసారి నిర్ణయం తీసుకున్నా. ప్రతి పనీ చేశా. అభివృద్ధి చెందిన భారతదేశ ఆవిర్భావం కోసం మేం అందరం నిరంతరం శ్రమిస్తాం' అని ట్వీట్‌చేశారు. 'దేశంలోని అణగారిన వర్గాల నుంచి పేదరికాన్ని దూరం చేసి వారి ఆర్థికస్థితి మెరుగుపరిచి గౌరవప్రద జీవితం అందించేందుకు కృషిచేశాం. ప్రతి పౌరుని స్వప్నాల సాకారానికి మా మిషన్ ఇకమీదటా కొనసాగుతుంది' అని అన్నారు. కాగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలకు బీజేపీ మంగళవారం నుంచి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా బుధవారం రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో మోదీ ఒక సభలో ప్రసంగించనున్నారు. ఇప్పటికే పలు బీజేపీపాలిత రాష్ట్రాల్లో సీఎంలు, పార్టీ సీనియర్ నేతలు సోమవారమే పత్రికా సమావేశాల్లో మోదీ సర్కార్ సాధించిన ఘనతలను వివరించడం తెల్సిందే.

'ఆర్డినెన్స్'పై పోరులో ఆప్‌కు మద్దతిస్తాం

- సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ: ఢిల్లీలో పరిపాలనా సేవలపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్టబెడుతూ కేంద్ర ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సమాఖ్య విధానంపై జరిగిన దాడిగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభివర్ణించారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరులో సీఎం కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లును అడ్డుకుంటామని ఆయన తెలిపారు. కేజ్రీవాల్ మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏచూరితో భేటీ అయ్యారు. అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. 'ఈ ఆర్డినెన్స్ కోర్టు ధిక్కారం. రాజ్యాంగాన్ని కాపాడేందుకు అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ముందుకు రావాలని కోరుతున్నా'అని ఏచూరి అన్నారు. అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ..'ఈ ఆర్డినెన్స్ నా కోసం తెచ్చింది కాదు. ఇది ఢిల్లీ ప్రజలకు, యావద్దేశానికి వ్యతిరేకం. 'కేజ్రీవాల్‌ను మర్చిపోండి. ఢిల్లీ ప్రజల పక్షాన నిలవండి. బీజేపీ వైపు ఉండాలా, ఢిల్లీ వాసుల పక్కన ఉండాలా కాంగ్రెస్ నిర్ణయించుకోవాలి'అని అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ బాలు ధనోర్కర్ హఠాన్మరణం



న్యూఢిల్లీ/ముంబై: మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఏకైక లోక్‌సభ సభ్యుడు సురేశ్ అలియాస్ బాలు ధనోర్కర్(47) హఠాన్మరణం చెందారు. గుర్‌గ్రామ్‌లోని ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారని మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తెలిపింది. నాగ్‌పూర్‌లోని ఆస్పత్రిలో ఈ నెల 26న ధనోర్కర్‌కు కిడ్నీ స్టోన్స్ ఆపరేషన్ జరిగింది. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆదివారం విమానంలో గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రికి తీసుకెళ్లారని కాంగ్రెస్ నేత బాలాసాహెబ్ తొరాట్ చెప్పారు. అక్కడే పరిస్థితి విషమించి చనిపోయినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ధనోర్కర్ తండ్రి నారాయణ్ ధనోర్కర్(80) శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆదివారం జరిగిన తండ్రి అంత్యక్రియలకు బాలు ధనోర్కర్ రాలేకపోయారు. కాగా, ధనోర్కర్‌కు భార్య ప్రతిభ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. శివసేన ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసిన ధనోర్కర్ 2014లో ఎమ్మెల్యే అయ్యారు. 2019లో శివసేనను వీడి లోక్‌సభ ఎన్నికల్లో చంద్రాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, బీజేపీ సీనియర్ నేత హన్స్‌రాజ్ అహిర్‌పై గెలుపొందారు. మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ టికెట్‌పై గెలుపొందిన ఏకైక ఎంపీగా ధనోర్కర్ నిలిచారు. ఆయన భార్య ప్రతిభ వరోరా–భద్రావతి స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. బాలు ధనోర్కర్ అకాల మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు.



కర్ణాటకలోని బెళగావిలో మంగళవారం అత్యవసరంగా ల్యాండయిన చిన్న విమానం. ఇది ప్రైవేట్ సంస్థ రెడ్‌బర్డ్ ఏవియేషన్‌కు చెందినది.

కాదన్నందుకే కడతేర్చాడు

'షాబాద్ డెయిరీ' హత్యోదంతంలో వెలుగులోకి కొత్త విషయాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని షాబాద్ డెయిరీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నడిరోడ్డుపై పదహారేళ్ల బాలికను అత్యంత పాశవికంగా 20సార్లకుపైగా పొడిచి, సిమెంట్ శ్లాబ్‌తో పుర్రె పగిలేలా మోదిన ఉదంతంలో నిందితుడు ఆమెపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు సాహిల్‌ను రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అయితే పోలీసుల దర్యాప్తులో హత్యోదంతం తాలూకు పలు అంశాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. హత్య నేరాన్ని పోలీసుల విచారణలో సాహిల్ ఒప్పుకున్నాడు. పక్కా ప్రణాళికతోనే అదే చోట చంపాలని ముందే నిర్ణయించుకున్నాడని తెలుస్తోంది. సన్నిహితంగా ఉండే బాలిక సాక్షి తనను దూరంగా పెట్టడం సాహిల్‌కు నచ్చలేదు. బంధం కొనసాగించాలని కోరగా తన స్నేహితురాళ్ల సమక్షంలోనే సాక్షి ఇతడిని తిరస్కరించింది. సన్నిహితంగా ఉండాలని బలవంతం చేస్తే చితకబాదుతామని సాక్షి స్నేహితులు సాహిల్‌ను హెచ్చరించారు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. హత్యకు ఉపయోగించిన కత్తిని 15 రోజుల క్రితమే హరిద్వార్ నుంచి తీసుకొచ్చాడు. హత్య చేశాక పారిపోతూ కత్తిని రిఠాలా మెట్రో స్టేషన్ దగ్గరి పొదల్లో పడేశాడు. తర్వాత బులంద్‌షహర్‌లోని తన అత్తయ్య ఇంటికి వెళ్లాడు. ఉత్తరప్రదేశ్‌కు వెళ్లాక ఇంటికి ఫోన్‌చేశాడు. ఆ ఫోన్‌కాల్ సాయంతో జాడ కనిపెట్టి పోలీసులు ఇతడిని పట్టుకున్నారు. సాక్షి శరీరంపై 34 లోతైన గాయాలు ఉన్నాయని, పుర్రె పగిలిందని పోలీసులు వెల్లడించారు. 2021 జూన్ నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉండగా విడిపోదామని ఇటీవల చెప్పడంతో గత ఎనిమిదిరోజులుగా వారి మధ్య గొడవలు అవుతున్నాయి. ఆర్థికంగా స్థితిమంతుడైన తన మాజీ ప్రియుడితో మళ్లీ టచ్‌లోకి రావడంతోనే గొడవ పెరిగిందని సాహిల్ చెప్పాడు. కాగా, సాక్షి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం చేస్తున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు.

మొదటిసారిగా అంతరిక్షంలోకి పౌర వ్యోమగామిని పంపిన చైనా



బీజింగ్/జియుక్వాన్: చైనా మంగళవారం మొదటిసారిగా ఒక పౌర వ్యోమగామి సహా ముగ్గురు వ్యోమగాములను సొంత అంతరిక్ష కేంద్రం టియాంగాంగ్‌కు పంపించింది. జియుక్వాన్ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములతో కూడిన షెంజౌ–16ను లాంగ్ మార్చ్–2ఎఫ్ రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. పది నిమిషాల తర్వాత రాకెట్ నుంచి విడిపోయిన షెంజౌ–16 నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించిందని చైనా మానవసహిత అంతరిక్ష సంస్థ(సీఎంఎస్‌ఏ) తెలిపింది. ఈ మిషన్ పూర్తిగా విజయవంతంగా పూర్తయిందని పేర్కొంది. 'షెంజౌ–16 అనంతరం టియాంగాంగ్ కోర్ మాడ్యూల్‌తో అనుసంధానమైంది. షెంజౌ–16లోని ముగ్గురు వ్యోమగాములు కోర్‌మాడ్యూల్ తియాన్హెలో ఉన్న ఇప్పటికే ఉన్న ముగ్గురు వ్యోమగాములను కలుసుకున్నారు. ఆ ముగ్గురు త్వరలోనే భూమికి తిరిగి వస్తారు'అని తెలిపింది. మంగళవారం పంపిన ముగ్గురిలో ఒకరు పేలోడ్ స్పెషలిస్ట్‌గా పేరున్న గుయి హాయిచావో. ఈయన బీజింగ్‌లోని బీయిహాంగ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. మిగతా ఇద్దరు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన వారు. 2030కల్లా చంద్రునిపైకి మనుషులను పంపే మానవ సహిత యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఎంఎస్‌ఏ సోమవారం ప్రకటించింది.

మాస్కోపై డ్రోన్ దాడులు



మాస్కో: రష్యా రాజధాని మాస్కోపై మంగళవారం ఉదయం డ్రోన్‌ల దాడి జరిగింది. ఈ దాడిలో ప్రాణహాని జరగలేదని, భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. మాస్కోపైకి దూసుకొచ్చిన ఎనిమిది డ్రోన్లను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని చెప్పారు. డ్రోన్‌ల దాడిపై అధ్యక్షుడు పుతిన్ స్పందించారు. ఇది ఉక్రెయిన్ ప్రభుత్వం చేసిన ఉగ్రవాద దాడి అంటూ ఆరోపించారు. మాస్కోలో డ్రోన్లను కూల్చివేసిన ప్రాంతంలో కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లిందని నగర మేయర్ సెర్గీ సొబియానిన్ చెప్పారు. ఇద్దరు పౌరులకు స్వల్పంగా గాయాలయ్యాయి, దెబ్బతిన్న రెండు బహుళ అంతస్తుల భవనాల్లోని వారిని ఖాళీ చేయించామని తెలిపారు. అయిదు డ్రోన్లను మాస్కోలో కూల్చివేయగా, మూడింటిని జామ్ చేసి దారి మళ్లించి పేల్చివేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. యుద్ధం మొదలైన దాదాపు ఏడాదిన్నర కాలంలో డ్రోన్లతో ఏకంగా సుదూర ప్రాంతంలోని రష్యా రాజధానిపై డ్రోన్ దాడి జరగడం ఇది రెండోసారి. ఈ నెలారంభంలో అధ్యక్షుడు పుతిన్ లక్ష్యంగా రెండు డ్రోన్‌లు క్రెమ్లిన్‌పైకి వచ్చాయని రష్యా ఆరోపించింది. రష్యా గత 24 గంటల్లో మూడో విడత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై వేకువజామున బాంబులతో విరుచుకుపడింది. కీవ్ వాసులు భయంతో షెల్టర్లలోకి పరుగులు తీశారు. దాడులతో ఒకరు చనిపోయారు. పేలుడు పదార్థాలతో వచ్చిన 20 షహీద్ డ్రోన్లను కూల్చివేసినట్లు కీవ్ అధికారులు తెలిపారు. మొత్తమ్మీద 24 గంటల్లో 31 వరకు డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది.

మణిపూర్ పౌర ప్రతినిధులతో అమిత్ చర్చలు

అల్లర్ల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల సాయం



ఇంఫాల్‌లో మహిళా ప్రతినిధులతో అమిత్

ఇంఫాల్: కుకీ, మెయిటీ జాతుల మధ్య వైరంతో నిప్పుల కుంపటిలా మారిన మణిపూర్‌లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది. దీంతో ఇరు వర్గాల మధ్య సయోధ్య సాధనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నడుం బిగించారు. ఇందులోభాగంగా సోమవారం రాత్రి ఆయన తొలిసారిగా రాష్ట్ర పర్యటన మొదలుపెట్టారు. జాతుల మధ్య ఘర్షణ, ధ్వంసానికి నిలయమైన చురాచాంద్‌పూర్‌లో మంగళవారం షా పర్యటించారు. ఇంఫాల్‌లో కుకీ వర్గానికి చెందిన మహిళా బృందం, మెయిటీ వర్గం, మేధోవర్గాన్ని విడివిడిగా కలిసి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. 'మణిపూర్‌లో మహిళా నేత(మెయిరా పైబీ)లతో భేటీ జరిగింది. భిన్న వర్గాలతో ఫలవంతమైన చర్చలు జరిగాయి. రాష్ట్రంలో శాంతి నెలకొనేందుకు సమష్టిగా కృషిచేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు' అని భేటీ తర్వాత షా ట్వీట్‌చేశారు. తర్వాత రాష్ట్రంలో తాజా పరిస్థితిపై ముఖ్యమంత్రి బీరెన్ సింగ్, ఉన్నతాధికారులతో విడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఘర్షణల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల సాయం చేస్తామని సోమవారమే కేంద్రం, మణిపూర్ సర్కార్ ప్రకటించాయి. ఘర్షణలకు అణచివేసేందుకు 10,000 మంది భారత సైన్యం, అస్సాం రైఫిల్స్ బలగాలు రాష్ట్రంలో మొహరించిన విషయం విదితమే. రాష్ట్రంలో మెయిటీలకు షెడ్యూల్ తెగ హోదా డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ కుకీ జాతి జనం చేపట్టిన సంఘీభావ ప్రదర్శన హింసాత్మకంగా మారి చివరకు 80 ప్రాణాలను బలిగొంది.

అమెరికాలో రాహుల్



శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని మూడు నగరాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం శాన్‌ఫ్రాన్సిస్కోకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ శామ్ పిట్రోడా, ఆ విభాగం సభ్యులు రాహుల్‌కు ఆహ్వానం పలికారు. పర్యటనలో రాహుల్.. ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థులతో, భారతీయ అమెరికన్లతో మాట్లాడతారు. వాషింగ్టన్‌లో పలువురు చట్టసభల సభ్యులను, మేధావులను కలుసుకుంటారు. మీడియా ప్రతినిధులతో సమావేశమవుతారు. జూన్ 4న న్యూయార్క్‌లో జరిగే ముఖాముఖితో ఆయన కార్యక్రమాలు ముగుస్తాయి. లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీకి కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం కొత్తగా సాధారణ పాస్‌పోర్టును అందజేసిన విషయం తెలిసిందే.



మంగళవారం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన తెలుగు వారైన జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావుకు పుష్పగుచ్ఛమిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం • 31 • మే • 2023

నేడు చెన్నైలో తాగునీటి సరఫరాకు అంతరాయం

తిరువొత్తియూరు: చెన్నై మహా నగరంలోని మూడు జోన్లలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు నీటి సరఫరా బోర్డు మంగళవారం ప్రకటించింది. ఈమేరకు అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలు.. కీల్పాక్కం తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి తాగునీటిని తీసుకెళ్లే ప్రధాన పైప్‌లైన్ పనులను చెన్నై మెట్రో రైల్ సంస్థ ఐయనావరం - కూనూర్ రోడ్డులో చేపట్టనుంది. ఫలితంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జోన్ 4, 5, 6 పరిధిలోని కింది ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. జోన్ -4లోని 42, 43, 48 తండయార్‌పేట, పాత చాకలిపేట సబ్‌డివిజన్, జోన్ -5లోని.. 49, 50, 51, 52, 53, రాయపురం ఏరియా, జోన్ -6లోని 73, 77, 76, పులియాంతోపు, పట్టాలం సబ్‌డివిజన్‌లో తాగునీటి సరఫరాకు వీలుకాదని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

5న ఊటీలో వీసీల మహానాడు


గవర్నర్ రవి

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్ల మహానాడుకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిర్ణయించారు. జూన్ 5వ తేదీ నీలగిరి జిల్లా ఊటీలోని రాజ్ భవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. వివరాలు.. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల వ్యవహారంలో గవర్నర్ - ప్రభుత్వం మధ్య వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. వీసీల నియామకాన్ని ప్రభుత్వమే పరిశీలిస్తుందని, ఆయా వర్సిటీలకు చాన్స్‌లర్‌గా సీఎం ఉంటారనే వాదనను ఇప్పటికే ప్రభుత్వం తెర మీదకు తెచ్చింది. ఇందుకు సంబంధించిన తీర్మానం కూడా అసెంబ్లీ ఆమోదం పొందింది. అయితే, దీనిని ఇంత వరకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదించ లేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఊటీలో వీసీల సమావేశానికి గవర్నర్ నిర్ణయించారు. జూన్ ఐదో తేదిన జరిగే వీసీల మహానాడుకు అందరూ హాజరు కావాలని ఆయా వర్సిటీల ఉపకులపతులకు రాజ్ భవన్‌నుంచి మంగళవారం ఆహ్వానాలు వెళ్లాయి. ఈ మహానాడులో కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంపై చర్చించబోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనికి భిన్నంగా రాష్ట్రం కోసం ప్రత్యేక విద్యా విధానం రూపకల్పన చేయాలని నిర్ణయించింది. ఈ సమయంలో వీసీల మహానాడుకు గవర్నర్ నిర్ణయించడం ఏ పరిణామాలకు దారి తీస్తుందనే చర్చ రాష్ట్రంలో జోరందుకుంది.

ఈడీ అటాచ్ చేసిన ఆస్తులతో ట్రస్టుకు సంబంధం లేదు

సాక్షి, చెన్నై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిన స్థిరాస్తుల్లో తమ ట్రస్టుకు సంబంధించినవి లేవని మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌కు చెందిన ఉదయనిధి చారిటబుల్ ట్రస్ట్ వివరణ ఇచ్చింది. వివరాలు.. ఇటీవల సీఎం స్టాలిన్ కోడలు, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సతీమణి కృతికకు సంబంధించిన రూ. 36 లక్షలు విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్లు వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే వాటితో తమ ట్రస్టుకు చెందిన ఎలాంటి ఆస్తులు లేవని ఉదయ నిధి ట్రస్టుకు చెందిన బాబు మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. 2013లో ఏర్పాటు చేసిన తమ ట్రస్ట్ సీఎస్ఆర్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తోందని, తమకు ఎలాంటి స్థిర ఆస్తులు లేవని పేర్కొన్నారు. విద్య, వైద్య తదితర రంగాల్లో తాము సేవలందిస్తున్నామన్నారు. ట్రస్టుకు సంబంధించిన లెక్కల వివరాలను ఐటీకి సకాలంలో సమర్పిస్తున్నట్లు వివరించారు.

కార్పొరేటర్ల ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ ప్రియ

సాక్షి, చెన్నై: స్థానిక కార్పొరేటర్లు తెలియజేసే సమస్యలు, ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి పరిష్కరించాలని అధికారులను చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలను పాలక మండలి సమావేశం దృష్టికి తీసుకు రావడం కన్నా, మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. మంగళవారం రిప్పన్ బిల్డింగ్‌లో చెన్నై కార్పొరేషన్ పాలక మండలి సమావేశం జరిగింది. మేయర్‌ప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేటర్లు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రధానంగా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. దీంతో కార్పొరేటర్లు సూచించే సమస్యలు, విజ్ఞప్తులు, ఫిర్యాదులపై తక్షణం అధికారులు స్పందించాలని మేయర్ సూచించారు. ఈ సమావేశంలో నగరంలో పార్కుల ఏర్పాటు, పలు ప్రాంతాల సుందరీకరణ తదితర పనులకు ఆమోదం తెలుపుతూ 66 తీర్మానాలు చేశారు. అలాగే, చెన్నై నగరంలోని 10 మండలాలలో పారిశుధ్య పనులు ప్రైవేటు సంస్థల ద్వారా చేపడుతున్నామని, మిగిలిన ఐదు మండలాల్లో మాత్రమే కార్పొరేషన్ సిబ్బంది నిర్వహిస్తున్నారని తెలిపారు. త్వరలో 500 కార్పొరేషన్ సిబ్బంది పదవీ విరమణ చేయనున్నారని, ఈ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

అరి కొంబన్ దాడిలో ఒకరి మృతి

సాక్షి, చెన్నై : తేనిని వణికిస్తున్న అరి కొంబన్ ఏనుగు మరోసారి తన ప్రతాపం చూపించింది. దీని దాడిలో బాలరాజ్ (35) అనే వ్యక్తి మంగళవారం మరణించాడు. వివరాలు.. తేని అటవీ మార్గంలోని పట్టణాలు, గ్రామాలలో అరి కొంబన్ ఏనుగు సృష్టిస్తున్న వీరంగం గురించి తెలిసిందే. దీనిని పట్టుకునేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అరి కొంబన్ ఏనుగు బాలరాజ్ అనే వ్యక్తిపై దాడి చే సింది. ఆసుపత్రికి తరలించగా, అతడు మరణించాడు. ఈ సమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే ఈ ఏనుగును పట్టుకునేందుకు లేదా, అడవిలోకి పంపించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు.

శ్రీవారికి మహాలయం

మీడియాతో మాట్లాడుతున్న ఏజే శేఖర్



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి చెన్నైలో భారీ ఆలయం రూపుదిద్దుకోనుంది. చెన్నై టీ నగర్ సమాచార కేంద్రంలోని ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. ఇందుకోసం రూ. 50 కోట్ల నిధులను టీటీడీ కేటాయించనుందని స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్ మంగళవారం ప్రకటించారు. ఇక స్థలం కొనుగోలు కోసం భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలువురు భక్తులు రూ. 7.60 కోట్లను విరాళంగా అందజేసినట్లు ఆయన వెల్లడించారు.

టీటీడీ సమాచార కేంద్రంలోని శ్రీవారి ఆలయం



రూ.కోటి చెక్కును ఏజే శేఖర్‌కు అందజేస్తున్న ఏసీ షణ్ముగం



మరిన్ని పనులు..

ఇటీవల తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని తలపించే విధంగా.. చెన్నైలోనూ నిర్మించిన విషయాన్ని ఏజే శేఖర్ గుర్తు చేశారు. అలాగే కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరు పేటలో శ్రీవారి ఆలయం పనులకు భూమిపూజ గతంలో జరిగిన విషయాన్ని వెల్లడిస్తూ.. ఏడాది లోపు కుంభాషేకం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అలాగే, ఈనెల 10వ తేదీన ఈ ఆలయం ఆవరణలో పుష్కరిణి, రాజగోపురం, అన్నదాన కేంద్రం, కల్యాణ మండపం నిర్మాణ పనులకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భూమి పూజ చేయనున్నారని తెలిపారు. వేలూరులోని శ్రీవారి ఆలయాన్ని అభివృద్ధి, విస్తరించేందుకు నిర్ణయించామన్నారు. ముంబైలో వైష్ణవీ దేవి ఆలయానికి వెళ్లే మార్గంలో కాత్రా అనే ప్రదేశంలో 10 ఎకరాల స్థలంలో శ్రీవారి ఆలయ పనులకు ఈనెల 7వ తేదీన భూమి పూజ నిర్వహిస్తామన్నారు. మదురైలో ఓ కల్యాణ మండపం, చెన్నై రాయపేటలోని 1.5 ఎకరాల స్థలంలో పేదల కోసం మరో కల్యాణ మండపం పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఇక్కడ వేద పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి గతంలో చెప్పినట్లు గుర్తు చేశారు.

- చెన్నై టీ నగర్‌లో నూతన ఆలయ నిర్మాణానికి టీటీడీ నిర్ణయం
- సుమారు రూ. 50 కోట్లతో పనులు
- కల్యాణ మండపం కూడా..
- నిత్యాన్నదానానికి ఏర్పాట్లు
- స్థలం కొనుగోలు కోసం విరాళాల సేకరణ
- స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్ వెల్లడి

సాక్షి, చెన్నై : టీ నగర్ వెంకటనారాయణ రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం సమాచార కేంద్రం, శ్రీవారి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. తిరుమల శ్రీవారికి నిర్వహించే అన్ని రకాల సేవలూ ఈ ఆలయంలో జరుగుతుంటాయి. నిత్యం భక్తులు ఇక్కడికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. భక్తుల తాకిడి క్రమంగా పెరుగుతుండడంతో సేవలు మెరుగు పరచాలని టీటీడీ నిర్ణయించింది. ఈ ఆలయాన్ని కూల్చి వేసి భారీస్థాయిలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. సమాచార కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, అనిల్ కుమార్ రెడ్డితో కలిసి వివరాలను మంగళవారం టీటీడీ స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్ తెలియజేశారు.

దాదాపు ఐదు దశాబ్దాలుగా..

గత 48 ఏళ్లుగా ఇక్కడ కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం భక్తులు తరలి వస్తున్నారని ఏజే శేఖర్ మీడియాకు తెలిపారు. శ్రీవారి ఆలయం, పరిసరాలు 5.5 గ్రౌండ్ల స్థలంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రూ. 14 కోట్లతో 3 గ్రౌండ్ల స్థలాన్ని కొనుగోలు చేశామని, మరో 3 గ్రౌండ్ల స్థలం కొనేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ స్థలాలను కొనుగోలు చేయడానికి తనతో పాటు భక్తులు విరివిగా విరాళాలు అందజేశారని వివరించారు. తాను రూ. కోటి, మాజీ ఎంపీ ఎంజీఆర్ మెడికల్ వర్సిటీ చాన్స్‌లర్ ఏసీ షణ్ముగం రూ. కోటి, టీవీఎస్ గ్రూప్ అధినేత శ్రీనివాసన్ రూ. కోటి, ఆటో టెక్ కంపెనీ అధినేత కేఎస్ జయరామన్ రూ. కోటి, సమీర ఫౌండేషన్ అధినేత మురుగన్ రూ. కోటి, అనుగ్రహా రియల్ వేల్యూ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జై రూ. కోటి, యాక్సిస్ హెల్త్ కేర్ గ్రూప్ రూ. కోటి, వేల్స్ గ్రూప్ సంస్థల అధినేత, సభ్యుడు ఐషరీ గణేషన్ రూ. 50 లక్షలు, పళణి ముత్తుకుమార్ రూ 10 లక్షలు విరాళంగా అందజేశారని తెలిపారు. మొత్తం రూ. 7.60 కోట్లు విరాళాల ద్వారా సమకూరినట్టు చెప్పారు. దాతలు , భక్తులు మరింతగా విరాళాలు అందజేయడానికి ముందుకు రావాలని కోరారు. సమర్పించే విరాళానికి అనుగుణంగా భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనంకు సంబంధించిన పలు రకాల సేవలను ప్రత్యేకంగా కల్పిస్తామని వివరించారు. స్థల కొనుగోలు కోసం విరాళాలను భక్తులు నేరుగా టీ నగర్ ఆలయం డిప్యూటీ ఈవో చేతికి గానీ, లేదా ఆన్‌లైన్ ద్వారా ఈవో టీటీడీ ఎస్‌వీ టెంపుల్ చెన్నై పేరిట ఉన్న ఎస్‌బీఐ అకౌంట్ నెంబరు 418341 69044కు పంపించ వచ్చని వివరించారు.

భారీ స్థాయిలో..

ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని కూల్చి వేయనున్నామని శేఖర్‌రెడ్డి వెల్లడించారు. అయితే, బాలాలయం ఏర్పాటు చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కొనసాగిస్తామన్నారు. కొత్తగా నిర్మించే ఆలయంలో పేదల కోసం కల్యాణ మండపం, తిరుమల తరహాలో నిత్య అన్నదాన సేవ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వామివారి సేవకు వచ్చే భక్తులకు టోకెన్లు అందజేసి, తద్వారా అన్నదాన సేవ పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సిమెంట్ రహితంగా ప్రాచీన సాంప్రదాయం ఉట్టి పడే విధంగా పూర్తిగా రాతితో బ్రహ్మాండంగా కొత్త ఆలయాన్ని నిర్మించబోతున్నామన్నారు. ఈ ఆలయాన్ని అయ్యే దాదాపు రూ. 50 కోట్ల మేరకు ఖర్చు మొత్తాన్ని టీటీడీ భరించనున్నట్టు తెలిపారు. ఆరు నెలల్లో అన్ని ప్రక్రియలను ముగించి ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తామన్నారు. 3 సంవత్సరాల్లో పనులు ముగించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు. కాగా, టీ నగర్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని గుర్తు చేస్తూ, భక్తుల వాహనాల పార్కింగ్ కోసం చెన్నై కార్పొరేషన్ గానీ, ఎవరైనా గానీ స్థలం ఇచ్చిన పక్షంలో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణాలకు సిద్ధమని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

15న రాష్ట్రపతి రాక

- 'కరుణ' ఆసుపత్రి ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు


రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ

సాక్షి, చెన్నై: రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ జూన్ 15వ తేదీన చెన్నైకు రానున్నారు. దివంగత సీఎం కరుణానిధి పేరిట నిర్మించిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆమె ప్రారంభించనున్నారు. వివరాలు.. చెన్నై గిండిలో రూ. 230 కోట్లతో వెయ్యి పడకలతో భారీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన విషయం తెలిసిందే. ఆరు అంతస్తులతో మూడు భవనాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా జూన్ 5వ తేదీన ఈ ఆసుపత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎం స్టాలిన్ గత నెల స్వయంగా ఢిల్లీ వెళ్లి మరీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మూను ఈ వేడుకకు ఆహ్వానించారు. అయితే ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్న సమయంలో రాష్ట్రపతి చెన్నై పర్యటన రద్దయ్యింది. రాష్ట్రపతి జూన్‌మొదటి వారంలో విదేశీ పర్యటనకు వెళ్తున్నందున చెన్నైకు రాలేని పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం వెలువడింది. దీంతో ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవ తేదీని వాయిదా వేశారు. ఈ పరిస్థితుల్లో జూన్ 15వ తేదీన చెన్నై పర్యటనకు రాష్ట్రపతి రెడీ అవుతున్నట్టు ప్రభుత్వ వర్గాలకు సమాచారాలు అందాయి. దీంతో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై దృష్టి పెట్టే పనిలో ఆరోగ్య శాఖ వర్గాలు నిమగ్నమయ్యాయి. ఇక రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో వెలువడే అవకాశాలు ఉన్నట్టు సచివాలయం వర్గాలు మంగళవారం పేర్కొన్నాయి.

ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం


సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు


టోక్యో ఎన్‌ఈసీ ఫ్యూచర్ క్రియేషన్ హబ్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై : రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలన్నీ సాంకేతిక మయం చేసే విషయంపై సీఎం స్టాలిన్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా టోక్యోలోని ఎన్‌ఈసీ ఫ్యూచర్ క్రియేషన్ హబ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం స్టాలిన్ జపాన్ రాజధాని టోక్యో నగరంలో ప్రపంచంలో అత్యంత అధునాతన, ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఫ్యూచర్ క్రియేషన్ హబ్‌ను ఉదయం పరిశీలించారు. ఇక్కడున్న ఆధునిక సాంకేతిక సౌకర్యాలను జపాన్ బృందం సీఎంకు వివరించింది. ఫ్యూచర్ క్రియేషన్ హబ్ మెరుగైన భవిష్యత్తుకు కేంద్రమని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ఇంటరాక్టివ్ డైలాగ్‌లు, సాంకేతికత, వ్యాపారం, ప్రయోగాత్మక అనుభవాలను ఇక్కడ తాను తెలుసుకున్నట్లు వివరించారు. సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ రూపొందించి ఉన్నారని తెలిపారు. విమానాశ్రయాల్లో ఎలక్ట్రానిక్ కస్టమ్స్ నోటిఫికేషన్, కస్టమ్స్ క్లియరెన్స్, ఒత్తిడి లేకుండా విమానంలో ప్రయాణించే విధానం ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్టు వివరించారు. ఇక, హార్బర్‌లలో నిఘా, ఫ్యాక్టరీల నిర్వహణ, రైల్వేలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్, రోడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అగ్నిమాపక వ్యవస్థలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, విమానయానం, బ్యాంకింగ్, డిజిటల్ టెలివిజన్ ట్రాన్స్‌మిషన్, ఎలక్ట్రానిక్ తదితర అంశాలను పరిశీలించినానంతరం వీటిని తమిళనాడులోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తామన్నారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎంతో పాటు మంత్రి టీఆర్‌బీ రాజ, అధికారులు కృష్ణన్, విష్ణు పాల్గొన్నారు. ఇక జపాన్ పర్యటనలో భాగంగా మంగళవారం ఓమ్రాన్ హెల్త్ కేర్‌తో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. తద్వారా రూ. 128 కోట్లను తమిళనాడులో పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థ నిర్ణయించింది. కాగా, విదేశీ పర్యటనను ముగించుకుని బుధవారం రాత్రి సీఎం స్టాలిన్ చెన్నైకు చేరుకోనున్నట్లు అధికారులు ప్రకటించారు.

చెన్నైకి.. సూపర్ కింగ్స్ జట్టు

శ్రీవారి సన్నిధిలో ఐపీఎల్ ట్రోఫీకి పూజలు



- క్రీడాకారులకు అభిమానుల ఘన స్వాగతం
- స్థానిక శ్రీవారి ఆలయంలో ఐపీఎల్ ట్రోఫీకి పూజలు
- శుభాకాంక్షలు తెలిపిన సీఎం స్టాలిన్


ఐపీఎల్ ట్రోఫీతో టీటీడీ స్థానిక సలహా మండలి సభ్యులు, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యం

సాక్షి, చెన్నై: ఐపీఎల్- 2023 విజేత చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మంగళవారం చెన్నైకు చేరుకుంది. ట్రోఫీతో చెన్నైకు వచ్చిన క్రీడాకారులకు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. చెన్నైలోని శ్రీవారి ఆలయంలో ఈ సందర్భంగా ట్రోఫీకి పూజలు నిర్వహించారు. వివరాలు.. తమిళనాట క్రికెట్ అభిమానులు ఎక్కువే అన్న విషయం తెలిసిందే. దీంతో చెన్నై చేపాక్కం చిదంబరం స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగితే చాలు టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడు పోతుంటాయి. ఇక, క్రికెటర్ ధోని తమ వాడే అన్నట్లుగా తమిళాభిమానులు భావిస్తుంటారు. ఇందుకు కారణం, 2008 నుంచి ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మహేంద్ర సింగ్ ధోని నాయకత్వం వహిస్తుండడమే. ఆయన సారథ్యంలో ఇప్పటికే నాలుగు సార్లు ఐపీఎల్ విజేతగా చెన్నై జట్టు నిలిచింది.

ఐదోసారి..

గుజరాత్ వేదికగా సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఐపీఎల్ -2023 సీజన్‌ను చెన్నై సూపర్‌కింగ్స్ చేజిక్కించుకోవడం తమిళనాడు క్రికెట్ అభిమానులను ఆనంద సాగరంలో ముంచెత్తింది. అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు రాష్ట్ర వ్యాప్తంగా బాణసంచా పేల్చుతూ సందడి చేశారు. తమ ఆనందాన్ని పంచుకుంటూ కేరింతలు కొట్టారు. ఇక ఐదోసారి ఐపీఎల్ కప్‌తో చెన్నైలో మంగళవారం సాయంత్రం అడుగు పెట్టిన సూపర్‌కింగ్స్ జట్టు సభ్యులకు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. విదేశీ పర్యటన నిమిత్తం భారత జట్టుకు ఎంపికైన రవీంద్ర జడేజా తదితర క్రికెటర్లు చెన్నైకు రాలేదు. మిగిలిన సభ్యులు చెన్నైకు వచ్చారు. వీరికి విమానాశ్రయం బ్రహ్మరథం పట్టే ఆహ్వానం లభించింది. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాని ఎన్. శ్రీనివాసన్ నేతృత్వంలో నిర్వాహక బృందం ఐపీఎల్ కప్‌తో టీ నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. టీటీడీ స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్, సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, మాజీ అధ్యక్షులు శ్రీకృష్ణ, ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల సన్నిధిలో కప్‌ను ఉంచి పూజలు నిర్వహించారు. కాగా ఐదోసారి విజేతగా నిలిచిన చెన్నై జట్టుకు సీఎం స్టాలిన్‌శుభాకాంక్షలు తెలియజేశారు.



అప్పసామి డిజైన్ చేసిన ధోని, సూపర్ కింగ్స్ లోగోతో ఉన్న శాలువా

ధోని, సూపర్ కింగ్స్ జట్టు లోగోతో శాలువా

సేలం: ఈరోడ్ - ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు విజయంపై చెన్నిమలకు చెందిన ఒక డిజైనర్ క్రికెటర్ ధోని, చెన్నై సూపర్ కింగ్స్ లోగోను రూపొందించారు. అప్పుసామి ఈరోడ్ జిల్లా చెన్నిమలై వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీలో డిజైనర్, క్రికెట్ వీరాభిమాని అయిన అతను తన ఖాళీ సమయాల్లో బట్టలపై నాయకుల చిత్రాలను డిజైన్ చేసేవారు. గతంలో పద్మశ్రీ ఎంపీ నాచిముత్తు, మాజీ ప్రధాని కరుణానిధి, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ధోనీ చిత్రాలను కూడా రూపొందించారు. ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ విజయాన్ని పురస్కరించుకుని ధోనీ, చెన్నై సూపర్ కింగ్స్ లోగోను కంప్యూటర్‌లో డిజైన్ చేసి ఎలక్ట్రానిక్ జాక్వర్డ్‌తో తయారు చేశారు. 350 గ్రాముల బరువున్న 2-బై-17 కాటన్ నూలుపై 30 అంగుళాల వెడల్పు, 60 అంగుళాల పొడవుతో అప్పుసామి ఈ శాలువాను తయారు చేశారు. ఈ సందర్భంగా అప్పుసామి మాట్లాడుతూ.. ప్లే ఆఫ్ రౌండ్‌కు అర్హత సాధించిన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ఫైనల్స్‌లో ఖచ్చితంగా గెలుస్తుందనే ఆశతో ఈ గుడ్డను సిద్ధం చేశానని, చెన్నైలో జరిగే విజయోత్సవ వేడుకలో క్రికెటర్ ధోనీకి బహుమతిగా ఇవ్వడానికి తాను ఆసక్తిగా ఉన్నానని అప్పుసామి వెల్లడించారు.

చెన్నై
బుధవారం ၊ 31 ၊ మే ၊ 2023
సాక్షి

క్లుప్తంగా

మృతదేహంపై కూర్చొని అఘోర పూజలు

• వైరల్ అవుతున్న వీడియో



కొరుక్కుపేట: సూలూరు శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు వచ్చిన ఓ మృతదేహం పై కూర్చొని అఘోర పూజలు చేసిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. వివరాలు.. కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రిలో మరణించిన 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం అంత్యక్రియల కోసం సోమవారం సూలూర్ శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. ఆ సమయంలో మృతుడి బంధువులతో పాటు 8 మంది అఘోరాలు కూడా వచ్చారు. మృతదేహాన్ని దహనం చేసేముందు అఘోర శవంపై కూర్చొని పూజలు చేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో మీడియా ప్రతినిధులు శ్మశాన నిర్వాహకుడు సురేష్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. అయితే బంధువుల అనుమతితోనే అఘోర పూజలు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

రోగి దాడిలో డాక్టర్‌కు తీవ్రగాయాలు

తిరువొత్తియూరు: చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేస్తున్న సమయంలో డాక్టర్‌ను రోగి కత్తిరితో పొడిచాడు. ఈ ఘటనపై ట్రైనీ డాక్టర్లు దీనిని ఖండిస్తూ 100 మందికి పైగా సిబ్బంది ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. వివరాలు.. చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణ డాక్టర్‌గా పనిచేస్తున్న సూర్య సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో లివర్ సమస్య విభాగంలో ఇన్ పేషంట్‌గా ఉన్న బాలాజీని పరీక్షించారు. ఆ సమయంలో తన చేతికి సెలైన్ కోసం ఏర్పాటు చేసిన ఇంజెక్షన్‌ని తొలగించమని రోగి బాలాజీ డాక్టర్‌ను కోరాడు. డాక్టర్ ఇప్పుడే తీయరాదని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఆగ్రహం చెందిన బాలాజీ సమీపంలోని కత్తెరతో శిక్షణ డాక్టర్ సూర్య మెడపై పొడిచాడు. తీవ్ర గాయాలైన సూర్యను అత్యవసర విభాగంలో చేర్చారు. దీంతో వైద్య సిబ్బంది ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రి డీన్ పేరని రాజన్ వారితో చర్చించి ఆందోళన విరమింపజేశారు. ఇక నిందితుడు బాలాజీని అరెస్టు చేయాలని పోలీసులు నిర్ణయించారు.

ఉచిత సైకిళ్ల పంపిణీలో గోల్‌మాల్

• కొనుగోలు లెక్కల్లో వ్యత్యాసాలు
• పన్ను ఎగ వేసినట్లు ఆధారాలు
• కాంట్రాక్టర్ ఇంట్లో ఐటీ అధికారుల సోదాలు


సైకిళ్లు

సాక్షి, చెన్నై : విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ టెండర్లలో భారీ కుంభకోణం జరిగినట్టు ఐటీ లెక్కల్లో వెలుగు చూసింది. కొనుగోలు, విక్రయాల లెక్కల్లో తేడాలతో పన్ను ఎగ వేత ఆధారాలు చిక్కినట్టు సమాచారం. దీంతో సైకిళ్లను సరఫరాచేసిన చెన్నైకు చెందిన కాంట్రాక్టర్ ఇళ్లు, కార్యాలయాలలో మంగళవారం ఐటీ అధికారులు సోదాల్లో నిమగ్నమయ్యారు. వివరాలు.. రాష్ట్రంలో పాలకులు మారినా ప్లస్–1 విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ పథకం అమలు అవుతూ వస్తున్న విషయం తెలిసిందే. కోడంబాక్కం యూనైటెడ్ ఇండియా కాలనీ ఐదో వీధికి చెందిన స్వతంత్ర పరిపూర్ణం అన్నాడీఎంకే హయాంలో ఈ సైకిళ్ల పంపిణీ టెండర్లను చేజిక్కించుకున్నారు. పంజాబ్ రాష్ట్రం లూధియానాలోని తన సంస్థ ద్వారా సైకిళ్లను తయారు చేసి ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తూ వచ్చారు. అయితే ఆ సంస్థకు చెందిన సైకిల్ ధర రూ. 3,500 ఉండగా, అన్నాడీఎంకే హయాంలో ఒక్కో సైకిల్‌ను రూ. 4,800కి కొన్నట్లు ఐటీ పరిశీలనలో తాజాగా వెలుగు చూసింది. 2021–22లో పరిపూర్ణానికి చెందిన సంస్థ దాఖలు చేసిన ఐటీ లెక్కల వివరాలలో ప్రభుత్వ ధర, సైకిల్ బ్రాండ్ ధర మధ్య వ్యత్యాసాలు ఉండటంతో దీని వెనుక స్కాం ఉన్నట్టు ఐటీ వర్గాలు గుర్తించినట్టున్నాయి. 2022–23లో ఇదే సంస్థ ద్వారా 11 లక్షల ఉచిత సైకిళ్ల కొనుగోలుకు ఒప్పందాలు ప్రస్తుత ప్రభుత్వం చేసుకుంది. అయితే ఇంత వరకు ధర నిర్ణయం జరగలేదని తెలిసింది. అయితే, అన్నాడీఎంకే హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియ, ధరల వ్యవహారాలపై ఐటీ తీవ్రంగా పరిగణించింది. దీంతో కోడంబాక్కంలోని పరిపూర్ణం నివాసం, కార్యాలయాలలో ఐటీ అధికారులు మంగళవారం ఉదయం దాడులకు దిగారు. అలాగే, పంజాబ్‌లో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలోనూ సోదాలుజరుగుతున్నాయి. ఈ సోదాల్లో కీలక రికార్డులు బయట పడ్డట్టు సంకేతాలు వెలువడ్డాయి.

వృద్ధుల సంరక్షణకు మరిన్ని కేంద్రాలు



వృద్ధుల సంరక్షణ క్రేందాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గీతాజీవన్

కొరుక్కుపేట: వృద్ధుల కోసం సంరక్షణ కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సి అవసరం ఉందని, వాటిని ఏర్పాటు చేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తెలిపారు. చెన్నై పల్లావరం ప్రాంతంలో అతుల్య సీనియర్ కేర్ పేరిట జ్ఞాపకశక్తి లోపంతో బాధపడే వృద్ధుల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు వెల్లడించారు. వృద్ధుల కోసం ఇలాంటి సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే సంస్థలకు తమ శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. అతుల్య సంస్థ ఇప్పటి వరకూ మూడు సీనియర్ కేర్లను సమర్థవంతంగా నిర్వహిస్తోందని, నాలుగో సంరక్షణ కేంద్రాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో మధురవాయల్లోనూ అతుల్య సీనియర్ కేర్ ప్రారంభించనుండడం హర్షణీయమని పేర్కొన్నారు. అతుల్య సీనియర్ కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ కార్తీక్ నారాయణ్ మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన సీనియర్ కేర్ 86 మంది వృద్ధులు బసచేస్తున్నారని, వారికి సేవలందించటానికి 100 మంది మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అతుల్య సీనియర్ కేర్ సీఈఓ జి. శ్రీనివాసన్, డైరెక్టర్ కావ్య, పల్లావరం జోనల్ చైర్మెన్ జోసెఫ్ అన్నాదురై, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయం - ముగ్గురి అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

తిరువొత్తియూరు: పుదుకోట సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణదారులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పాదుకోట ఆళంగుడిలో నిషేధిత పొగాకు వస్తువులు విక్రయిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారాన్ని అందింది. ఈ మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీ చేపట్టి ఖలీఫుల్లా, రోజా నగర్‌కు చెందిన అలగర్ స్వామి (45)ని, ఆలంగుడికి చెందిన వడివేలు (42), అరులానందన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి 217 పొగాకు వస్తువులను సీజ్ చేశారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలను నిరసిస్తూ యాత్ర


సైకిల్‌యాత్ర చేపట్టిన రైతు రజని

తిరుత్తణి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలను ప్రశ్నించినందుకు తనపై కొందరు దాడి చేశారని, అయితే వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తూ ఓ రైతు సైకిల్ యాత్ర చేపట్టాడు. వివరాలు.. ఆర్కేపేట యూనియన్ అయ్యనేరిలో ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రం ఉంది. ఈ కేంద్రాన్ని డీఎంకే యూనియన్ కార్యదర్శి పళని కుమారుడు వినోద్ పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. వరి కొనుగోలు కేంద్రంలో వరి బస్తాలుగా విక్రయించే రైతుల నుంచి బస్తాకు రూ. 50 అదనంగా వసూలు చేస్తున్నట్లు రజని ఆరోపించారు. దీంతో ఆగ్రహించి వినోద్ తనపై దాడిచేశాడని, తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మంగళవారం అయ్యనేరి నుంచి చెన్నై సచివాలయంకు సైకిల్ యాత్ర చేపట్టాడు. తిరుత్తణి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ హస్త్రత్‌బేగానికి వినతిపత్రం అందజేశాడు. అనంతరం సచివాలయానికి సైకిల్‌లో వెళ్లి ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు రైతు రజని వెల్లడించాడు.

రెండు బైక్‌లు ఢీ

• వృద్ధుడి దుర్మరణం

తిరువొత్తియూరు: మధురవాయిల్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నై వలసరవాక్కంకు చెందిన మిత్రన్ (75) సోమవారం ఉదయం పూందమల్లి హైవే రోడ్డులో వెళ్తూ ఉన్నాడు. ఆ సమయంలో ఆ మార్గంలో వ్యతిరేక దిశలో వస్తున్న మరో బైక్ మిత్రన్‌ను మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ దూరంగా ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలైన మిత్రన్ అదే చోట మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. కోయంబేడు ట్రాఫిక్ పోలీసులు కేసు విచారణ చేస్తూ ఉన్నారు.

హోటల్ ఉద్యోగి దారుణ హత్య

అన్నానగర్: విల్లుపురం జిల్లా అనిచంగుప్పానికి చెందిన విమల్‌కుమార్ (35). బొమ్మైయార్‌పాళయంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పని చేసేవాడు. మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో పని ముగించుకుని మోటారు బైక్‌పై ఇంటికి వెళుతుండగా బొమ్మైయార్‌పాళయం ఈసీఆర్ రోడ్డు నుంచి వెళ్లే దారిలో కొందరు అడ్డగించి దాడి చేశారు. అనంతరం విచక్షణా రహితంగా నరికి చంపి అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి హంతకుల కోసం గాలిస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో పాల్గొన్న సత్‌వచ్చారి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

వేలూరు: తాము గతంలో చదివిన పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని ప్రిన్సిపల్ బరుదరాజన్ అన్నారు. సత్‌వచ్చారి వల్లలార్ ప్రభుత్వ పాఠశాలలో 1985–93 విద్యా సంవత్సరంలో చదివిన పూర్తి విద్యార్థుల కలయిక అన్నా రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల్లో జరిగిన ఆసక్తికరమైన జ్ఞాపకాలను పంచుకుంటూ గ్రూఫ్ ఫొటో దిగారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, టీచర్‌లను పూర్వపు విద్యారుథలు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీచర్‌లు ఇంద్రాని, జయరాణి, పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇళయరాజ, భూపతి, లక్ష్మణన్ కమ్యూనిటీ సర్వస్ సెమ్మల్‌సురేష్, సోషియల్ నెట్‌వర్క్ ఇన్‌చార్జీ మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.

రజనీ రాజకీయాల్లోకి వచ్చినా ఉపయోగం లేదు


తిరుచెందూర్ ఆలయం వద్ద సత్యనారాయణ రావు

తమిళ సినిమా: సూపర్ స్టార్ రజనీకాంత్ ఆ మధ్య రాజకీయ రంగ ప్రవేశం చేస్తానని ప్రకటించి తర్వాత వెనక్కి తగిన విషయం తెలిసిందే. దానికి ఆరోగ్యం సహకరించడం లేదనే కారణాన్ని కూడా ఆయన చెప్పారు. అయితే అప్పటి నుంచి ఖాళీగా ఇంట్లో కూర్చోవడం లేదు. వరుసగా సినిమాలు చేసుకుంటూ పోతున్నారు. ప్రస్తుతం జైలర్‌తో పాటు తన కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న లాల్ సలాం చిత్రంలో అతిథి పాత్రలోనూ నటిస్తున్నారు. ఇవి గాక మరో రెండు చిత్రాలకూ పచ్చజెండా ఊపేశారు. ఇదిలా ఉంచితే ఇప్పుడు నటుడు రజనీకాంత్ రాజకీయాల్లోకి వచ్చినా ఉపయోగం లేదని స్వయానా ఆయన సోదరుడు సత్యనారాయణ రావు పేర్కొనడం విశేషం. ఇందుకు కారణాన్ని కూడా వివరించారు. సోమవారం తిరుచెందూర్ కుమారస్వామి ఆలయానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రజనీకాంత్ నటిస్తున్న జైలర్, లాల్ సలాం చిత్రాలు త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయన్నారు. దేవుని దయ వల్ల ఆయన సుదీర్ఘ కాలం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. రజనీకాంత్ ఇకపై రాజకీయాల్లోకి రావాలని, వచ్చినా ఉపయోగం లేదనీ వ్యాఖ్యానించారు. కారణం ఆయన వయస్సు ఏడు పదులు దాటడమేనని పేర్కొన్నారు. అదే విధంగా ఆయన ఎవరికీ మద్దతు పలికే అవకాశం లేదని స్పష్టం చేశారు.

కోలీవుడ్ టాక్స్

సిద్ధార్థ్ మంచి నటుడని చెప్పడం లేదు


టక్కర్ చిత్ర యూనిట్

తమిళసినిమా: దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకుడిగా చేరి ఆ తరువాత బాయ్స్ చిత్రంతో కథానాయకుడిగా పరిచయం అయిన నటుడు సిద్ధార్థ్. ఆ చిత్రం సక్సెస్‌తో ఆయన కెరీర్ సూపర్ ఫాస్ట్‌గా సాగిపోతోంది. ఈయన తాజాగా నటించిన ద్విభాషా చిత్రం టక్కర్. నటి దివ్యాన్షా నాయకిగా నటించిన ఇందులో విఘ్నేష్, యోగిబాబు, మునీష్‌కాంత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ సుందరం, జయరాం కలిసి నిర్మించిన ఈ చిత్రానికి నివాస్ కె.ప్రసన్న సంగీతాన్ని, వాంజినాథన్ మురుగేశన్ ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 9వ తేదీన తమిళం, తెలుగు భాషల్లో తెరపైకి రానుంది. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నటుడు సిద్ధార్థ్ మాట్లాడుతూ ఇంతకు ముందు పందెంకోడి లా ఉండే తాను ఇప్పుడు సాధారణ కోడిలా మారడానికి కారణం ఏమిటని అడుగుతున్నారని, తాను ఇంతకుముందు ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామన్నారు. అలా తనకు 50 లక్షల ఫాలోవర్స్ ఉండేవారన్నారు. అయితే వారిలో కొందరు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబుతూ సమస్యల్లో ఇరుక్కుంటున్నానన్నారు. వారంతా సిద్ధార్థ్ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారు. సామాజిక సేవా చేస్తున్నారని అంటున్నారే గానీ తాను మంచి నటుడు అని చెప్పట్లేదన్నారు. దీంతో తన వృత్తికి సరైన న్యాయం చేయలేకపోతున్నాననే భావన కలిగిందన్నారు. దీంతో ట్విట్టర్ నుంచి బయటికి వచ్చేశానని చెప్పారు. ఇక టక్కర్ చిత్రం గురించి చెప్పాలంటే గ్లామర్, యాక్షన్, సెంటిమెంట్, కామెడీ అన్ని సమపాళ్లలో ఉన్న కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్నో కష్టాలకోర్చి ఈ స్థాయికి!

తమిళసినిమా: గత దశాబ్దంలో ప్రముఖ నటిగా గుర్తింపు పొందిన స్నేహ బాల్యంలో ఎన్నో ఛీత్కారాలను, వేదనలను అనుభవించారట. ఈ విషయాన్ని తనే ఇటీవల ఓ ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారు. వివరాలు..ఈ బ్యూటీ 2000 సంవత్సరంలో మలయాళ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయమయ్యారు. అదే ఏడాది ఎన్నవళే అనే చిత్రంతో మాధవన్‌కు జంటగా కోలీవుడ్‌లోకి రంగప్రవేశం చేశారు. ఆ తరువాత 2001లో ఆనందం చిత్రంలో అబ్బాస్‌కు జంటగా నటించారు. ఆ చిత్రం 200 రోజులు ఆడింది. అదే విధంగా తెలుగులోనూ పలు చిత్రాలలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా తమిళంలో కమల హాసన్, సూర్య, ధనుష్, విజయ్ వంటి స్టార్ హీరోలతో నటించిన ప్రముఖ కథానాయకిగా రాణించారు. అలా ప్రముఖ హీరోయిన్‌గా రాణిస్తున్న సమయంలోనే 2012లో నటుడు ప్రసన్నను ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక పాప, ఒక బాబు వున్నారు. ఇంతవరకు స్నేహ గురించి చాలామందికి తెలిసిందే. అయితే ఆమె కుటుంబం, బాల్యం గురించి ఎవరికీ చెప్పలేదు. అలాంటిది తొలిసారిగా ఇటీవల ఒక భేటీలో తాను బాల్యంలో అనుభవించిన కష్టాల గురించి ఏకరువు పెట్టారు. తన తల్లిదండ్రులకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు అని చెప్పారు. కూతుర్లలో తాను చివరి దానినని, తనకు బదులు కొడుకు పుట్టాలని తన బామ్మ గట్టిగా కోరుకుందని దీంతో ఆమె తన ముఖాన్ని చూడటానికి మూడు రోజుల వరకు ఇష్టపడలేదని తెలిపారు. ఇక చిన్నతనంలో మంచి నీళ్లు పక్కనే ఉన్నా వాటిని.. సోదరులకు తామే అందించాల్సి వచ్చేదన్నారు. అదేమని ప్రశ్నిస్తే మేం మగాళ్లం. ఆడపిల్లలైన మీరే ఇంటి పనులు చేయాలని కండీషన్లు పెట్టేవారని వాపోయింది. ముఖ్యంగా తన పెద్ద సోదరుడు తనను చాలా ఇబ్బందులు పెట్టేవాడని, అన్ని పనులు తననే చేయమని ఆదేశించేవాడని పేర్కొంది.


స్నేహ


పార్థిబన్


నయనతార

నయనతారను రావొద్దని చెప్పాను

తమిళ సినిమా: ఎలాంటి తారలు అయినా మొదట్లో అవకాశాల కోసం కాళ్లరిగేలా తిరగాల్సిందే. అవమానాలను భరించాల్సిందే. అయితే కథానాయికలకు ఆరంభ కష్టాలు అంతంత మాత్రమేని చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఇండియన్ లేడీ సూపర్ స్టార్‌గా వెలిగిపోతున్న నయనతార కూడా అలాంటి గడ్డు పరిస్థితులను దాటి వచ్చిన వారే. పురుషాధిక్యత అధికం అని చెప్పబడే ఈ సినిమా రంగంలో నయనతార ఆరంభ కాలంలో పలు అవమానాలను ఎదుర్కొని మానసిక వేదనలను అనుభవించినవారే. ఇంకా జీవితంలో పలు ఎత్తు పల్లాలను చవి చూశారు. అయ్యా చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన మలయాళీ భామ నయనతార. అయితే అంతకు ముందే పార్థిబన్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించిన కొడైకుల్ మళై చిత్రం ద్వారా పరిచయం కావలసి ఉంది. అయితే ఆమెను పార్థిబన్ రావొద్దని చెప్పారట. ఈ సంఘటన గురించి ఆయన ఇటీవల ఒక భేటీలో చెప్పారు. నయనతార ఫొటో ఒకటి చూసి తాను దర్శకత్వం వహించనున్న కొడైకుల్ మళై చిత్రంలో ఆమెను కథానాయకిగా నటింపజేయాలని భావించానన్నారు. దీంతో కేరళకు చెందిన నయనతారను ఒక రోజు ఉదయం 8 గంటలకు రమ్మని చెప్పానన్నారు. అయితే ఆమె ఆ రోజు రాకుండా, మరుసటి రోజు ఫోన్ చేసి నిన్న రాలేకపోయానని, ఈ రోజు బస్సు ఎక్కి రేపు ఉదయం కచ్చితంగా వస్తాను అని చెప్పారన్నారు. చాలా కోపానికి గురైన తాను లేదు నువ్వు రావొద్దు అని చెప్పానన్నారు. కాగా, అలా కేరళ నుంచి బస్సులో వస్తున్నా.. అని చెప్పిన నయనతార ఈ రోజు లేడీ సూపర్ స్టార్‌గా ఎదగడం గొప్ప విషమని కొనియాడారు.

ప్రాచీన వైద్యం నేపథ్యంలో 'బెల్'

తమిళసినిమా: ప్రకృతి సిద్ధవైద్యం నేపథ్యంలో సాగే సినిమా బెల్ అని.. ఆ చిత్ర వర్గాలు తెలిపారు. ప్రోగస్ మూవీస్ పతాకంపై పీటర్ రాజ్ నిర్మిస్తున్న చిత్రం బెల్. వెంకట్ భువన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి వెయిలోన్ కథ, సంభాషణలు అందించారు. నటుడు గురు సోమసుందరం, శ్రీధర్ మాస్టర్, నితీష్ వీరి, పీటర్‌రాజ్, దుర్గ తదితరులు ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రానికి రాబర్ట్ సంగీతాన్ని, భరణి కన్నన్ ఛాయాగ్రహణం అందించారు. 100 ఏళ్లకు పైగా జీవించిన అగస్త్యియార్ అనే సిద్ధ వైద్యుడు ఆరోగ్యానికి సంబంధించిన ఆరు రహస్యాలను తన శిష్యులకు చెప్పి వాటిని భద్రంగా కాపాడమని కోరుతారన్నారు. అయితే ఆ రహస్యాలను కాపాడడంలో జరిగే ప్రయోజనాలు, నష్టాలను ఆవిష్కరించే చిత్రంగా బెల్ ఉంటుందన్నారు. నాన్ లైనియర్ టెక్నాలజీతో రూపొందించిన ఇది రొమాన్స్, సెంటిమెంట్, యాక్షన్ వంటి కమర్షియల్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. మంచికి చెడుకు మధ్య జరిగే పోరాటమే ఈ చిత్రం అన్నారు. చిత్ర నిర్మాణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. చిత్రాన్ని జులైలో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.


బెల్ చిత్రంలో ఓ సన్నివేశం

క్లుప్తంగా

ఆంగ్ల బోధనకు ప్రత్యేక ప్రాజెక్టు



సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని 36 చైల్డ్ కేర్ సంస్థలలో మ్యాజిక్ ఇంగ్లీష్ లెర్నింగ్ బడ్డీని ఉపయోగించి ఆంగ్ల విద్యా బోధన చేపట్టేందుకు గాను.. ప్రత్యేక స్కిల్ ప్రాజెక్టుకు మంగళవారం శ్రీకారం చుట్టారు. 1500 మంది విద్యార్థులు 100 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చే విధంగా కరాడి పాత్ ఎడ్యుకేషన్ సంస్థతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు అవసరమైన కిట్లను చైల్డ్ కేర్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యదర్శి అమర్ కుషావా, కరాడి పాత్ ఎండీ విశ్వనాథ్ అందజేశారు.

తిరునల్లారులో ఘనంగా రథోత్సవం

తిరువొత్తియూరు: తిరునల్లారు శని భగవాన్ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. వివిధ పుష్పాలతో అలంకరించిన పెద్ద రథంపై త్యాగరాజస్వామిని ఆశీనులను చేశారు. మంత్రి శరవణకుమార్, కలెక్టర్ కులోత్తుంగన్, ఎమ్మెల్యే శివ రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శనిభగవానుడు బంగారు పల్లకి వాహనంపై విహరించనున్నారు. జూన్ 1న తెప్పోత్సవం జరగనుంది. ఆలయ రథోత్సవం సందర్భంగా తిరునల్లారులో మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవు ప్రకటించారు.

బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం

అన్నానగర్: తిరుచ్చికి అక్రమంగా తరలిస్తున్న రూ.9.5 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి విమానాశ్రయానికి సోమవారం రాత్రి సింగపూర్ నుంచి ఎయిర్ ఇండియా విమానం వచ్చింది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తి తీసుకొచ్చిన గ్రైండింగ్ మిషన్‌పై అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో తనిఖీ చేశారు. అందులో బంగారం దాచి పెట్టినట్లు తేలింది. అనంతరం రూ.9.64 లక్షల విలువైన 159 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

300 లీటర్ల ఆవిన్ పాలు వెనక్కి

తిరువళ్లూరు: ఆలస్యంగా వెళ్లిన 300 లీటర్లు ఆవిన్‌పాలను డీలర్లు తీసుకోకుండా వెనక్కి పంపారు. తిరువళ్లూరు జిల్లా కాకలూరు ఆవిన్‌పాల ఉత్పత్తి కేంద్రం ఉంది. ఇక్కడ సమీప ప్రాంతాలకు చెందిన 24 వేల రైతుల నుంచి 1.10 లక్షల లీటర్లు పాలను రోజుకు కొనుగోలు చేసి వీటిలో 96 లక్షల లీటర్లను విక్రయిస్తున్నారు. మిగిలిన పాలను ఆవిన్ ఉత్పత్తులకు వినియోగిస్తున్నారు. కాకలూరు ఆవిన్ కేంద్రం నుంచి ఉదయం నాలుగు గంటలకు 40 వాహనాల్లో పాలను వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే మంగళవారం పాల తయారీ ఉత్పత్తి కేంద్రంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సరఫరా ఆలస్యమైంది. దీంతో నిర్ణీత సమయానికి ఆవిన్ పాలు వెళ్లక పోగా, మరో వాహనం బ్రేక్ డౌన్ కారణంగా తొమ్మిది గంటలకు పాలు వెళ్లాయి. దీంతో మూడు వందల లీటర్లను డీలర్లు వెనక్కి పంపారు.

మార్కుల జాబితా మాయం

- పోలీసులకు ఫిర్యాదు

కొరుక్కుపేట: చెన్నై బ్రాడ్‌వేలో ఉన్న భారతీ ప్రభుత్వ మహిళా కళాశాలలో 58 మంది విద్యార్థినుల మార్కుల షీట్లు మాయమయ్యాయి. ప్రొఫెసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారతి ప్రభుత్వ మహిళా కళాశాల చెన్నైలోని బ్రాడ్‌వే ప్రకాశం రోడ్‌లో ఉంది. ఇక్కడ వెయ్యి మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. ఈ కళాశాలలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈక్రమంలో 58 మంది విద్యార్థినులు కళాశాలలో చేరే సమయంలో పది, ప్లస్‌టూ మార్కుల సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇవి కనిపించకపోవడంతో ప్రొఫెసర్ హేమ ముత్యాలపేట క్రైం విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జర్మన్ యువకుడిపై కేసు

అన్నానగర్: ల్యాప్‌టాప్ చోరీ చేశారని తప్పుడు ఫిర్యాదు చేసిన జర్మనీ పౌరుడు ఫ్రెడరిక్ విన్సెంట్ (23)పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతను ఈ నెల 24వ తేదీ భారతదేశ పర్యటనలో భాగంగా చెన్నై వచ్చాడు. వలసరవాక్కం శ్రీదేవికుప్పం ప్రాంతంలోని లాడ్జికి నడిచి వెళుతుండగా మేట్టుకుప్పం రోడ్డులోని జయరామ్‌నగర్ ప్రాంతానికి రాగానే హెల్మెట్ ధరించి బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి ల్యాప్‌టాప్, రెండు బ్యాగులు చోరీ చేసినట్లు వలసరవాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నిఘా కెమెరాలో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా జర్మన్ యువకుడు ఎలాంటి బ్యాగ్ తీసుకురాలేదని తెలిసింది. మద్యం మత్తులో తిరువాన్మియూరులోని హోటల్ గదిలో బ్యాగ్, ల్యాప్‌టాప్‌లను ఉంచినట్లు గుర్తించారు. వలసరవాక్కం పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

ముగిసిన ఉజ్జీవ మహాసభలు

కొరుక్కుపేట: చెన్నై క్రోంపేట తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థత ఉజ్జీవ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు ముఖ్య ప్రసంగీకులుగా దైవజనులు యేసయ్య దీవెన టీవీ వర్తమానికులు, ఏలూరు పాస్టర్ జ్యోతి రాజుతో పాటు రీవైవల్ మినిస్ట్రీస్ చెన్నై పాస్టర్ లూకాస్ శేఖర్ పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. స్వస్థత ప్రార్థనలు చేశారు. లూకాస్ శేఖర్ మాట్లాడుతూ.. క్రైస్తవులు శాంతి సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. సంఘం పెద్దలు సుందరం, మనో, వినోద్, ప్రభాకర్, మోసెస్ పాల్గొన్నారు.

3న కరుణానిధి శత జయంతి సభ



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కార్యదర్శి నందకుమార్

వేలూరు: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని అనకట్టు నియోజక వర్గ ఎమ్మెల్యే, డీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శి నందకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఆ పార్టీ జిల్లా కార్యకర్తల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నందకుమార్ మాట్లాడుతూ కరుణానిధి జయంతి వేడుకల్లో భాగంగా జూన్ 3వ తేదిన మొదటి విడత చెన్నైలో జరగనుందని, తిరువావూరు బహిరంగ సభలో సీఎం స్టాలిన్ పాల్గొంటారని వెల్లడించారు. వీటిలో జాతీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు పాల్గొంటారన్నారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతిని ఆహ్వానించక పోవడం, ఆమెను అవమానం పరిచే విధంగా ప్రధాని మోదీ వ్యవహరించాడాన్ని డీఎంకే పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో గెలుపొందిన కర్ణాటక రాష్ట్ర ప్రజలకు అభినందలను తెలుపుతూ తీర్మానం చేశారు. డీఎంకే పార్టీలో అధికంగా సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కార్తికేయన్, అములు విజయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, జిల్లా కోశాధికారి నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం అవసరం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళలు

తిరువళ్లూరు: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత ప్రచారం అవసరమని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా చిన్నమాపేట గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాలను ప్రజల వద్దకు చేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పక్షపాతం ఉండకూడదన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల వద్దకు వచ్చే వారిని సైతం తరచూ తిప్పించుకోకుండా తక్షణం న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

సెల్ టవర్‌కు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: కంబంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌కు మంగళవారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తేని జిల్లా కంబంలోని కామయకొండన్ పట్టి రోడ్డు వీధికి చెందిన అరున్ జేసుదా (28) తల్లిదండ్రులు మృతిచెందడంతో తన బంధువు ఉమారాణి ఇంటిలో నివాసం ఉంటున్నాడు. నాలుగేళ్ల క్రితం లా కాలేజీలో చేరిన అరుణ్ జేసుదా మొదటి సంవత్సరం చదివి తరువాత మధ్యలోనే వదిలేశాడు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఉమారాణి, బంధువులు అతని కోసం పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకి తెలియరాలేదు. కంబం నార్త్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అరుణ్ జేసుదా కోసం వెతికారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం కామయకొండన్ పట్టిలోని బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి వెళ్లి చూడగా వ్యక్తి మృతదేహం కనిపించింది. అరుణ్ జేసుదాగా గుర్తించారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగివున్న బస్సును ఢీకొన్న లారీ

- మెకానిక్ మృతి
- మరో ముగ్గురికి గాయాలు

తిరువొత్తియూరు: పంక్చర్ అయిన బస్సు టైరును మారుస్తున్న సమయంలో లారీ ఢీ కొట్టడంతో మెకానిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మంగళవారం రాత్రి వేలూరు నుంచి కాంచీపురానికి 60 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేట్ బస్సు బయలుదేరింది. వాలాజా టోల్‌గేట్ బైపాస్ రోడ్డులో వెళ్తుండగా 11 గంటల ప్రాంతంలో బస్సు ముందు టైరు పంక్చర్ అయ్యింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపి కాంచీపురంలోని తన కంపెనీ యాజమానికి సమాచారం అందించాడు. దీంతో కదిర్వేడు గ్రామానికి చెందిన మెకానిక్ కుమార్ కారులో కొత్త టైర్‌ను తీసుకొచ్చి మార్చేందుకు బస్సు కిందికి వెళ్లాడు. ఆ సమయంలో పూణే నుంచి చెన్నైకి పార్సిల్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి ఆగివున్న బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో టైరు మారుస్తున్న కుమార్ ముందు చక్రంలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతర ప్రయాణికులు అప్పటికే బస్సు నుంచి కిందికి దిగి రోడ్డు పక్కన ఉండడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వాలాజ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి తీవ్రంగా గాయపడిన ముగ్గురిని రక్షించి వాలాజా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం టైర్ కింద ఇరుక్కున్న కుమార్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలిం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్



బాధిత కుటుంబంతో సమత్వ మక్కల్ కజగం నాయకులు

కొరుక్కుపేట: అన్నా విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన స్టీల్ గ్రిల్‌లో నిర్వాహణ సరిగ్గా లేకపోవడంతో విద్యుత్ షాక్‌తో భర్త చనిపోయాడని ఆరోపిస్తూ.. తనకు తూత్తుకుడి కార్పొరేషన్, ట్యాన్ జెడ్కో, ప్రభుత్వం నుంచి రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బాధితురాలు కలెక్టర్ కె సెంథిల్ రాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. తూత్తుకుడి సమీపంలోని ఆరోగ్యపురం అయ్యర్‌విలైకి చెందిన జయగణేశన్ (33) ఈ నెల 25న కామరాజ్ కూరగాయల మార్కెట్ సమీపంలోని అన్నా విగ్రహం వద్ద కూరగాయలు విక్రయిస్తుండగా, విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రిల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. నిర్వహణ లోపం వల్లే భర్త చనిపోవడానికి.. తాను, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యామని బాధితురాలు తెలిపింది. అధికార డీఎంకే, కార్పొరేషన్, తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ బాధ్యత వహించాలని కోరింది. తమ కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం మృతుడి భార్య జె. లింగశివ కోరింది. బాధిత కుటుంబంతో కలిసి సమత్వ మక్కల్ కళగం ఆఫీసు బేరర్లు వినతిపత్రం సమర్పించారు.

మహిళా ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు

తిరువొత్తియూరు: దిండుకల్లు పౌష్టికాహారం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సిబ్బంది కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. జిల్లా అధ్యక్షుడు రామ నేతృత్వం వహించాడు. జిల్లా కార్యదర్శి మనీకలై తమ డిమాండ్లను తెలియజేశారు. ఆందోళనలో విద్యార్థులకు అందించే అల్పాహారం పౌష్టికాహారాన్ని ఉద్యోగులే తయారు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు డీఏ మంజూరు చేయాలని కోరారు. ఇందులో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మంగళ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

నగల వ్యాపారిపై దాడి.. నగదు అపహరణ

అన్నానగర్: నెల్లైలో నగల వ్యాపారిపై దాడి చేసి రూ. 1.50 కోట్లతో ఉడాయించిన ముసుగు దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నెల్లై పట్టణానికి చెందిన సుశాంత్ (40) స్థానికంగా నగల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం నగలు కొనుగోలు చేసేందుకు ఇద్దరు సహాయకులతో కలిసి తన కారులో కేరళలోని నేయాతంగరైకి వెళ్లాడు. నెల్‌లై నుంచి రెండు కార్లు అనుసరించాయి. నాంగునేరి మూంతైపు రైల్వేస్టై ఓవర్ వద్ద సుశాంత్ కారును అడ్డగించి కారంపొడి ఇనుప రాడ్‌తో దాడి చేశారు. కారు అద్దాలను పగులగొట్టి అందులోని రూ.1.50 కోట్లు తీసుకుని పరారయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దాడిలో గాయపడిన సుశాంత్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు అనుమతించినా సాగని సర్వే



సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులు, పోలీసులు

తిరుత్తణి: సర్వేకు కోర్టు అనుమతించినా అడ్డుకట్ట తొలగకపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్కేపేట మండలం సహస్రపద్మాపురం గ్రామానికి చెందిన హరి(45) రైతు. గ్రామానికి సమీపంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. పక్కనే రాజేంద్రన్ అనే వ్యక్తికి 66 సెంట్ల భూమి ఉంది. అయితే రెండేళ్ల కిందట తనకు సొంతమైన 22 సెంట్లు రాజేంద్రన్ ఆక్రమించాడని.. సర్వే చేసి న్యాయం చేయాలని హరి తహసీల్దార్‌ను కోరారు. అధికారుల కాలయాపనతో రాజేంద్రన్ కోర్టు మెట్టెక్కాడు. రెండేళ్ల నుంచి సర్వే ఆగిపోవడంతో వ్యవసాయ పనులకు ఇబ్బందిగా మారిందని హరి కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన న్యాయమూర్తులు మంగళవారం సర్వే చేపట్టాలని ఆర్కేపేట తహసీల్దార్‌ను ఆదేశించారు. సర్వే చేపట్టేందుకు వీలుగా రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రాజేంద్రన్ కోర్టు తనకు ఎలాంటి ఉత్తరాలు పంపలేదని సర్వే చేపట్టేందుకు అవకాశం లేదని వాగ్వాదానికి దిగాడు. దీంతో చేసేదేమిలేక రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు.

గర్భిణి ఆత్మహత్య

అన్నానగర్: తిరుకోవిలూరులో మంగళవారం ఐదు నెలల గర్భిణీ విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. కళ్లకురిచ్చి జిల్లా తిరుకోవిలూరు సమీపంలోని కోమలూరు గ్రామానికి చెందిన ఏలుమలై కుమార్తె ఉమ (17) విరుదాచలం సమీపంలోని సి.కీరనూరు గ్రామానికి చెందిన విమల్‌రాజ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. గర్భం దాల్చడంతో కోమలూరులోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. సోమవారం ఉమను చూడడానికి విమల్ రాజ్ మద్యం మత్తులో అక్కడికి వచ్చాడు. దీంతో ఉప భర్తపై కోపగించుకుని వెళ్లిపోవాలని చెప్పింది. భర్త ప్రవర్తన నచ్చక ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషం తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన ఇరుగుపొరుగు వారు తిరుకోవిలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విల్లుపురంలోని ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ఉమ సోదరుడు ఉదయకుమార్ తిరుకోవిలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్‌ఏ

అన్నానగర్: కడలూరులో ఇంటి కొలతలు వేసి పట్టా ఇచ్చేందుకు రూ.5వేలు లంచం తీసుకున్న సర్వేయర్, గ్రామ సహాయకుడిని అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. కడలూరు కమ్మంపేట మారియమ్మన్ కోవిల్ వీధికి చెందిన సెల్వకుమార్ (49) ఎలక్ట్రీషియన్. ఇతని భార్య సుధ, పాదిరికుప్పంలో సెల్వకుమార్‌కు సొంత ఇల్లు ఉంది. సుధ పేరుతో ఈ ఇంటికి సబ్ డివిజన్ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. పాదిరికుప్పం గ్రామ సహాయకురాలు మారియమ్మాళ్ (44), పాదిరికుప్పం గ్రామ పరిపాలన కార్యాలయంలో పని చేస్తున్న తూర్పు రామాపురం సర్వేయర్ పంచనాథన్ (50)లను కలిసి తమ ఇంటిని కొలిచి పట్టా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మారియమ్మాళ్, పంచనాథన్ రూ.5వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సెల్వకుమార్ కడలూరు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం పథకం ప్రకారం నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి మారియమ్మాళ్, పంచనాథన్‌లను అరెస్టు చేశారు.

నీటి కుంటలో పడి వృద్ధుడి మృతి



గాలింపు చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది

వేలూరు: క్వారీ నీటి కుంటలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన వేలూరు జిల్లా పెన్నాతూరు గ్రామంలో చోటుచేసుకుంది. గణేషపురం గ్రామానికి చెందిన అభిమన్నన్(70) సోమవారం మధ్యాహ్నం భార్య పుష్పతో కలిసి గ్రామ సమీపంలోని క్వారీ నీటి కుంట వద్దకు వెళ్లాడు. భార్య బట్టలు ఉతుకుతుండగా అభిమన్నన్ కుంటలో స్నానానికి దిగాడు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయాడు. గమనించిన భార్య కేకలు వేయడంతో స్థానికులు వచ్చి గాలించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. మంగళవారం ఉదయం వరకు గాలించినా ఫలితం లేకపోవడంతో అరక్కోణం నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. 18 మందితో కూడిన బృందం అభిమన్నన్ మృతదేహాన్ని బయటకు తీశారు.

బావిలో పడిన బాలుడిని రక్షించి..

అన్నానగర్: మదురై కరుప్పయూరాణి ప్రాంతానికి చెందిన ముత్తుకుమార్ (36) ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య చెల్లాయ్ (28), మారన్ (05), ఇనియవన్ (03) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పాఠశాలకు సెలవులు కావడంతో ఊరు వెళ్లిన భార్య, పిల్లలను తీసుకురావడానికి సోమవారం మధ్యాహ్నం ముత్తుకుమార్ బస్‌స్టేషన్‌కు బైకుపై వెళ్లాడు. కరుప్పయూరాణి బావిలో నలుగురు బాలురు స్నానం చేస్తున్నారు. నీటిలో మునిగిపోతున్న బాలుడిని చూశాడు. వెంటనే బండి ఆపి నీళ్లలోకి దూకి బాలుడిని కాపాడాడు. కాని ముత్తుకుమార్ బయటకు రాలేక నీట మునిగి మృతి చెందాడు. దీంతో కరుప్పయూరాణి పోలీసులకు సమాచారం అందించారు. తాళ్లకుళం అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం వద్ద భార్య, పిల్లల రోదనలు అక్కడివారిని కంటతడి పెట్టించింది. పెళ్లి రోజు కావడంతో భర్తను చూసేందుకు వచ్చానని, ఆయనకు ఈత రాదని భార్య పోలీసులకు చెప్పి కన్నీటి పర్యంతమైంది.

అన్నాడీఎంకేలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు



పార్టీ సభ్యత్వ నమోదు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి రమణ

పళ్లిపట్టు: అన్నాడీఎంకేలో నూతన సభ్యత్వ నమోదు శిబిరాన్ని మాజీమంత్రి రమణ మంగళవారం ప్రారంభించారు. వివరాలు.. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎడపాడి పళనిస్వామి ఆదేశాల మేరకు తిరువళ్లూరు వెస్ట్ జిల్లా కార్యదర్శి, మాజీమంత్రి రమణ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆర్కేపేట మండల కార్యదర్శి కుమార్ అధ్యక్షతన ఆర్కేపేట, చిన్ననాగపూండి ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాల్లో మాజీ మంత్రి రమణ పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యకర్తలు కలిసికట్టుగా అధిక సంఖ్యలో యువతీ, యువకులను పార్టీలో సభ్యులుగా చేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమాళ్, అశోక్, రాజీవ్‌గాంధీ, నరసింహన్, న్యాయవాది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: నాట్రంపల్లి వద్ద కంటైనర్ లారీలో అక్రమంగా వేరే రాష్ట్రానికి తరలిస్తున్న 10 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు మంగళవారం పట్టుకున్నారు. పారిపోయిన డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరుపత్తూరు జిల్లా నాట్రంపల్లి ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తిరుపత్తూరు కలెక్టర్ భాస్కర పాండియన్‌కు రహస్య సమాచారం అందింది. దీని ఆధారంగా మంగళవారం పనియండపల్లి పరిధిలోని వాలూరులో నాట్రంపల్లి తహసీల్దార్ కె.కుమార్ నేతృత్వంలో దేవదాయశాఖ వాహనాల తనిఖీలు చేపట్టారు. అటుగా వస్తున్న తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ గల కంటైనర్ లారీ వేగంగా వచ్చింది. రెవెన్యూ అధికారులు లారీని ఆపమని సంకేతాలిచ్చారు. డ్రైవర్ వెంటనే లారీని రోడ్డు పక్కన ఆపి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన రెవెన్యూ అధికారులు కంటైనర్ లారీని తెరిచి సోదాలు చేశారు. అందులో 10 టన్నుల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. ఆ తరువాత ట్రక్కుతో పాటు రేషన్ బియ్యాన్ని నాట్రంపల్లి ఏరియాలోని తమిళనాడు కన్స్యూమర్ గూడ్స్ ట్రేడింగ్ గోదాంకు అప్పగించారు. దేవాదాయశాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బియ్యాన్ని ఎవరు అక్రమంగా తరలించారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడిపై కోపంతో మామపై దాడి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆర్టిస్ట్ సెల్వం, బంధువులు

తిరువళ్లూరు: అల్లుడిపై ఉన్న కోపాన్ని మామపై చూపించి ఐదు వేళ్లను నరికి వీరంగం సృష్టించి పరారైన గంజాయి ముఠాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు సోమవారం ఉదయం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా చోళవరం యూనియన్ పెద్దకాలనీకి చెందిన ఆర్టిస్ట్ సెల్వం(52). ఇతడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన రాజా యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. వారం క్రితం చోళవరం వెళ్లిన రాజా అక్కడ పనులు ముగించుకుని సమీపంలోని పానీపూరి దుకాణం వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఈ క్రమంలో రాజాకు గంజాయి మత్తుతో ఉన్న యువకులకు మధ్య ఘర్షణ జరిగింది. రాజా మత్తులో ఉన్న యువకులపై చేయి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన మత్తుబాబులు మరుసటి రోజు రాజా ఇంటికి వెళ్లి వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటికి పక్కనే ఉన్న సెల్వంపై కత్తులతో దాడి చేసి ఐదు వేళ్లను నరికేశారు. తీవ్రంగా గాయపడిన సెల్వంను స్థానికులు చెన్నై స్టాన్లీ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చోళవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంత వరకు నిందితులను అరెస్టు చేయలేదని బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్‌కు ఫిర్యాదు చేశారు.

సీఆర్‌పీఎఫ్‌తో ఎస్‌ఆర్‌ఎం ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

కొరుక్కుపేట: సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పిల్లలకు ఉచిత సాంకేతిక విద్య, శిక్షణ, పరిశోధన కార్యక్రమాల కోసం ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) మధ్య అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం వైస్ చాన్సులర్ డాక్టర్ సి.ముత్తమిళ్‌సెల్వన్, రిజిస్ట్రార్ ఎస్. పొన్నుస్వామి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఎస్‌ఎల్ థాయోసెన్, సీఆర్‌పీఎఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అజితా థాయోసెన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముత్తమిళ్‌సెల్వన్ మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్‌తో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా బీటెక్ ప్రోగ్రామ్‌లను కొనసాగించేందుకు ఏటా సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పిల్లలకు మూడు ఉచిత సీట్లు అందించనున్నామని తెలిపారు.

హత్యకేసు నిందితుల లొంగుబాటు

తిరువొత్తియూరు: మహిళను ఇనుపరాడ్‌తో కొట్టి హత్య చేసిన యువకుడు సహా ఇద్దరు పోలీసులకు లొంగిపోయారు. రామనాథపురం సమీపంలోని కవనూరు ఆచారి మఠానికి చెందిన రవి కుమార్తె పవిత్ర(26). వివాహమై కుమారుడు, కుమార్తె వున్నారు. పవిత్ర భర్తతో విడిపోయి ఐదేళ్లుగా వేరుగా ఉంటోంది. కావనూర్‌లో పుట్టింట్లో ఉన్న పవిత్రకు ఓ డ్రైవర్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలిసి తండ్రి మందలించాడు. దీంతో గత ఏడాది మార్చిలో రవిని అతని భార్య భాగ్యం, కూతురు పవిత్ర కలిసి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు. ఈ హత్య కేసులో జైలుకు వెళ్లిన పవిత్ర కొన్ని నెలల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చింది. ఈ క్రమంలో రామనాథపురానికి చెందిన మేస్త్రీతో పవిత్రకు వివాహేతర సంబంధం ఏర్పడింది. పవిత్ర ప్రవర్తన నచ్చక సోమవారం రాత్రి పవిత్ర చిన్నాన్న ఆర్.కావనూరుకు చెందిన మురుగేశన్(45), అతని కుమారుడు మణికంఠన్(23), 18 ఏళ్ల యువకుడు కలిసి పవిత్ర తలపై ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేశారు. పారిపోయేందుకు ప్రయత్నించిన వారిలో స్థానికులు మణికంఠన్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు మేరకు రామనాథపురం బజార్ పోలీసులు కేసు నమోదు చేసి మణికంఠన్‌ను అరెస్టు చేశారు. మురుగేషన్, 18 ఏళ్ల యువకుడి కోసం వెతుకుతున్నారు. వీరిద్దరూ మంగళవారం ఉచ్చిపులి పోలీసులకు లొంగిపోయారు. రామనాథపురం బజార్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

కుక్కను చంపిన ముగ్గురి అరెస్టు

కొరుక్కుపేట: కోపంతో కుక్కను పొడిచి చంపిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మీంజూరు సమీపంలోని అత్తిపట్టు ప్రాంతానికి చెందిన రామమూర్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ఒక కుక్కను పెంచుకుంటున్నాడు. రోడ్డుపై వెళ్లే వారిని ఆ కుక్క తరచూ మొరిగేది. కొద్ది రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన శంకర్‌తోపాటు రామమూర్తి కుమారుడు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించేందుకు శంకర్, అతని స్నేహితులు ప్రభాకర్, రోహిత్ రామమూర్తి ఇంటికి వెళ్లారు. కుక్క మరోసారి వారిపై మొరగడంతో రామమూర్తికి, శంకర్ స్నేహితుల మధ్య తీవ్ర వాదన చోటుచేసుకుంది. అప్పటికే ఆగ్రహానికి గురైన శంకర్‌తో సహా ముగ్గురు వ్యక్తులు మరింత రెచ్చిపోయారు. కుక్కను కత్తితో పొడిచి చంపేశారు. రామమూర్తి మీంజూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శంకర్, ప్రభాకర్, రోహిత్‌లను అరెస్టు చేశారు.

చోరీకి విఫలయత్నం - దొంగకు దేహశుద్ధి

తిరువొత్తియూరు: వందవాసి సమీపంలో ఇంట్లోకి చొరబడి చోరీకి ప్రయత్నిస్తున్న దొంగను పట్టుకుని ప్రజలు దేహశుద్ధి చేశారు. తిరువణ్ణామలై జిల్లా వందవాసి శ్రీరంగరాజపురం గ్రామంలో శేఖర్ (43) అనే రైతుకు మేకల దొడ్డి ఉంది. మంగళవారం రాత్రి శేఖర్, అతని కుటుంబసభ్యులు ఇంట్లో తలుపులు తెరుచుకుని నిద్రిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకున్న ఓ యువకుడు అర్ధ రాత్రి వారి ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతన్ని చూసి మేకలు అరిచాయి. శబ్దం విన్న శేఖర్, కుటుంబీకులు బయటకు వచ్చారు. యువకుడిని చూడగానే కేకలు వేశారు. కేకలు విని ఇరుగుపొరుగు వచ్చారు. వారిని చూడగానే చోరీకి వచ్చిన యువకుడు పారిపోవడానికి ప్రయత్నించి వ్యవసాయ బావిలోకి దూకాడు. ప్రజలు వెంటాడి దొంగను బావిలో నుంచి పైకి లేపి స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలిసి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నడి రోడ్డుపై ఫైనాన్షియర్ దారుణ హత్య

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా తండ్రాంబట్టులో నడిరోడ్డుపై ఫైనాన్షియర్‌ను హత్య చేశారు. దేవనూరు గ్రామానికి చెందిన కాశి కుమారుడు అరుల్ అలియాస్ అరుల్ కుమార్(37) అదే ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. సోమవారం రాత్రి అరుల్ తిరువణ్ణామలైకి బైకుపై వచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. రాత్రి 11 గంటలకు మనలూరుపేట రోడ్డుపై వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని అడ్డుకున్నారు. కత్తితో నరికి హత్య చేశారు. విషయం తెలుసుకున్న తచ్చంబట్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్, విశాఖ జిల్లాలకు జాతీయ అవార్డులు

ఇంటింటికీ కుళాయిల ఏర్పాటులో అగ్రగామిగా నిలిచాయంటూ కేంద్రం ప్రశంస

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటులో ఏపీలోని వైఎస్సార్, విశాఖపట్నం జిల్లాలు.. దేశంలోనే ఉత్తమ జిల్లాలుగా ఎంపికయ్యాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. 2024 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షిత మంచి నీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో కేంద్రం రూపొందించిన జలజీవన్ సర్వేక్షణ్ (జేజేఎస్-2023)కు సంబంధించి బెస్ట్ పెర్ఫార్మింగ్, ఫాస్టెస్ట్ మూవింగ్ కేటగిరీల్లో వైఎస్సార్, విశాఖ జిల్లాలు జాతీయ స్థాయిలో టాప్‌లో నిలిచాయని సీఎస్ తెలిపారు. గతేడాది అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆస్పిరేషన్ జిల్లాల కేటగిరీలో.. 75–100 శాతం మధ్య ఇళ్లకు నీటి కుళాయిల ఏర్పాటులో వైఎస్సార్ జిల్లా.. 50–75 శాతం మధ్య ఇళ్లకు నీటి కుళాయిల ఏర్పాటులో విశాఖ జిల్లాలు అగ్రగామిగా నిలిచాయని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన ప్రశంసాపత్రాలను కేంద్ర జల్‌జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి వికాస్ షీల్ పంపించారని సీఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు.

గృహ నిర్మాణానికి కావాల్సిన రుణం రూ.18,603 కోట్లు

నాబార్డు రాష్ట్ర ఫోకస్ పత్రంలో వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కింద పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిన విషయాన్ని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ప్రత్యేకంగా ప్రస్తావించింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తొలి దశలో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తోందని, ఇందు కోసం తొలి దశలో రూ.28,084 కోట్లు ఖర్చు చేస్తోందని 2023–24 రాష్ట్ర ఫోకస్ పత్రంలో నాబార్డు పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో గృహ నిర్మాణానికి రూ.18,603 కోట్ల మేర రుణాల ఆవశ్యకత ఉంటుందని ఆ పత్రంలో అంచనా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 30 లక్షల మందికి పైగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తోందని పేర్కొంది. సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపింది. ఈ గృహాలతో పేదల జీవన పరిస్థితులు, ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వివిధ ప్రభుత్వ ఇళ్ల పథకాలపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లోని బలహీనవర్గాల గృహ నిర్మాణాలకు రుణాలివ్వాలని సూచించింది. గృహాలకు జియో ట్యాగింగ్ చేయడం వల్ల నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, నిర్మాణాల్లో జాప్యాని నివారించవచ్చని చెప్పింది. గృహ రుణాల నెలవారీ వాయిదాలను జాప్యం చేస్తే బ్యాంకులు జరిమానా విధిస్తున్నాయని, అయితే వాయిదాలను గడువు తేదీ కంటే ముందుగా చెల్లించిన వారికి రివార్డులు కూడా ఇవ్వాలని సూచించింది. దీని వల్ల గడువు కన్నా ముందుగానే రుణ వాయిదాల చెల్లింపును ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొంది.

'సుజనా' వైద్య కళాశాలకు షాక్

• తెలంగాణ

- ఎంబీబీఎస్ ప్రవేశాలు రద్దు
- జాతీయ మెడికల్ కమిషన్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ సుజనా చౌదరికి చెందిన వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) కోర్సుల్లో ప్రవేశాలను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంగళవారం రద్దు చేసింది. మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లో మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఉంది. వాటిలో 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలను రద్దు చేసినట్లు ఎన్ఎంసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. మెడిసిటీ సుజనా చౌదరి యాజమాన్యంలో ఉంది. ఇది కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది. ఈ విషయమై తమకు కూడా ఇంకా సమాచారం రాలేదని, కారణాలు తెలియవని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో ఈ ఏడాది నీట్ రాసిన విద్యార్థులు ఈ కళాశాలలో చేరడానికి వీలుండదు.

యథాతథంగా రిజిస్ట్రేషన్ సేవలు

సాంకేతిక సమస్య పరిష్కారం



సాక్షి, అమరావతి: రెండు రోజులుగా రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లకు ఏర్పడ్డ సాంకేతిక సమస్యలను పరిష్కరించి సేవలను పునరుద్ధరించినట్లు రిజిస్ట్రేషన్ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. 29న రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలకు అసౌకర్యం కలిగిందని పేర్కొంది. వెంటనే సాంకేతిక సమస్యను పరిష్కరించామని, రిజిస్ట్రేషన్ సేవలు యథాతథంగా జరుగుతాయని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా రిజిస్ట్రేషన్ సిస్టం సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ప్రజలకు ఇంకా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ వెబ్‌సైట్ https://registration.ap.gov.in ని సందర్శించాలని కోరింది.


సహకార డెయిరీ రంగాన్ని చంపేసింది చంద్రబాబే



హెరిటేజ్ కోసం రాష్ట్రంలో సహకార డెయిరీ రంగం నిర్వీర్యం

- సహకార డెయిరీలు కంపెనీలుగా మార్పు
- వైఎస్సార్, చిత్తూరు, తూర్పు, అనంతపురం డెయిరీలు మూతపడిందీ బాబు హయాంలోనే
- యూహెచ్‌టీ, పౌడర్ ప్లాంట్లు, ఎంసీసీలతో పాటు 141 బీఎంసీయూలూ మూత
- నాలుగేళ్లుగా సహకార రంగం బలోపేతానికి వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి
- పాడి రైతుల మేలుకే అమూల్‌తో ఒప్పందం
- జగనన్న పాల వెల్లువ పథకం కింద పాడి రైతులకు గిట్టుబాటు ధర
- పెద్ద ఎత్తున పాడి రైతులకు ప్రయోజనాలు
- మూతపడ్డ డెయిరీల పునరుద్ధరణకు చర్యలు
- ఇవేమీ పట్టించుకోకుండా 'ఈనాడు' రోత రాతలు

ఫ్యాక్ట్ చెక్



చంద్రబాబు ప్రభుత్వం హయాం..

రాష్ట్రంలో సహకార డెయిరీలను ప్రభుత్వమే చిదిమేసింది. చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్ ఎదుగుదల కోసం గ్రామ గ్రామాన వేళ్లూనుకొన్న సహకార డెయిరీలను ఆయన ప్రభుత్వమే నాశనం చేసేసింది. కొన్నింటిని తనకు అనుంగులుగా ఉండే వ్యక్తులకు అప్పజెప్పింది. చివరకు రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతులు ఘోరంగా దెబ్బతిన్నారు. పాలకు కనీస ధర కూడా అందక అల్లాడిపోయారు.

'ఈనాడు' విషం..

విషపు రాతల 'ఈనాడు'కు ఈ వాస్తవాలు పట్టవు. ప్రజల సంక్షేమం అసలే పట్టదు. ఎంతసేపూ వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యం. అందులో భాగంగానే 'అమూల్ మాకొద్దం'టున్నారంటూ విషపు రాతలతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది.

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక..

మూతపడ్డ సహకార పాల డెయిరీలు పునరుద్ధరించి, పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామ గ్రామాన మహిళా పాడి రైతు సంఘాలను ఏర్పాటు చేసి సహకార రంగాన్ని బలోపేతం చేసింది. గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. లీటర్‌కు రూ. 4 మేర అదనపు ప్రయోజనం కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మిన్నగా జగనన్న పాల వెల్లువ పథకం కింద లీటర్‌కు రూ.5 నుంచి రూ.20 వరకు అదనపు లబ్ధి చేకూరుస్తోంది. పాడి రైతులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన పాల సేకరణ, సరఫరాయే లక్ష్యంగా పాలసేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం –2023ను తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో గిట్టుబాటు ధర వస్తోంది. అమూల్‌కు పాలు పోసే వారే కాదు.. అమూల్ రాకతో పాల సేకరణ ధరలు పెంచడం వలన ప్రైవేటు డెయిరీలకు పాలు పోస్తున్న పాడి రైతులూ లబ్ధి పొందుతున్నారు.

ప్రైవేటు డెయిరీల రైతులకూ లబ్ధి

అమూల్ రాకతో ప్రైవేటు డెయిరీలకు పాలు పోసే రైతులకూ లబ్ధి చేకూరింది. అమూల్ పాల సేకరణ ధర పెంచడంతో ప్రైవేటు డెయిరీలు కూడా విధిలేని పరిస్థితుల్లో పాల సేకరణ ధరలు పెంచాయి. అమూల్ ఇచ్చే ధరతో పోలిస్తే తక్కువే అయినా, వాటికి పాలు పోసే పాడి రైతులకు ఈ 30 నెలల్లో రూ.3,312.46 కోట్ల అదనపు ప్రయోజనం చేకూరింది.

సహకార డెయిరీలకు చంద్రబాబు కాటు

హెరిటేజ్ డెయిరీ కోసం రాష్ట్రంలో సహకార డెయిరీ రంగాన్ని ఓ పథకం ప్రకారం నిర్వీర్యం చేసింది చంద్రబాబు ప్రభుత్వమే. సహకార స్ఫూర్తితో ఏర్పాటైన పాల యూనియన్లను ప్రభుత్వ అనుమతి లేకుండానే మాక్స్ పరిధిలోకి మార్చారు. ఆ తర్వాత వాటిని కంపెనీలుగా ప్రకటించుకున్నారు. విశాఖ, గుంటూరు, ప్రకాశం జిల్లా యూనియన్లు కంపెనీల యాక్టు–1956 కింద కంపెనీలుగా ప్రకటించుకున్నాయి. రాష్ట్ర విభజనకు ముందు లాభాల్లో ఉన్న ప్రభుత్వ డెయిరీలన్నీ బాబు హయాంలో మూతపడ్డాయి. 2017 జనవరి 23న కడప జిల్లాలోని పులివెందుల డెయిరీ, 2018 జూలై 31న తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి డెయిరీ, 2018 నవంబర్ 30న కృష్ణాలోని మినీ డెయిరీ–కంకిపాడు, 2019 మార్చి 15న చిత్తూరు జిల్లాల్లోని మదనపల్లి డెయిరీ, మరో 8 సహకార డెయిరీలు మూతపడ్డాయి. అంతేకాదు అన్నమయ్య జిల్లాలోని అల్ట్రా హై ట్రీట్‌మెంట్ (యూహెచ్‌టీ) ప్లాంట్, ప్రకాశం జిల్లాలోని మిల్క్ పౌడర్ ప్లాంట్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున మిల్క్ చిల్లింగ్ సెంటర్ (ఎంసీసీ)తో పాటు 141 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీయూలు) మూతపడ్డాయి. రాష్ట్రంలోని పాల డెయిరీలన్నీ ప్రొడ్యూసర్ కంపెనీల చేతుల్లోకి వెళ్లాయి. పాల సహకార సంఘాలు నష్టాల్లో కూరుకుపోయి ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితికి తెచ్చారు. కోట్లాది రూపాయల విలువైన మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, చిల్లింగ్ సెంటర్లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లతో సహా ఇతర మౌలిక సదుపాయాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వీటిపై ఈనాడు పత్రిక ఏనాడూ చిన్న వార్తా రాయలేదు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రం మన రాష్ట్రం నుంచి పాలను సేకరించడమే నిలిపివేసింది. రూ.45 కోట్లకు పైగా బకాయిలను ఎగ్గొట్టారు. అయినా బాబు సర్కారు నోరు మెదపలేదు.

సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పాల సహకార సంఘాల పునరుద్ధరణ, పాడి రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమూల్‌తో ఒప్పందం చేసుకుంది. గ్రామాల్లో మహిళా డెయిరీ సహకార సంఘాలు (ఎండీఎస్) ఏర్పాటు చేశారు. ఆర్బీకేలకు అనుసంధానంగా పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పాలు సేకరిస్తున్నారు. మూడు జిల్లాలతో మొదలైన పాల సేకరణ ప్రస్తుతం 17 జిల్లాలకు విస్తరించింది. 20 – 30 ఏళ్లుగా ఈ రంగంలో ఉన్న ప్రైవేటు డెయిరీలు ప్రస్తుతం రోజుకు 5 – 6 లక్షల లీటర్లు సేకరిస్తుంటే, కేవలం 30 నెలల్లోనే అమూల్ సంస్థ రోజుకు సగటున 1.72 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. గతంలో ప్రైవేటు డెయిరీలు రెండేళ్లకోసారి పాలసేకరణ ధరలు పెంచేవి. అమూల్ మూడు నెలలకోసారి పాల సేకరణ ధరలను సవరిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఇలా 30 నెలల్లో ఏడు రెట్లు పెంచింది. ప్రస్తుతం గేదె పాలకు గరిష్టంగా లీటర్‌కు రూ.88, ఆవు పాలకు రూ.43.69 చెల్లిస్తున్నారు. 30 నెలల్లో గేదె పాలపై రూ.16.53, ఆవు పాలపై రూ. 9.49 మేర ధరలు పెంచారు. ఒక్క రూపాయి తక్కువ కాకుండా 10 రోజులకోసారి నేరుగా వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. మరో వైపు పాడి రైతులకు ఆర్బీకేల ద్వారా ఇన్‌పుట్స్ అందిస్తున్నారు. మధ్యవర్తులు, వాటాదారుల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా ప్రోత్సాహకం, బోనస్ పంపిణీ చేస్తున్నారు. ఏటా 2 సార్లు లీటరుకు అర్ధ రూపాయి లాయల్టీ బోనస్ కూడా వస్తోంది. పాడి రైతుల సంరక్షణ, నిర్వహణ కోసం రూ.40 వేల వరకు ఎలాంటి హామీ లేకుండా స్వల్పకాలిక రుణాలందిస్తున్నారు. అమూల్ ప్రాజెక్టులో భాగంగా 9,899 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే రూ.680 కోట్లతో 3,156 గ్రామాల్లో ఏఎంసీయూ, బీఎంసీయూలు నిర్మిస్తున్నారు.

– సాక్షి, అమరావతి

గుంటనక్కలు వస్తున్నాయి.. తరిమికొట్టండి

- ప్రజలకు ప్రభుత్వ సలహాదారు సజ్జల పిలుపు
- చంద్రబాబువి పగటి వేషాలు
- జగన్ నాలుగేళ్ల పాలన ఒక చరిత్ర
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నాలుగేళ్ల పాలన వేడుకలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సజ్జల, మంత్రి మేరుగు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ గుంట నక్కలు నిద్రలేచి పగటి వేషాలు వేసుకొని వస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇవి ప్రజలను భ్రమల్లో పెట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఈ గుంటనక్కల గుంపును తరిమి తరిమి కొట్టాలి అని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టి 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మంత్రి మేరుగు నాగార్జున, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఎం.హనుమంతరావు, ఎమ్మెల్యే కిలారి రోశయ్యలతో కలిసి సజ్జల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి.. కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సజ్జల ఏమన్నారంటే.. 'సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలన సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఓ చరిత్ర. సంక్షేమం, సుస్థిర అభివృద్ధి నినాదంగా పాలన సాగింది. కోటి 60 లక్షల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంతగా ప్రాధాన్యత ఇచ్చారో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ప్రజల ఆశీస్సులు వైఎస్ జగన్‌కు మెండుగా ఉన్నాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు మరోసారి పగ్గాలు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారు.

నిలువుదోపిడీ చేసేందుకే బాబు నాటకం..

ఏడాదిలో ఎన్నికలు రాబోతున్నాయి. సిగ్గు, శరం లేకుండా చంద్రబాబు కొత్త హామీలతో మళ్లీ ముందుకు వచ్చారు. ప్రజలను భ్రమల్లో పెట్టి తనకు ఇంకో అవకాశం ఇవ్వాలని కొత్త డ్రామా మొదలుపెట్టారు. రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసేందుకు కపటనాటకమాడుతున్నారు. ఎన్నికలు రాగానే కళ్లార్పకుండా టకటక అబద్ధాలు చెప్పడమే బాబుకు తెలిసిన ఏకైక విద్య. 2014 –19 మధ్య ఏం చేశారో చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదు. ఏం చేశామో చెప్పుకోలేక అధికారంలోకి వస్తే అమ్మఒడి ఇస్తానంటున్నారు. చంద్రబాబు ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. తిరునాళ్లలో పగటి వేషగాళ్లు వేషాలు వేసినట్లు ఎన్నికల్లో ఏదో ఒక హామీ ఇవ్వడం, మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, పార్టీ నేతలు పుత్తా ప్రతాప్ రెడ్డి, అంకంరెడ్డి నారాయణమూర్తి, చల్లా మధు, నారమల్లి పద్మజ, కనకారావు, తాతినేని పద్మావతి, కాకుమాను రాజశేఖర్, కొండా రాజీవ్‌గాంధీ, పానుగంటి చైతన్య, మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

బడి గంట రోజే 'కానుక'

▶ మొదటి పేజీ తరువాయి

బృందాలను సిద్ధం చేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌తో పాటు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 26 జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించారు.

తయారీ దశలోనే తనిఖీలు

జగనన్న విద్యా కానుకలో ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఇప్పటికే స్కూళ్లకు తరలింపు పూర్తి కాగా మే 31 నాటికి పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్‌లు, బెల్టులు చేరుకోనున్నాయి. యూనిఫాం, నోట్ బుక్స్, బూట్లు, బ్యాగ్స్, యూనిఫామ్స్ తరలింపును జూన్ 7 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నిర్దేశించారు. తొలుత జిల్లా కేంద్రాలకు అక్కడ నుంచి 670 మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. అనంతరం అక్కడ నుంచి 45,534 స్కూళ్లకు తరలింపు ప్రక్రియ చేపట్టారు. మొత్తం 39,96,064 జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నారు. ప్రతి వస్తువు అత్యంత నాణ్యతతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంది. ఈసారి తయారీ దశలోనే అధికారులు నాణ్యత తనిఖీలను నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ పాలనపై టీడీపీ చార్జిషీట్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనపై టీడీపీ చార్జిషీట్ పేరుతో ఒక పుస్తకం విడుదల చేసింది. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు వర్ల రామయ్య, బొండా ఉమా, నక్కా ఆనంద్‌బాబు తదితరులు ఈ పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. నాలుగేళ్లలో జగన్ సాధించింది శూన్యమని విమర్శించారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదని, గతంలో వచ్చిన పరిశ్రమలు తరలిపోయాయని ఆరోపించారు.

ఉపాధ్యాయులతోనే సమున్నత సమాజం

- ప్రాథమిక దశలోనే పటిష్ట విద్యాబోధన అవసరం
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వానికి ఉపాధ్యాయుల కృషి కూడా తోడైతే భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దవచ్చని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రేడ్ 1, 2 స్థాయిలో అందించాల్సిన విద్యాబోధనపై ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు విజయవాడలో నిర్వహించిన శిక్షణ ముగింపు మంగళవారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు 3 నుంచి 8 ఏళ్ల వయసు వరకు సరైన విద్యాబోధన అందించినప్పుడే వారు ఉన్నత చదువుల్లో సమర్థంగా రాణించగలరన్నారు. విద్యారంగం పేరు చెబితే.. గతంలో కేరళ, ఢిల్లీ పేర్లు వినిపించేవని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, వస్తున్న ఫలితాలపైనే దేశమంతా చర్చించుకుంటోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఉండాలని కోరుకుంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనన్ని విద్యా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. నాడు–నేడు పథకంతో పాఠశాలలను సమున్నతంగా మారుస్తున్నారన్నారు.

8 ఏళ్ల వరకు సులభంగా నేర్చుకుంటారు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. పిల్లలకు 3 నుంచి 8 సంవత్సరాల వయసు వరకు ఏది చెప్పినా సులభంగా నేర్చుకునే స్థాయిలో ఉంటారన్నారు. ఈ దశలో వారికి ఇంగ్లిష్ అక్షరాలు రాయడం, పదాలు పలకడం, బేసిక్ లెక్కలు పూర్తిస్థాయిలో నేర్పించాలన్నారు. ఈ వయసు పిల్లలకు అంగన్‌వాడీ నుంచి పీపీ 1, పీపీ 2, గ్రేడ్ 1, 2 స్థాయిల్లో ఫౌండేషన్ కోర్సులపై పూర్తి తర్ఫీదు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ప్లే స్కూల్స్‌లో సాధారణంగా ఆటలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని.. వారు స్కూల్ స్థాయికి వచ్చేసరికి సరైన శిక్షణ లేక విద్యలో రాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. అందుకే అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలలను కలిపి ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తరగతిలో విద్యార్థి సామర్థ్యం ఎంతో ఉపాధ్యాయులకు తెలియాలని, వారు ఎందులో రాణించగలరో అప్పుడే అంచనా వేయవచ్చని అన్నారు. ప్రీ ప్రైమరీ నుంచి పిల్లలకు ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రిసోర్సు పర్సన్లు తయారు చేసిన విద్యా కౌశల పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, అభినందించారు. అనంతరం 'జ్ఞాన ప్రకాశ్' శిక్షణా కరదీపికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ పి.పార్వతి, జాయింట్ డైరెక్టర్ (టెట్) మేరి చంద్రిక, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బి.విజయ భాస్కర్, ప్రథమ్ సంస్థ ప్రతినిధి సునీత పాల్గొన్నారు.

20% గ్రామాల్లోనే స్థిరాస్తి విలువల సవరణ

▶ మొదటి పేజీ తరువాయి

ఆయా ప్రాంతాల్లో పెరిగిన మార్కెట్ విలువను అక్కడి రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలిసి రిజిస్ట్రేషన్ శాఖాధికారుల కమిటీలు నిర్ధారించాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, కొత్తగా ఏర్పడిన రహదారులు, విస్తరిస్తున్న అర్బన్ ఏరియాల్లో రిజిస్టర్ విలువలకు, మార్కెట్ విలువకు చాలా వ్యత్యాసాన్ని గుర్తించారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో భూముల విలువలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

ఈ జిల్లాల్లో భారీగా మార్కెట్ విలువ

పార్వతీపురం మన్యం, బాపట్ల, నంద్యాల, కర్నూలు, అనంతపురం, అంబేడ్కర్ కోనసీమ, నర్సరావుపేట వంటి ప్రాంతాల్లో ఈ పెరుగుదల ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లోని కొన్నిచోట్ల అయితే మార్కెట్ విలువల, రిజిస్టర్ విలువల మధ్య వ్యత్యాసం 75 శాతం కంటే ఎక్కువగా ఉందని గుర్తించారు. ఆ ప్రాంతాల్లో భూముల లావాదేవీలు పెరగడంతో రిజిస్ట్రేషన్లు కూడా గతం కంటే భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగిన గ్రామాలు, అర్బన్ ఏరియాల్లోనే మార్కెట్ విలువల్ని సవరించనున్నారు. ఈ ఏడాది సవరణలకు ప్రభుత్వ ఆమోదం లభిస్తే జూన్ 1వ తేదీ నుంచి మార్కెట్ విలువల సవరణ అమల్లోకి వచ్చే అవకాశం ఉందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ తెలిపారు.

కమిటీల ప్రతిపాదనలు ఇలా..

సాధారణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని గ్రామాలు లేదా పట్టణాల్లో వచ్చిన మార్పులను బట్టి అర్బన్ ఏరియాల్లో ఏడాదికి ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి మార్కెట్ విలువలను సవరిస్తుంది. మూడేళ్లుగా కరోనా ఇతర కారణాల వల్ల రాష్ట్రంలో పూర్తిస్థాయి సవరణ చేపట్టలేదు. కొత్త జిల్లాలు ఏర్పడటంతో గత సంవత్సరం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ప్రత్యేక సవరణ నిర్వహించింది. ఈ పరిస్థితుల కారణంగా రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ రివిజన్ చేపట్టింది. అర్బన్ ఏరియాల్లో జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా.. మునిసిపల్ కమిషనర్/వుడా/సీఆర్‌డీఏ అధికారులు, సంబంధిత ఎమ్మార్వోలు, సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉండే కమిటీలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని భూముల విలువలు ఏమేరకు పెరిగాయనే దానిపై పరిశీలన జరిపాయి. గ్రామాల్లో ఆర్డీవోలు కన్వీనర్లుగా.. జిల్లా పరిషత్ సీఈవో, సంబంధిత ఎంపీడీవో, ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్‌లతో ఏర్పడిన కమిటీలు ఆయా ప్రాంతాల్లోని భూముల విలువలు ఏమేరకు పెరిగాయనే విషయాన్ని పరిశీలించాయి. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గడచిన ఏడాది కాలంలో భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరిగిన పట్టణ ప్రాంతాలు, గ్రామాలను ఈ కమిటీలు గుర్తించాయి. ఎక్కడెక్కడ రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరిగాయి, అందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి (ఏదైనా పరిశ్రమ, సంస్థ రావడం, హైవేలు, ప్రధాన రహదారులు ఏర్పాటు కావడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం వంటి అనేక కారణాలు) అనే వివరాలను కమిటీలు సేకరించాయి. ఆయా కారణాలను విశ్లేషిస్తూ.. లావాదేవీలు ఎక్కువ జరుగుతున్న సర్వే నంబర్లను బట్టి మార్కెట్ విలువలను ప్రతిపాదించాయి. ఎక్కువగా లావాదేవీలు జరుగుతున్న 20 శాతం ప్రాంతాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాయి. జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు లేదా ఆర్డీవోల ఆధ్వర్యంలోని కమిటీలు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులకు సంబంధిత ప్రతిపాదనలు పంపించగా.. వాటిని ఉన్నతాధికారులు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించారు.

97% ఫిర్యాదులు సకాలంలో పరిష్కారం

- ఆరోగ్యశ్రీ, ఇతర సేవల్లో సమస్యలు తెలిపేందుకు 104 కాల్‌సెంటర్
- గత జూలై నుంచి ఇప్పటికి 9,851 ఫిర్యాదులు
- వైద్యసేవల సమాచారం కోసం ఫోన్‌చేసిన వారి సంఖ్య 51,986

సాక్షి, అమరావతి: వైద్యశాఖ ఏర్పాటు చేసిన 104 కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు సకాలంలో పరిష్కారమవుతున్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా వంటి సేవలపై సమాచారం తెలిపేందుకు, ఆ సేవల్లో ఎదురయ్యే సమస్యలు తెలుసుకునేందుకు గత ఏడాది ఈ కాల్‌సెంటర్‌ను ప్రారంభించారు. తొలుత ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ), 108 అంబులెన్స్, వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, మహాప్రస్థానం సేవలపై ఫిర్యాదుల స్వీకరణతో కాల్‌సెంటర్ సేవలు ప్రారంభం అయ్యాయి. అనంతరం ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌లకు కూడా సేవలు విస్తరించారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదుల తీవ్రతను బట్టి ఎంత సమయంలోగా పరిష్కరించాలి, పరిష్కరించడానికి బాధ్యులు ఎవరనే దానిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని ప్రారంభంలోనే రూపొందించారు. గత ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 9,851 ఫిర్యాదులు కాల్‌సెంటర్‌కు వచ్చాయి. వీటిలో 97 శాతం మేర అంటే 9,540 ఫిర్యాదుల్ని ఎస్‌వోపీలో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించారు. మిగిలిన ఫిర్యాదులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయి. మొత్తం ఫిర్యాదుల్లో 68 శాతం మేర ఆరోగ్య ఆసరాకు సంబంధించినవే ఉన్నాయి.

సమాచారం కోసం సంప్రదిస్తున్నవారే అధికం

ఈ కాల్‌సెంటర్‌ను సమాచారం కోసం సంప్రదిస్తున్నవారే అధికంగా ఉన్నారు. గత జూలై నుంచి ఇప్పటి వరకు కాల్‌సెంటర్‌కు ఫిర్యాదుల కోసం తొమ్మిది వేలమంది ఫోన్ చేస్తే.. సేవలపై సమాచారం కోసం ఏకంగా 51,986 మంది ఫోన్ చేశారు. గతనెలలో ఫిర్యాదులపై 161 కాల్స్ రాగా, సమాచారం తెలుసుకోవడానికి 13 వేల కాల్స్ వచ్చాయి. ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌లో 30 మంది సిబ్బంది 24/7 పనిచేస్తున్నారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు, పరిష్కారం వంటి కార్యకలాపాలను డ్యాష్‌బోర్డ్ ద్వారా ఉన్నతస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

ఇలా సంప్రదించాలి..

- ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్, 108, 104, మహాప్రస్థానం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వాటిలో ఏమైనా సమస్య ఉంటే 104కు కాల్ చేయాలి.
- కాల్ చేసిన వెంటనే వైద్యసేవలపై సమాచారం కోసం 1, ఫిర్యాదుల కోసం 2, ఈహెచ్ఎస్‌పై ఫిర్యాదుల కోసం 3 నొక్కాలని ఐవీఆర్ఎస్ సూచిస్తుంది.
- కాల్ చేసినవారు తమ అవసరానికి అనుగుణంగా ఆప్షన్ ఎంచుకోవాలి. అనంతరం కాల్‌సెంటర్‌లోని ఎగ్జిక్యూటివ్ లైన్‌లోకి వచ్చి సమాచారం చెబుతారు లేదా ఫిర్యాదు తీసుకుంటారు.

ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా..

ఆరోగ్యశ్రీ, అనుబంధ సేవలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య ఎదురైతే తక్షణమే ఫిర్యాదు చేసేలా వ్యవస్థను నెలకొల్పాం. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో, 104, 108 వాహనాలపైనా ఫిర్యాదుల కోసం 104ను సంప్రదించాలని సూచిస్తున్నాం.

– హరేంధిరప్రసాద్, సీఈవో, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

ఒకప్పుడు నడిరోడ్డు మీద ఏదైనా అన్యాయం జరుగుతుంటే
చోద్యం చూస్తున్నట్టుగా ఉండటం అనాగరికం. అమానవీయం.
నేడు చోద్యం చూడటం సర్వసాధారణం.
మొన్న ఢిల్లీలో ఒకమ్మాయిని ఒకబ్బాయి
కత్తితో పొడుస్తుంటే అందరూ చోద్యం చూస్తూ నిలబడ్డారు.
అదే కాదు, నేడు చాలా సందర్భాల్లో నేరం ఆపగలిగే
శక్తి ఉన్నా ఆపడం లేదు.
దీనిని సైకాలజిస్ట్‌లు 'బైస్టాండర్ ఎఫెక్ట్' అంటున్నారు.
మనం చోద్య శిఖామణులుగా ఉండల్సిందేనా?



బైస్టాండర్ ఎఫెక్ట్

మీరు చోద్యం చూస్తుంటారా?

మొన్నటి ఆదివారం. సాయంత్రం. 20 ఏళ్ల సాహిల్ 16 ఏళ్ల అమ్మాయితో వాదనకు దిగాడు. చాలామంది ఆ దారిన పోతున్నారు. పట్టించుకోలేదు. సాహిల్ కత్తి తీశాడు. దారిన పోతున్న వారు చూశారు. పట్టించుకోలేదు. సాహిల్ ఆ అమ్మాయిని అనేకసార్లు పొడిచాడు. చచ్చిపోయింది. ఎవరూ అడ్డం రాలేదు. సాహిల్ ఆ తర్వాత ఒక బండ రాయి తెచ్చి ఆమె మీద పదే పదే విసిరాడు. దారిన పోతున్నవాళ్లు చూస్తున్నారు. పోతున్నారు. పట్టించుకోలేదు.

వీరు మనుషులా అనే సందేహం రావచ్చు. మనుషులే. ఆ ఘటనను న్యూస్‌లో చూసి ఆ సమయంలో పట్టించుకోకుండా ఆ దారిన పోతున్నవారిని 'మనుషులా?' అని మనం అనుకోవచ్చు. కాని 'మనం' అక్కడ గనక ఉండుంటే మనం 'కూడా' అలానే బిహేవ్ చేస్తాం. అప్పుడు మనల్ని ఇంకెవరో 'వీళ్ల మనుషులా' అని అనుకుంటూ ఉంటారు. అయితే ఇలాంటి తీవ్రమైన ఘటనలో కూడా మనుషులు ఎందుకు అలా ఉన్నారు అనంటే దానిని మానసిక శాస్త్రంలో 'బైస్టాండర్ ఎఫెక్ట్' అంటారు. సింపుల్‌గా చెప్పాలంటే 'దారిన పోయే దానయ్య స్వభావం' అనొచ్చు.

బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే?

'నేను కాకుండా ఇంకెవరో సాయం చేస్తారులే' అనుకోవడమే బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే. దీనినే 'డిఫ్యూజన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీ థియరీ' అని కూడా అంటారు. ఎక్కువమంది ఉన్న చోట ఈ 'నాకెందుకులే... ఇంకెవరైనా చేస్తారులే' అనే స్వభావం ఎక్కువ అవుతుందని మానసిక శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. 'ఒక అర్ధరాత్రి ఒక అమ్మాయిని ఒకతను ఇబ్బంది పెడుతుంటే, ఆ దారిన కేవలం ఇద్దరు వ్యక్తులు వస్తుంటే, వారిని చూసి సాయం కోసం కేకలు వేస్తే, ఆ ఇద్దరూ లేదా వారిలో ఒకరు స్పందించే అవకాశం ఎక్కువ. అదే వంద మంది మధ్యలో సాయం కోసం అరిస్తే ఎవరూ సాయానికి రాకపోయే అవకాశం ఎక్కువ. ఇదే బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే' అని మానసిక శాస్త్రజ్ఞులు తెలియచేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరి మీదైనా ట్రోల్ జరుగుతుంటే చోద్యం చూడటం, పక్కింట్లో భార్యను భర్త చితకబాదుతుంటే చోద్యం చూడటం కూడా 'బైస్టాండర్ ఎఫెక్ట్' కిందకే వస్తుంది.

ఎందుకు సాయానికి రారు?

ఒకటి... అందులో రిస్క్ ఉంటుంది... రెండు టైమ్ వేస్ట్.. మూడు ప్రాణాలకు ముప్పు రావచ్చు... నాలుగు ఆ తర్వాత ఏదైనా లంపటం చుట్టుకోవచ్చు... అన్నింటి కంటే ముఖ్యం ఇంతమంది ఉన్నారు నేనే దొరికానా అనుకోవడం. ఇదే సమయంలో సామాజిక శాస్త్రవేత్తలు ఏమంటారంటే 'ఆ ఎదురుగా దాడికో హత్యకో గురవుతున్నది మీ రక్తసంబంధీకులు అయితే ఇలాగే వ్యవహరిస్తారా?' అని. ఎదుట ఉన్నది రక్తసంబంధీకులు అయినప్పుడు ప్రాణాలకు తెగిస్తాం. కాని సంబంధం లేనివారైతే దూరం జరుగుతాం. బాధితుడు ఎవరైనా బాధితుడే కదా అని సామాజిక శాస్త్రవేత్తలు ప్రశ్నిస్తారు.

ప్రతి ఒక్కరూ ఎంతో కొంత చేయొచ్చు

'సరే... సాయానికి వెళితే లేనిపోని ముప్పు రావచ్చు అనుకున్నా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సాయం చేసే వీలు ఉంటుంది.. అదన్నా చేయాలి' అంటారు మానసికవేత్తలు. కనీసం పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్ చేయడం, దాడి చేస్తున్నవాడిని అదిలించడం, ధ్యాస మరల్చడం, రాళ్లు విసిరి గోల చేయడం... ఇలా ఏవైనా చేయొచ్చు. వీటిని చేయడం వల్ల ప్రాణం పోదు. ఏదో ఒక స్పందన చూపాం అనే సంతృప్తి దొరుకుతుంది. 'భయాన్ని దాటితే మనిషిగా పాటించాల్సిన విలువలను గుర్తు చేసుకుంటే సాయానికి దిగాలన్న తక్షణ స్పందన కలుగుతుంది' అని సామాజిక శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 'ఏం చేసినా జనం పట్టించుకోరు' నుంచి 'జనం పట్టించుకుంటారు' అనిపించే సామాజిక మార్పుకు జనమే ఉదాహరణగా నిలిస్తే ఈ స్థితి మారుతుంది.

స్త్రీలు, యువతులు, బాలికలు నిత్యం బయటకు తిరగాల్సిన ఈ రోజుల్లో సమాజం వీలైనంత తొందరగా ఈ చోద్యం చూసే స్వభావాన్ని వదులుకుంటే సమాజానికి రక్షణ దొరుకుతుంది.

ఒకరినే ఎంచుకోవాలి

'మీ మీద దాడి జరుగుతోంది. చుట్టూ చాలామంది చోద్యం చూస్తున్నారు. మీరు సాయం కోసం అడుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. అప్పుడు గుంపులో ఎవరో ఒకరిని ఎంచుకోవాలి. వారి కళ్లల్లో కళ్లు కలిపి సాయం అడగాలి. మీరు పర్టిక్యులర్‌గా ఒక వ్యక్తిని సాయం అడిగినప్పుడు ఆ వ్యక్తికి తాను స్పందించక తప్పని బాధ్యత వస్తుంది. స్పందిస్తాడు' అని తెలియచేస్తున్నారు మానసిక శాస్త్రవేత్తలు. అంటే గుంపు నుంచి విడగొట్టి అతణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయాలన్న మాట.





ఫీడింగ్ రూముల కోసం...

ఓ తల్లి పోరాటం

టాయ్‌లెట్‌లో కూర్చొని మనం తినగలమా? మరి అలాంటప్పుడు తల్లులు తమ పిల్లలకు బహిరంగ ప్రదేశాల్లో పాలివ్వడానికి పబ్లిక్ టాయిలెట్లకు ఎందుకు వెళ్లాలి? సిగరెట్ తాగడం కోసం స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తారు. కానీ, ఆకలితో ఉన్న పిల్లలకు పాలివ్వడానికి ప్రతిచోటా బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఎందుకు లేవు? అందరి ముందు తమ బిడ్డకు పాలిచ్చే తల్లులు ప్రజల చెడు దృష్టిని ఎందుకు ఎదుర్కోవాలి?

ఢిల్లీవాసి, న్యాయవాది నేహా రస్తోగి ఈ సమస్యల నుండి తల్లులను రక్షించడానికి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా పింక్ టాయిలెట్లు, పిల్లలకు తల్లిపాలు ఇచ్చే గదులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఆమె ఈ దిశగా తన ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. ప్రజల్లో అవగాహన కలిగిస్తూనే ఉంది. ఇంతకీ నేహా రస్తోగి తల్లిపాల ఆలయాలు ఎందుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దీని ద్వారా ఆమె ఏం సాధిస్తోంది. లాయర్‌గా ఆమె పోరాటం దేనికి?

ముందుగా తను ఎదుర్కొన్న సమస్యను వివరిస్తూ.. ''నేను 2017, అక్టోబరులో మొదటిసారి తల్లిని అయ్యాను. నా బాబుకి మూడు నెలల వయసున్నప్పుడు బెంగళూరు వెళ్లాల్సి వచ్చింది. ఢిల్లీ నుంచి బయల్దేరాలి. గంటల గంటల ట్రాఫిక్ తాకిడిని తప్పించుకుంటూ విమానాశ్రయానికి చేరుకునేసరికి బాబు ఆకలితో ఏడుపు మొదలెట్టాడు. అక్కడ వాడికి పాలు ఎక్కడ ఇవ్వాలో తెలియలేదు.

వాష్‌రూమ్‌లో తల్లి పాలు

తల్లిపాలు పట్టేందుకు విమానాశ్రయంలోని వాష్‌రూమ్‌కి వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్లైట్‌లో వాడికి మరోసారి ఆకలి వేసింది. పక్కన కూర్చున్న వ్యక్తిని 'బిడ్డకు పాలు పట్టాలి, కొద్దిగా స్థలం ఇవ్వమని అడిగాను. కానీ, అతను కాదన్నాడు. ఎయిర్‌హోస్టెస్‌ను అడిగితే 'టాయ్‌లెట్‌కి వెళ్లు' అని చెప్పింది. చాలాసేపు ప్రాధేయపడ్డాక ఎయిర్ హోస్టెస్ కూర్చున్న చోట కూర్చుని, పిల్లవాడికి పాలు పట్టాను. బెంగళూరు విమానాశ్రయంలోనూ బిడ్డకు తల్లి పాలు పట్టేందుకు చోటు లేదు. అలా బిడ్డతో నా మొదటి ప్రయాణం వ్యవస్థ నిర్లక్ష్యం కారణంగా చాలా బాధకారంగా అనిపించింది. గంటల తరబడి నా కొడుకు ఆకలితో ఏడుస్తూ ఉంటే, నేను నిస్సహాయంగా ఉండిపోయాను.



నేహా రస్తోగీ

విషయ సేకరణ

ఈ సంఘటన తర్వాత నేను దేశవ్యాప్త సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డాను. దేశంలో ఎక్కడా చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టే గదులు లేవని తెలిసింది. ఈ విషయంపై చాలా మంది మహిళలతో మాట్లాడి, వారి బాధాకరమైన అనుభవాలను విన్నాను. నాలాంటి తల్లులకు బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే హక్కును కల్పించాలని, అందుకు ఎంత కాలం యుద్ధం చేసినా పర్వాలేదని నిర్ణయించుకున్నా. అదే సమయంలో ఓ ఎంపీ కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తు తానని హామీ ఇచ్చారు. అప్పుడే ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ ఈ కేసు విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో లక్షలాదిమంది చంటిబిడ్డలకు తల్లిపాలు ఇచ్చే ఏర్పాటు లేదని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. రైల్వేస్టేషన్, బస్టాప్, ఎయిర్‌పోర్ట్, మాల్స్‌తో సహా ప్రతి బహిరంగ ప్రదేశాల్లో తల్లిపాల బూత్‌లు ఏర్పాటు చేయాలని కోర్టును కోరాను. తల్లులు పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కూడా ఈ సదుపాయాన్ని కల్పించాలన్నాను.

లైంగిక వేధింపులు

బిడ్డలకు చనుబాలివ్వడానికి గదులు అందుబాటులో లేకపోవడంతో తల్లులు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే తమ పిల్లలకు పాలివ్వాల్సి వస్తోంది. ఈ సమయంలో వారు లైంగిక వేధింపులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. తల్లి గౌరవాన్ని దెబ్బతీసే వారు ఆమెను గౌరవంగా చూడరు. కంప్లైంట్ చేస్తే టాయ్‌లెట్‌లో కూర్చొని పాలు ఇవ్వమని సలహా ఇచ్చేవారున్నారు. కానీ, అటువంటి మురికి, దుర్వాసన ఉన్న ప్రదేశంలో కూర్చొని పాలు ఇవ్వడం తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికీ ప్రమాదకరం.

ఈ సమస్యకు సంబంధించి అన్ని శాఖలు, ఏజెన్సీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2019లో నిర్ణయం తీసుకుని, ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సదుపాయాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు పంపారు. హైకోర్టు తీర్పు తర్వాత చైనా, అమెరికా, లండన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మీడియా దానిని కవర్ చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంలో కనీస సౌకర్యాలు కూడా లేవని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. హైకోర్టు నిర్ణయం తర్వాత పింక్ టాయిలెట్, బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్ ప్రారంభమైంది. ఇందులో తల్లులకు ప్రత్యేక భోజన గదులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ తల్లి హాయిగా కూర్చొని బిడ్డకు పాలు పట్టచ్చు. స్నానం చేసి, బట్టలు కూడా మార్చుకోవచ్చు. ఢిల్లీలో కన్నాట్ ప్లేస్‌లోని పార్లమెంట్ స్ట్రీట్‌లో మొదటి ఫీడింగ్ రూమ్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆ తర్వాత ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో 700కు పైగా పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

ఆలయాల నుంచీ..

షిర్డీలో సాయిబాబా ఆలయం నుండి తాజ్ మహల్ వరకు తల్లిపాలు ఇచ్చే గదులు నిర్మించారు. బస్టాప్‌లు, రైల్వే స్టేషన్‌లలో తల్లి పాల క్యాబిన్లు ప్రారంభించారు. ఇప్పుడు రైల్వేస్టేషన్‌లలోనే కాదు రైళ్లలో కూడా ప్రత్యేక ఫీడింగ్ క్యాబిన్లను తయారుచేస్తున్నారు. ఈ విజయం ప్రభావం దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కనిపించింది.

తల్లి పాల బ్యాంక్

దేశంలో ఏ ఒక్క తల్లీ బిడ్డ కూడా బహిరంగ ప్రదేశాల్లో ఫీడింగ్ సమస్యను ఎదుర్కోకూడదు. ఈ ఆలోచనతో 'మాతృ స్పర్శ్ ఇనిషియేటివ్ బై అవ్యన్ ఫౌండేషన్' పేరుతో ఒక ఎన్జీవోని ప్రారంభించాను. దీని ద్వారా ఫీడింగ్ రూమ్, తల్లి పాల బ్యాంకు సౌకర్యాన్ని కల్పించే ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాను. ఇప్పుడు చాలా మంది తల్లి పాలు కావాలనే వాళ్లు కూడా సంప్రదిస్తున్నారు. దీంతో తల్లిపాలను దానం చేయాలనుకుంటున్న తల్లుల నుంచి పాలుతీసుకొని, అవసరమైన పిల్లలకు ఇస్తుంటాం. ఈ పనిలో ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే, ప్రతి బిడ్డ తల్లి పాలు సులభంగా పొందుతుంది. ఆ దిశగానే ఇప్పుడు నేను ప్రయత్నిస్తున్నాను.

లండన్ యూనివర్సిటీలో జరుగుతున్న పరిశోధనలో నేను వాదించిన తల్లిపాల కేసు చేర్చారు. కేవలం తొమ్మిది నెలల వయసులో పిల్ దాఖలు చేసినందుకు నా కొడుకు అవ్యన్ పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. రొమ్ము లైంగిక అవయవం కాదు. ఇది తల్లి–బిడ్డల మధ్య పవిత్ర సంబంధాన్ని కలిగిస్తుంది. ఈ పోరాటం అంత సులువు కాలేదు. మాది చిన్న కుటుంబం. నా కొడుకు సిజేరియన్ ద్వారా పుట్టాడు. ఈ పోరాటంలో నేను ఆపరేషన్ నుండి చాలా రోజుల వరకు కోలుకోలేకపోయాను. ఇంటి నుండి కోర్టు పనులు పూర్తయ్యేవరకు పిల్లాడిని పట్టుకొనేదాన్ని. సమాజంలో పాతకాలపు ఆలోచనలను మార్చడం పెద్ద సవాల్. ఎంతో మంది మహిళలు కూడా ఎన్ని ఇబ్బందులు పడినా మాట్లాడలేకపోతున్నారు'' అంటూ ఈ సమస్య గురించి సుదీర్ఘంగా తన గళం వినిపిస్తారు ఈ లాయర్.

కళాకారులు తమ కళలో ఆసాంతం మమేకం అయ్యాక వారిలోని నైపుణ్యం ప్రతిరోజూ కొత్త ఊపిరి పోసుకుంటుంది. దీనికి నిలువెత్తు నిదర్శనం అంజనీ ఖన్నా. కుండల కొద్దీ కళారూపాలను మన ముంగిళ్లలో నిలపడానికి కృషి చేస్తున్న అంజనీ ఖన్నా దేశంలోనే కాదు విదేశాల్లోనూ పాటరీ ఆర్టిస్ట్‌గా పేరు ప్రఖ్యాతులు పొందారు.

మట్టి కళ



అంజనీ ఖన్నా



ముంబైలోని అలీబాగ్‌లో ఉన్న సిరామిక్ స్టూడియోలో అంజనీ ఖన్నా రకరకాల కళాకృతుల తయారీలో బిజీగా కనిపిస్తారు. ఆమె కళ మన దేశంలోనే కాదు విదేశాలలోనూ ప్రదర్శితమవుతోంది. ఇటీవలే ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ సిరామిక్స్ సభ్యురాలిగా ఎన్నికయిన అంజనీ ఖన్నా మట్టిపై తనకున్న మమకారాన్ని ఇలా పంచుకున్నారు.

''ఐదారేళ్ల వయసులోనే మట్టిపై మనసు పారేసుకున్నాను. పాతికేళ్లుగా నా స్టూడియోలో సిరామిక్ కళాకృతులను తయారుచేస్తున్నాను. సిరామిక్సే నా ప్రపంచం. కలల ప్రపంచం.. కళా ప్రపంచం.

వేసవి శిబిరం పెంచిన ఆసక్తి

ముంబైలో పుట్టి పెరిగాను. మా అమ్మ నన్ను పెంచడంలో చాలా జాగ్రత్తలు తీసుకునేది. కానీ, చివరకు నీకు ఏది ఇష్టమో అందులోనే ముందుకెళ్లు అని చెప్పింది. ఆమె నన్ను వివిధ సృజనాత్మక కార్యకలాపాలకు పంపుతుండేది. నాకు ఆరేడేళ్ల వయసున్నప్పుడు మా అమ్మ నన్ను సమ్మర్ క్యాంప్‌కి తీసుకెళ్లేది. అక్కడ మట్టి కుండల తయారీ నేర్చుకున్నాను. ఆ తర్వాత పాలిటెక్నిక్ చదివేటప్పుడు సిరామిక్ కుండలు, బొమ్మల తయారీ నేర్చుకున్నాను. చక్రం మీద చేతివేళ్లతో మట్టిని సున్నితంగా కుండ రూపం తీర్చిదిద్దడం చూసి మొదట్లో భయం వేసింది. మట్టి నుండి అంతటి అద్భుతమైన సృష్టి ఎలా జరుగుతుంది అని ఆశ్చర్యపోయేదాన్ని. స్వయంగా కుండ తయారుచేయడం మొదలుపెట్టాక అందులో ప్రయోగాల మీద విపరీతమైన ఆసక్తి పెరిగింది. పుదుచ్చేరి గోల్డెన్ బ్రిడ్జ్ కుండల తయారీని 1971లో డెబ్రా స్మిత్, రే మీకర్ ప్రారంభించారు. కొన్నేళ్లలోనే అది ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. అక్కడి ఆ పాటరీ ఆర్ట్ నాకు ఒక ప్రేరణగా మారింది. ఆ ఆర్ట్ నేర్చుకోవాలనే ఆసక్తితో పుదుచ్చేరి వెళ్లాను. ఆ పాటరీ కంపెనీలో జాయిన్ అయ్యాను. ఆ కళ నేర్చుకోవడానికి ఏడాదిన్నర కాలం పట్టింది.







చదువుకు కేంబ్రిడ్జ్

పాటరీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలనుకున్నప్పుడు అప్పటికే అప్లయ్ చేసుకున్న కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ నుంచి అడ్మిషన్ లెటర్ వచ్చింది. వెళ్లాలా, వదిలేయాలా అనే సందిగ్ధంలో కొన్ని రోజులు గడిపాను. కానీ, ముందు చదువు పూర్తిచేద్దామన్న లక్ష్యంతో ఆ యూనివర్శిటీకి వెళ్లిపోయాను. అక్కడ రెండేళ్లు నేచురల్ సైన్స్ చదివాను. ఆ తర్వాత ముంబై నుంచి ఢిల్లీకి మారాను. అప్పుడే సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ 'డౌన్ టు ఎర్త్' పత్రికలో సైన్స్ ఎడిటర్‌గా పనిచేయడం ప్రారంభించాను. ఐదేళ్లు పనిచేసి, తిరిగి ముంబైకి వచ్చాను. ఈ పదేళ్లలో నా జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

అమ్మ ఇచ్చిన ప్రేరణ


మా అమ్మ మంచి కథకురాలు. దేవుడు, దేశస్వాతంత్ర్యం, పోరాట కథలు చాలా చెప్పేది. దేవతా విగ్రహాల ముందు ప్రార్థన చేసుకుంటూ ఉండేది. చిన్ని కృష్ణుని రూపాన్ని అందమైన బట్టలు, పువ్వులు, నగలతో ప్రతి రోజూ అలంకరించేది. నేనూ కూడా ఆ తర్వాత పౌరాణిక మూర్తులను అలాగే అలంకరించడం ప్రారంభించాను. ఆ తర్వాత పర్యావరణ జర్నలిస్టుగా గ్రామ గ్రామాన తిరుగుతూ దేశ చిత్రాన్ని నా మనసులో ముద్రించుకున్నాను. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి కళలు ఉన్నాయి, వాటిని కుండల తయారీలో ఎలా చూపించవచ్చో తెలుసుకున్నాను. అయితే, ఈ కుండల ప్రపంచంలో స్థిరపడటం మా నాన్నకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. కుండలు చేయడం అమ్మాయిల పని కాదు అనేవారు. అయినా, నా సొంత ప్రపంచాన్ని నేను సృష్టించుకున్నాను. స్టూడియో ఏర్పాటు చేసి, దాని ద్వారా సిరామిక్ కళాకారులకు ఓ వేదికను అందించడమే నా ఉద్దేశం. ప్రజల్లోకి ఈ కళాకృతులను ఎలా తీసుకువెళ్లాలా అని ఆలోచించాను. ముంబైలో జరుగుతున్న కాలా ఘోడా ఆర్ట్ ఫెస్టివల్‌లో కాకుండా పార్కింగ్ ప్లేస్‌ల్లో పింగాణీ కళాకృతుల ప్రదర్శనను ఏర్పాటు చేశాను. మంచి స్పందన వచ్చింది. కళాకృతులు బాగా అమ్ముడుపోయాయి. దీంతో సిరామిక్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. ఎక్కువ మంది ప్రజలు మా స్టూడియోకు వచ్చి కళాకృతులను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు.

కొనుగోళ్లూ ఎక్కువే

సిరామిక్ పాటరీ తయారీ చాలా కష్టమైన పని. గతంలో మెటీరియల్ ఖర్చు ఎక్కువ ఉండేది. కానీ, ఇప్పుడు ఇందులో మంచి ఆదాయం వస్తోంది. సిరామిక్ కళారూపాల విక్రయాలు పెరుగుతున్నాయి. ఇంటీరియర్ డిజైనింగ్ కోసం ప్రజలు బాగా ఖర్చు పెడుతున్నారు. ఆన్‌లైన్ విక్రయాలు సిరామిక్ మార్కెట్‌ను పూర్తిగా మార్చేశాయి. కుండల ప్యాకేజింగ్ నుండి విదేశాలకు కొరియర్ షిప్పింగ్ వరకు ప్రతీది సులభంగా మారింది' అంటూ తన సిరామిక్ ప్రపంచాన్ని మన కళ్లకు కడతారు అంజనీ ఖన్నా.

యూత్ పల్స్

ఫొటో ఎడిటింగ్‌లో మ్యాజిక్ సృష్టించనున్న గూగుల్ వారి 'మ్యాజిక్ ఎడిటర్'పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ ఉండగానే... యూత్‌కు హాయ్ చెప్పింది డ్రాగన్. ఇమేజ్‌లను ఎడిట్ చేసే పద్ధతిలో ఏఐ ఆధారిత ఎడిటింగ్ టూల్ 'డ్రాగన్' భారీ మార్పు తీసుకురానుందని నిపుణులు చెబుతున్నారు. 'ఫ్యూచర్ ఆఫ్ ఎడిటింగ్'గా పిలుస్తున్న 'డ్రాగన్'పై యూత్ అధిక ఆసక్తి ప్రదర్శిస్తోంది....



యూత్ అండ్ డ్రాగన్

ఈ సెల్ఫీల కాలంలో ఫిల్టర్స్, రింగ్‌లైట్స్‌లాంటివి ఉన్నప్పటికీ ప్రతి ఫొటో 'పర్‌ఫెక్ట్' అనిపించడం లేదు. ఇలాంటి సమయంలోనే ఎక్స్‌పెరిమెంటల్ టూల్స్ అవసరం ఏర్పడుతుంది.

ఇటీవల జరిగిన గూగుల్ డెవలపర్ కాన్ఫరెన్స్‌లో 'మ్యాజిక్ ఎడిటర్' గురించి డెమో జరిగింది. ఈ ఏఐ ఆధారిత సాధనంతో ప్రొఫెషనల్ టూల్స్ అవసరం లేకుండానే మేజర్ ఎడిట్స్ చేసుకోవచ్చు. ఫొటోలో బ్యాక్‌గ్రౌండ్‌లో వద్దనుకున్న వ్యక్తులను లేకుండా చేయడం నుంచి పొజిషన్ మార్చడం వరకు ఎన్నో చేయవచ్చు.

'గూగుల్ ఫొటోస్ లాంచ్ అయినప్పటి నుంచి ఏఐ ఆధారిత మార్పులు కొత్తేమీ కాదు. గూగుల్ ఫొటోస్‌లోని బేసిక్ ఎడిటింగ్ టూల్స్ (బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్, హెచ్‌డీఆర్(హై డైనమిక్ రేంజ్) మొదలైనవి సుపరిచితం అయినప్పటికీ మ్యాజిక్ ఎడిటర్ ద్వారా డిటెయిల్డ్ ఛేంజెస్‌కు అవకాశం ఉంటుంది' అంటుంది ముంబైకి చెందిన ఎంసీఏ స్టూడెంట్ అన్వీ.

కొత్త కొత్త ఫొటో ఎడిటింగ్ టూల్స్ గురించి తెలుసుకోవడం అన్వీకి ఇష్టం.

ప్రయోగ దశలో ఉన్న 'మ్యాజిక్ ఎడిటర్' పూర్తి స్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియనప్పటికీ దీని గురించి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'మ్యాజిక్ ఎడిటర్' గురించి మాటా ముచ్చట పూర్తికాకుండానే మెరుపులా రంగం మీదికి వచ్చింది....సరికొత్త ఏఐ ఎడిటింగ్ టూల్ డ్రాగన్. యూత్ ఫ్రెండ్లీ టూల్‌గా పేరు తెచ్చుకోనుందని చెబుతున్న 'డ్రాగన్'పై భారీ అంచనాలు ఉన్నాయి.

'రిప్ ఫొటోషాప్' అంటూ లోరెన్‌జో గ్రీన్ ఒక వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

ఆ వీడియోలో కనిపించే దృశ్యం: 'డ్రాగన్' సాంకేతికతతో నోరు మూసుకున్న సింహం నోరు తెరుస్తుంది. కాస్త గంభీరంగా కనిపించిన అమ్మాయి నవ్వుతుంది. ఒక పర్వతం తన ఎత్తుకు మించిన ఎత్తు పెరుగుతుంది...ఇలాంటి వింతలెన్నో!



అందుకే లోరెన్‌జో ఇలా రాశాడు: 'ఏ ఇమేజ్ అయినాసరే, అచ్చం కోరుకున్నట్లే!'

'చాట్‌జీపీటీ' ప్రాచుర్యం పొందిన తరువాత ఏఐ ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ అండ్ జెనరేటింగ్ టూల్స్ ఎన్నో వచ్చాయి. అయితే వాటికి భిన్నంగా ఇమేజ్‌లను ఎడిట్ చేసే పద్ధతిలో 'డ్రాగన్' మార్పు తీసుకురానుంది.

'డ్రాగన్' సాంకేతికతతో డ్రాపింగ్ పాయింట్స్ ద్వారా ఇమేజ్ స్ట్రక్చర్, పోజ్, ఎక్స్‌ప్రెషన్స్, లేఔట్...మొదలైన వాటిలో మార్పు తీసుకురావచ్చు. ఉదాహరణకు: నవ్వని అమ్మాయిని నవ్వేలా చేయడానికి....ఎడమవైపు పెదవి చివర ఒక రెడ్ డాట్ పెడతారు. ఆ తరువాత బ్లూ కలర్ డాట్ పెడతారు. ఈ రెండు డాట్స్‌ను కలిపితే చాలు ఆ అమ్మాయి నవ్వుతుంది!

'ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న పద్ధతుల్లో సౌలభ్యం, కచ్చితత్వం లోపించడం వల్లే డ్రాగన్‌పై ఆసక్తి మొదలైంది. రాబోయే కాలంలో ఫొటో ఎడిటింగ్ అనేది మౌస్‌తో ముడిపడి ఉన్న పని కాదు. టెక్స్ట్ ప్రాంప్ట్ సరిపోతుంది' అంటుంది ఢిల్లీకి చెందిన 22 సంవత్సరాల చైత్ర. రాజదర్శిని, తనీమా మెహ్రోత్ర, నవేలీ చోయల్‌లాంటి ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్‌లు అంటే ఆమెకు ఇష్టం. ఫొటోగ్రాఫర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలనేది చైత్ర కల.

ఛాయాచిత్ర ప్రయాణం

టీనేజ్‌లో ఫొటోగ్రఫీపై ఆసక్తి మొదలైంది. ఇంట్లో జరిగే 'కెరీర్ డిస్కషన్'లో ఫొటోగ్రఫీ ప్రస్తావన వచ్చేది కాదు. ఎందుకంటే 'ఫొటోగ్రాఫర్ కావాలనుకుంటున్నాను' అని చెబితే వింతగా చూసే పరిస్థితి. ఫ్యాషన్ డిజైన్ చదివినప్పటికీ ఫొటోగ్రఫీనే కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే కోరిక బలపడింది. కొంత కాలం ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేసిన తరువాత ఫొటోగ్రఫీనే కెరీర్‌గా ఎంచుకున్నాను. ఈ ప్రయాణం నాకు సంతృప్తిని ఇచ్చింది. ఫొటోగ్రాఫర్‌కు సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ఎంత ముఖ్యమో ఒక సందర్భం. సన్నివేశానికి సంబంధించి కలర్స్, లైట్, మూడ్‌పై అవగాహ ఉండడం అంతే ముఖ్యం.

\- నవేలీ చోయల్, ఫొటోగ్రాఫర్, ఆర్ట్ డైరెక్టర్, ఢిల్లీ





నాలుగో ర్యాంక్‌కు సాత్విక్-చిరాగ్

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మరో మెట్టు ఎక్కింది. మంగళవారం ప్రకటించిన ఈ జాబితాలో వీరిద్దరు నాలుగో స్థానానికి చేరుకున్నారు. భారత జోడి కెరీర్‌లో ఇది అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. వీరిద్దరు ఇటీవలే స్విస్ ఓపెన్ సూపర్ 300 టైటిల్‌ను గెలుచుకున్నారు. హెచ్ఎస్ ప్రణయ్ మరో ర్యాంక్ మెరుగుపర్చుకొని ఎనిమిదో స్థానానికి చేరుకోగా...మూడు స్థానాలు మెరుగైన కిడాంబి శ్రీకాంత్ 20వ ర్యాంక్‌లో నిలిచాడు.

పతకాలు 'గంగ'పాలు కాలేదు!

- మనసు మార్చుకున్న రెజ్లర్లు
- హైడ్రామా నడుమ వెనుదిరిగిన వైనం



హరిద్వార్: న్యాయం కోసం పోరాడుతూ వారంతా నెల రోజులకు పైగా నిరసన ప్రదర్శించారు...కానీ ఫలితం దక్కలేదు. పైగా పోలీసులు నిర్దయగా, అగౌరవంగా వారిని లాక్కెళ్లారు...ఆపై ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా కనిపించలేదు. దాంతో భారత ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఆ అగ్రశ్రేణి రెజ్లర్లు తమ కష్టానికి ప్రతిఫలమైన పతకాలను కూడా వద్దనుకున్నారు. వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని భావించి గంగా నదిలో పడేయాలని తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. అయితే అదృష్టవశాత్తూ చివరకు అది జరగలేదు. సన్నిహితుల సముదాయింపుతో చివరు ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. హరిద్వార్‌లో సుదీర్ఘ సమయం పాటు ఈ హైడ్రామా చోటు చేసుకుంది. మంగళవారం వందల సంఖ్యలో వచ్చిన మద్దతుదారులతో కలిసి చేతిలో పతకాలతో వీరంతా హరిద్వార్ చేరుకున్నారు. ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మలిక్, బజరంగ్ పూనియా... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన వినేశ్ ఫొగాట్, సంగీత, వీరి బంధుమిత్రులు, అభిమానులు హర్ కి పౌరి వద్దకు చేరుకున్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందేనని నిరసన చేపట్టారు. రెజ్లర్లు పతకాలను చేత పట్టుకొని గంగపాలు చేయాలనుకున్నారు. పలువురు బీజేపీ శ్రేణులు అక్కడకు చేరుకొని పవిత్రమైన గంగానదిలో ఇలాంటి చర్యలను అనుమతించమని వాదించారు. గంటా 45 నిమిషాల పాటు ఈ హైడ్రామా నడిచింది. రెజ్లర్ల సన్నిహితులు తీవ్రమైన నిర్ణయం వద్దని వారించడంతో చివరకు వారంతా అక్కడి నుంచి వెనుదిరిగారు. తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ఐదు రోజుల్లోగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

యూడబ్ల్యూడబ్ల్యూ హెచ్చరిక

కార్సియర్ సుర్ వెవె (స్విట్జర్లాండ్): భారత స్టార్ రెజ్లర్లపై పోలీసు చర్యను ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య (యూడబ్ల్యూడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. టాప్‌స్టార్లపై పోలీసు జులుంపై విచారం వ్యక్తం చేసింది. తమ సమాఖ్య కొన్ని నెలలుగా భారత్‌లోని రెజ్లర్ల నిరసన కార్యక్రమాలను నిశితంగా గమనిస్తోందని తెలిపింది. లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్‌తో ఒలింపిక్, ఆసియా క్రీడల పతక విజేతలు సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా తదితరులు చేస్తున్న నిరసన తమ దృష్టికి వచ్చిందని యూడబ్ల్యూడబ్ల్యూ ఈ సందర్భంగా తెలిపింది. గతంలో ప్రకటించినట్లుగా 45 రోజుల్లోగా డబ్ల్యూఎఫ్ఐకి ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయకపోతే నిషేధం తప్పదని ఈ సందర్భంగా ప్రపంచ సమాఖ్య హెచ్చరించింది.

'మీ కోసం మళ్లీ ఆడతా'



- అభిమానులకు ధోని సంకేతం
- వచ్చే ఏడాదీ ఐపీఎల్ ఆడే అవకాశాలు!

అహ్మదాబాద్: మూడేళ్ల క్రితం ఐపీఎల్‌లో ఇదే ప్రశ్న...రెండేళ్ల క్రితం టైటిల్ గెలిచాక ఇదే ప్రశ్న... గత ఏడాది టీమ్ ఘోరంగా విఫలమైనప్పుడు మళ్లీ అదే ప్రశ్న...ఇప్పుడు ఐదో సారి చాంపియన్‌గా నిలిచాక పాత సందేహమే కొత్తగా..! మహేంద్ర సింగ్ ధోని ఐపీఎల్ నుంచి రిటైర్ అవుతున్నాడా, ఈ సారి అద్భుత ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపిన తర్వాత తప్పుకుంటున్నాడా అని అభిమానుల్లో ఉత్సుకత. చెన్నై సూపర్ కింగ్స్ 2023 చాంపియన్‌గా నిలిచిన తీరును చూస్తే ధోనికి ఇంతకంటే ఘనమైన వీడ్కోలు ఉండదనిపిస్తోంది. కానీ అతని మాట చూస్తే మళ్లీ వచ్చి ఆడతాడనిపిస్తోంది. ఫైనల్ ముగిసిన తర్వాత ధోని రిటైర్మెంట్‌పై ఎప్పటిలాగే తన దైన శైలిలో ఆసక్తికర సమాధానమిచ్చాడు. 'ఇప్పుడు నేను ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే రిటైర్మెంట్‌ను ప్రకటించడానికి ఇదే సరైన సమయం అనిపిస్తోంది. ఒక్క మాటలో థ్యాంక్యూ అని చెప్పి నేను తప్పుకోవచ్చు. కానీ వచ్చే 9 నెలల పాటు కష్టపడి మరో ఐపీఎల్ ఆడటం మాత్రం అంత సులువు కాదు. అయితే చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు నాపై కురిపిస్తున్న ప్రేమను చూస్తే మరో సీజన్ ఆడటం వారికి కానుక అందించినట్లవుతుంది. వాళ్ల అభిమానం, భావోద్వేగాలు చూస్తే వారి కోసం ఇదంతా చేయాలనిపిస్తోంది' అని ధోని వ్యాఖ్యానించాడు. తాను కెరీర్ చివరి రోజుల్లో ఉన్నాననే విషయం వారికీ తెలుసని, అందుకే ఎక్కడకు వెళ్లినా తనకు ప్రేక్షకులనుంచి భారీ మద్దతు లభించిందని ధోని గుర్తు చేసుకున్నాడు. 'ఇదే మైదానంలో సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడాను. అంతా నా పేరును మైదానంలో మారుమోగించారు. చెన్నైలో మాత్రమే కాకుండా ఇలా అన్ని చోట్లా స్పందన చూస్తే నేను ఆడగలిగినంత ఆడాలనిపించింది' అని మహి పేర్కొన్నాడు. కెప్టెన్‌గా తన ఐదు ఐపీఎల్ ట్రోఫీ విజయాల్లో ప్రతీది భిన్నమైందని, ఒకదాంతో మరో దానికి పోలిక లేదని, పరిస్థితులను బట్టి అన్ని మారతాయని ధోని అభిప్రాయ పడ్డాడు. 'ప్రతీ ట్రోఫీ గెలుపు, ప్రతీ ద్వైపాక్షిక సిరీస్ విజయానికి వేర్వేరు సవాళ్లు ఉంటాయి. ఏదీ ఒకే తరహాలో మూసగా ఉండదు. అందుకే ఆందోళన చెందకుండా పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటా. ఇలాంటి టోర్నీల్లో కీలక క్షణాలు కొన్ని ఉంటాయి. అలాంటప్పుడు ఎలా ఒత్తిడిని ఎదుర్కొంటామనేదే కీలకం. ఈ విషయంలో అందరూ భిన్నంగా ఉంటారు. రహానేలాంటి అనుభవజ్ఞులకు సమస్య రాదు కానీ కుర్రాళ్లను సరైన విధంగా నడిపించాల్సి ఉంటుంది' అంటూ తన శైలిని వెల్లడించాడు.

స్వియాటెక్ ముందంజ

- మెద్వెదెవ్‌కు షాక్
- ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: డిఫెండింగ్ చాంపియన్, టాప్‌సీడ్ ఇగా స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలిరౌండ్లో పోలండ్ స్టార్ 6-4, 6-0తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్)పై అలవోక విజయం సాధించింది. వరుస సెట్లలో కేవలం గంటా 13 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. మిగతా మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 3-6, 6-1, 6-2తో రెబెక మసరొవా (స్పెయిన్)పై, ఏడో సీడ్ ఓన్స్ జాబెర్ (ట్యూనిషియా) 6-4, 6-1తో లూసియా బ్రాంజెటి (ఇటలీ)పై, నాలుగో సీడ్ ఎలీనా రిబాకిన (కజకిస్తాన్) 6-4, 6-2తో క్వాలిఫయర్ లిండా ఫ్రువిర్టొవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు. వైల్డ్ కార్డ్ ప్లేయర్ డియన్ ప్యారీ (ఫ్రాన్స్) 6-2, 6-3తో 25వ సీడ్ అన్హెలినా కలినినా (ఉక్రెయిన్)కు వరుస సెట్లలో షాకిచ్చింది.

మళ్లీ తొలి రౌండ్లోనే....

రష్యన్ టెన్నిస్ స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు 'ఫ్రెంచ్' మరోసారి అచ్చిరాలేదు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ రష్యన్ తొలిరౌండ్లోనే నిష్క్రమించాడు. యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ మెద్వెదెవ్ క్లేకోర్టులో ఐదోసారి మొదటి రౌండ్లోనే కంగుతిన్నాడు. వరుసగా నాలుగేళ్లు అతను తొలిరౌండ్ అడ్డంకి దాటలేకపోయాడు. తాజాగా మెద్వెదెవ్ 6-7 (5/7), 7-6 (8/6), 6-2, 3-6, 4-6తో క్వాలిఫయర్ సెబొత్ వైల్డ్ (బ్రెజిల్) చేతిలో కంగుతిన్నాడు. మిగతా మ్యాచ్‌ల్లో పురుషుల నాలుగో సీడ్ కాస్పెర్ రూడ్ (నార్వే) 6-4, 6-3, 6-2తో క్వాలిఫయర్ ఎలియస్ వైమెర్ (స్వీడన్)పై గెలుపొందగా... 22వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) తొలిరౌండ్ అడ్డంకిని దాటేందుకు పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. ఈ జర్మన్ ప్లేయర్ 7-6 (8/6), 7-6 (7/0), 6-1తో హ్యారిస్ (దక్షిణాఫ్రికా)పై చెమటోడ్చి నెగ్గాడు.



'థ్యాంక్యూ'

ఆరో సారి ఐపీఎల్ టైటిల్ విజయంలో భాగమై రోహిత్ శర్మ (6)తో సమంగా నిలిచిన అంబటి రాయుడు తన కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఐపీఎల్‌తో పాటు అన్ని రకాల దేశవాళీ క్రికెట్‌నుంచి కూడా తప్పుకుంటున్నట్లు రాయుడు వెల్లడించాడు. అండర్-15 స్థాయినుంచి భారత సీనియర్ జట్టు వరకు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు అతను చెప్పాడు. 2013లో తొలిసారి టీమిండియా తరఫున ఆడిన క్షణం మర్చిపోలేనన్న రాయుడు... తనకు తండ్రి సాంబశివరావు అండగా నిలవడం వల్లే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నాడు. 'ఇదో అద్భుతమైన ముగింపు. ఇంతకంటే గొప్పగా ఆశించలేను. గత 30 ఏళ్లుగా నేను పడిన శ్రమకు దక్కిన గుర్తింపు ఇది' అని రాయుడు వ్యాఖ్యానించాడు.

ఐపీఎల్‌లో రాయుడు

మ్యాచ్‌లు: 204	అత్యధిక స్కోరు: 100 నాటౌట్
ఇన్నింగ్స్: 187	సెంచరీలు: 1
పరుగులు: 4348	అర్ధ సెంచరీలు: 22
సగటు: 28.23	ఫోర్లు: 359
స్ట్రయిక్‌రేట్: 127.54	సిక్సర్లు: 173

ధోని ప్రశంసలు

రిటైర్మెంట్ ప్రకటించిన రాయుడుతో తన అనుబంధాన్ని ధోని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నాడు. 'మైదానంలో ఉన్నప్పుడు 100 శాతం శ్రమించడం రాయుడు లక్షణం. మేమిద్దరం ఒకప్పుడు ఇండియా 'ఎ' తరఫున కలిసి ఆడాం. అటు పేస్‌ను, ఇటు స్పిన్‌ను సమర్థంగా ఆడగల నైపుణ్యం అతని సొంతం. అతను జట్టు కోసం ఏదైనా ప్రత్యేకంగా చేయగలడని నేను ఎప్పుడైనా నమ్మేవాడిని. నాలాగే రాయుడుకు కూడా ఎక్కువగా ఫోన్ వాడే అలవాటు లేదు' అని ధోని అన్నాడు.

సినిమా



చిరంజీవి

త్వరలో భోళా మానియా


'**భో**ళా శంకర్' ఆగస్టు 11న థియేటర్‌కి రానున్న విషయం తెలిసిందే. రిలీజ్ డేట్ దగ్గరపడే సమయానికి ప్రమోషన్స్ ఆరంభించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ముందుగా మ్యూజికల్ జర్నీ ప్రారంభిస్తారు. ఆ విషయాన్ని తెలియజేసి, 'భోళా మానియా త్వరలో ప్రారంభమవుతుంది' అంటూ, చిత్రకథానాయకుడు చిరంజీవి రెండు చేతులను వెనక జేబులో పెట్టుకొని ఉన్న డ్యాన్స్ మూమెంట్ లుక్‌ని రిలీజ్ చేశారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా కథానాయికగా, ఆయన సోదరి పాత్రలో కీర్తీ సురేష్ కనిపిస్తారు. ''మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'భోళా శంకర్'. కొంత టాకీ పార్ట్, క్లైమాక్స్, భారీ సెట్ సాంగ్ బ్యాలెన్స్ ఉన్నాయి. జూన్ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్స్ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మహతి స్వరసాగర్ ఈ చిత్రానికి మంచి పాటలు ఇచ్చారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



ఆర్పీ పట్నాయక్, తేజ, వెంకటేశ్, అభిరామ్, గీతిక, పి. కిరణ్

అవార్డులు ఇవ్వాలా? లేదా అనేది ప్రభుత్వం ఇష్టం

''**నే**ను ఎప్పుడూ అవార్డుల గురించి ఆలోచించను (నంది అవార్డులను ఉద్దేశించి).. ప్రభుత్వాలు ఇస్తే ఇవ్వొచ్చు..లేదంటే లేదు. అది వారి ఇష్టం. అయితే అవార్డులు మాకు ప్రోత్సాహం ఇస్తాయి'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అభిరామ్, గీతికా తివారీ జంటగా తేజ దర్శకత్వం వహించిన చిత్రం 'అహింస'. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ-''అన్ని భావోద్వేగాలు ఉన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'అహింస'. కొత్త నటీనటుల నుంచి పవర్‌ఫుల్ ఎమోషన్స్ రాబట్టుకున్నారు తేజ. ఆర్పీ పట్నాయక్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. కిరణ్ ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఈ సినిమా ద్వారా హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న అభిరామ్, గీతిక కష్టపడుతూ, నేర్చుకుంటూ ముందుకెళ్లాలి'' అన్నారు. ''అభిరామ్‌తో సినిమా చేయడానికి రామానాయుడుగారే ప్రధాన కారణం. ఆయన ఆశీర్వాదంతో ఈ చిత్రం బాగా ఆడుతుందని నమ్ముతున్నాను'' అన్నారు తేజ. ''ఈ సినిమా నాకు మంచి హిట్ ఇస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు అభిరామ్. ''అహింస'లో యాక్షన్, వినోదం, ప్రేమ.. ఇలా అన్నీ ఉన్నాయి'' అన్నారు పి. కిరణ్.



కమల్‌హాసన్

నాయకుడులాంటి సినిమా ఇస్తాం

మూడు దశాబ్దాల క్రితం వచ్చిన శక్తిమంతమైన చిత్రాల్లో 'నాయగన్' (నాయకుడు-1987) ఒకటి. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. 35 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఇటీవల ఓ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. మరో రెండు మూడు నెలల్లో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది. ఈ చిత్రం గురించి కమల్‌హాసన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ – ''మణిరత్నంతో ఈ సినిమా గురించి చర్చిస్తున్నాను. ఈ ప్రాజెక్ట్‌పై ఫ్యాన్స్‌కి భారీ అంచనాలు ఉంటాయి. ఆ విషయంలో కాస్త ఒత్తిడి ఉంది. అయితే కచ్చితంగా 'నాయగన్'లా ఒక శక్తిమంతమైన చిత్రాన్ని ఇస్తాం'' అని పేర్కొన్నారు.



కీరవాణి

ఇరవైఏడేళ్ల తర్వాత మెజీషియన్‌తో...

'**నా**టు.. నాటు...' అంటూ దేశీ ట్యూన్‌తో దేశీయులతోనే కాదు... విదేశీయులతో కూడా స్టెప్పులేయించారు ఎంఎం కీరవాణి. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఆర్ఆర్ఆర్'లోని ఈ పాట ఆస్కార్ సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కీరవాణిని అందరూ పాన్ ఇండియా మ్యూజిక్ డైరెక్టర్ అంటున్నారు. నిజానికి ఆయన ఎప్పుడో పాన్ ఇండియా సంగీతదర్శకుడు. తెలుగుతో పాటు తమిళ్, మలయాళం, కన్నడ, హిందీ.. ఇలా పలు భాషల చిత్రాలకు సంగీతం అందించారు. కాగా 27ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆయన మలయాళ సినిమా 'మెజీషియన్' అంగీకరించారు. గతంలో మలయాళంలో 'దేవరాగం' (1996)కి సంగీతదర్శకుడిగా వ్యవహరించారు. ఇక 'మెజీషియన్'కి కీరవాణి మూడు పాటలకు స్వరాలందిస్తారని తెలిసింది. బేబీ జాన్ వల్యత్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

బడ్డీ రెడీ



అల్లు శిరీష్

అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, గోకుల్ హీరోయిన్లు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన 'బడ్డీ' రిలీజ్‌కి రెడీ అయింది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్‌ని విడుదల చేశారు. ''సరికొత్త కథాంశంతో రూపొందిన ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతం అందించగా, రూబెన్ ఎడిటింగ్ నిర్వహించారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్ వసంత్.



ఊర్వశి, అజయ్, మధుసూదన్

క్రైమ్ థ్రిల్

''**మ**ధుసూదన్‌గారు 'చక్రవ్యూహం' సినిమాని తీసిన తీరు నాకెంతో నచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లో చూసి కొత్త దర్శకుడైన మధుసూదన్‌ని ప్రోత్సహించండి'' అని నటుడు అజయ్ అన్నారు. చెట్కూరి మధుసూదన్ దర్శకత్వంలో అజయ్, ఊర్వశీ పరదేశి జంటగా నటించిన చిత్రం 'చక్రవ్యూహం'. సావిత్రి నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చెట్కూరి మధుసూదన్ మాట్లాడుతూ– ''మా సినిమా టీజర్, ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది. సినిమాకి కూడా థియేటర్స్‌లో ఇలాంటి స్పందన ఉంటుందనే ఆశాభావంతో ఉన్నాను'' అన్నారు. ''మంచి క్రైమ్ థ్రిల్లర్‌గా 'చక్రవ్యూహం' తెరకెక్కింది'' అని ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ప్రతినిధి శశిధర్ రెడ్డి అన్నారు.



సమంత

గూఢచారిగా...

డిటెక్టివ్స్ బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుంది? వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే విషయాలను తెలుసుకుంటున్నారట సమంత. ఎందుకంటే 'చెన్నై స్టోరీస్' అనే సినిమా కోసం. ఇంగ్లిష్, తమిళ భాషల్లో రూపొందనున్న చిత్రం ఇది. ఇంగ్లాండ్ నటుడు వివేక్ కల్రా హీరోగా నటించనున్నారు. సమంత హీరోయిన్. సినిమాలో ఇంగ్లాండ్‌కి చెందిన కుర్రాడిగా వివేక్, తమిళ యువతి పాత్రలో సమంత కనిపిస్తారు. తన తల్లి చనిపోయాక, పూర్వీకుల సమాచారం తెలుసుకోవడానికి, దూరమైన తండ్రిని కనుక్కోవడానికి ఇండియా వస్తాడు హీరో. తండ్రి ఆచూకీ తెలుసుకోవడానికి ఓ ప్రైవేట్ డిటెక్టివ్‌ని నియమించుకుంటాడు. ఆ గూఢచారి పాత్రనే సమంత చేయనున్నారు. ఇంగ్లాండ్‌కి చెందిన ఆ యువకుడు, చెన్నై పొన్ను (అమ్మాయి) మధ్య ఏర్పడే ప్రేమతో ఈ చిత్రం సాగుతుంది. 'అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఫిలిప్ జాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.

నవ్వుల బ్రహ్మచారి



గుంత మల్లేశం

గుంత మల్లేశం, సిరి జంటగా నర్సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మచారి'. బి. రాంభూపాల్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నర్సింగ్, బి. రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ– ''దుబాయ్‌కి వెళ్లొచ్చిన ఒక అబ్బాయి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అయితే అనుకున్న సమయానికి అమ్మాయి దొరక్క ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? చివరికి పెళ్లి అయిందా? లేదా అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'బ్రహ్మచారి'. పక్కా తెలంగాణ కామెడీ నేపథ్యంలో ఉంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

సింగరేణి పోరగాళ్ల కథ ఇది - తిరువీర్



''**సిం**గరేణి పోరగాళ్ల కథే 'పరేషాన్'. మంచిర్యాల ఊరుని ఒక బయోపిక్‌లా తీస్తే మా సినిమా అవుతుంది. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో సహజమైన వినోదం ఉంటుంది'' అని హీరో తిరువీర్ అన్నారు. రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వంలో 'మసూద' ఫేమ్ తిరువీర్ హీరోగా నటించిన చిత్రం 'పరేషాన్'. రానా దగ్గుబాటి సమర్పణలో సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా తిరువీర్ మాట్లాడుతూ– ''నేను ఎలాంటి సినిమాలు చేయాలనుకున్నానో అనుకోకుండా ఘాజీ, మల్లేశం, పలాస.. అలాంటివే కుదిరాయి. 'మసూద' తర్వాత ఒక స్వేచ్ఛ దొరకడంతో ఇప్పుడు ప్లాన్ చేసుకుంటున్నాను. ఎలాగైనా 'పరేషాన్'ని జనాల్లోకి తీసుకెళ్దామని రానాగారు ముందుకు రావడంతో మా సినిమాకి బలం వచ్చింది. ప్రస్తుతం శివం సెల్యులాయిడ్ నిర్మాణంలో ఓ సినిమా, 'బటర్ ఫ్లై' ఫేం సతీష్‌గారితో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

చైనా పేరు తొలగించమనడం తగదు

- నిర్మాత శంకర్ నాయుడు



దీన్ రాజ్, శంకర్ నాయుడు

''**మ**న సైనికుల ప్రాణాలు బలి తీసుకుంటూ... మన దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న చైనా పేరును 'భారతీయన్స్' సినిమాలో తొలగించాలని సెన్సార్ వారు చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధం'' అని నిర్మాత డా. శంకర్ నాయుడు అన్నారు. నీరోజ్ పుచ్చా, సోనమ్ టెండప్, సుభా రంజన్ హీరోలుగా, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్ నాంగ్యాల్ హీరోయిన్లుగా నటించిన బహు భాషా చిత్రం 'భారతీయన్స్'. దీన్ రాజ్ దర్శకత్వంలో శంకర్ నాయుడు అడుసుమిల్లి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని మాజీ సైనికాధికారుల కోసం హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ''మాజీ సైనికాధికారులు 'భారతీయన్స్' చూసి, బాగుందని మెచ్చుకోవడం గర్వంగా ఉంది'' అన్నారు దీన్ రాజ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	123	62,969
నిఫ్టీ ▲	35	18,634

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్డాక్	12,997	▲	21
డోజోన్స్	32,941	▽	152
ఎఫ్టీఎస్ఈ 100	7,522	▽	105
డాక్స్	15,909	▽	44
షాంఘై	3,224	▲	3
నికాయ్	31,328	▲	95

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	60,402 ▲	390
బంగారం (99.5 స్వచ్ఛత)	60,160 ▲	388
వెండి (కిలో)	70,861 ▲	79

4 రోజుల్లో 1,200 పాయింట్లు ప్లస్

ముంబై: ఆటుపోట్ల మధ్య వరుసగా నాలుగో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 123 పాయింట్ల వృద్ధితో 62,969కు చేరింది. నిఫ్టీ 35 పాయింట్లు బలపడి 18,634 వద్ద ముగిసింది. అమెరికా రుణ పరిమితి పెంపు డీల్ ఓకే కావడంతో ఇన్వెస్టర్లకు జోష్ వచ్చినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,195 పాయింట్లు జమ చేసుకోగా.. నిఫ్టీ 348 పాయింట్లు పురోగమించింది. అయితే ఇంట్రాడేలో సెన్సెక్స్ 63,036 వద్ద గరిష్టాన్ని, 62,737 వద్ద కనిష్టాన్ని తాకింది. దీంతో వరుసగా రెండో రోజు 63,000 స్థాయిని అధిగమించింది. ఇక నిఫ్టీ 18,622– 18,576 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఎన్ఎస్ఈలో మీడియా, ఎఫ్ఎంసీజీ, ప్రయివేట్ బ్యాంక్స్ 0.6 శాతం చొప్పున పుంజుకోగా.. ప్రధానంగా మెటల్ ఇండెక్స్ 1 శాతం క్షీణించింది. బ్యాంక్ నిఫ్టీ ఏడాది గరిష్టానికి చేరింది.



- తాజాగా 123 పాయింట్లు అప్
- 62,969 వద్ద ముగిసిన సెన్సెక్స్
- 35 పాయింట్లు బలపడిన నిఫ్టీ

డాలరుతో మారకంలో రూపాయి 4 పైసలు నీరసించి 82.67 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)	
31-5-2023	
విశాఖ	505-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	72.00
30-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

తేలికపాటి పేమెంట్ సిస్టం!

ఎటువంటి విపత్తులు వచ్చినా ఆర్థిక లావాదేవీల విషయంలో అంతరాయాలు ఏర్పడకుండా ఎక్కడి నుంచి అయినా ఆపరేట్ చేయగలిగే చెల్లింపుల వ్యవస్థ లైట్ వెయిట్ అండ్ పోర్టబుల్ పేమెంట్ సిస్టంను రూపొందించడంపై ఆర్బీఐ కసరత్తు చేస్తోంది.

కట్టలు తెంచుకున్న కరెన్సీ!

- 2022–23లో చెలామణిలో ఉన్న కరెన్సీ విలువ, పరిమాణం అప్
- విలువలో 7.8 శాతం పెరుగుదల
- 4.4 శాతం పెరిగిన పరిమాణం
- ఆర్బీఐ వార్షిక నివేదిక వెల్లడి



ముంబై: చెలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ అలాగే పరిమాణం రెండూ మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో (2021–22 ఆర్థిక సంవత్సరంతో పోల్చి) వరుసగా 7.8 శాతం, 4.4 శాతం పెరిగాయి. అయితే 2021–22లో ఈ పెరుగుదల (2020–21తో పోల్చి) వరుసగా 9.9 శాతం, 5 శాతంగా ఉన్నాయి. మొత్తంగా పరిస్థితి చూస్తే, డిజిటలైజేషన్ మార్గంలో ఎన్ని చర్యలు తీసుకున్నా వ్యవస్థలో బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం పెరగడం గమనార్హం. అయితే పెరుగుదల శాతాల్లో తగ్గడమే 'చెప్పుకోవడానికి' కొంత ఊరటనిచ్చే అంశం. ఆర్బీఐ ఈ మేరకు విడుదల చేసిన వార్షిక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- విలువ పరంగా చూస్తే, రూ. 500, రూ. 2,000 నోట్ల వాటా 31 మార్చి 2023 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువలో 87.9 శాతం. 31 మార్చి 2022లో ఇది 87.1 శాతం.
- రూ. 500 డినామినేషన్ అత్యధికంగా 37.9% వాటాను కలిగి ఉంది. తరువాతి స్థానంలో రూ. 10 డినామినేషన్ బ్యాంక్ నోటు ఉంది. ఈ నోట్లు 2023 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం బ్యాంక్ నోట్లలో రూ.10 నోట్ల పరిమాణం 19.2%గా ఉన్నాయి.
- 2023 మార్చి చివరి నాటికి రూ. 25,81,690 కోట్ల విలువ కలిగిన మొత్తం రూ. 500 డినామినేషన్ నోట్లు 5,16,338 లక్షలు. 2022 మార్చి చివరి నాటికి రూ. 500 నోట్ల సంఖ్య 4,55,468 లక్షలు. అంటే వ్యవస్థలో రూ.500 నోట్లు వార్షికంగా పెరిగాయన్నమాట.
- ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్లలో రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500, రూ.2,000 డినామినేషన్లు ఉన్నాయి. చెలామణిలో ఉన్న నాణేలు 50 పైసలు, రూ. 1, రూ. 2, రూ. 5, రూ. 10, రూ. 20 డినామినేషన్లను కలిగి ఉంటాయి.
- 2022–23 మధ్యకాలంలో ఆర్బీఐ లైవ్-పైలట్ ప్రాతిపదికన ఈ-రూపాయిని కూడా ప్రారంభించింది. 2023 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న ఈ-రూపాయి-హోల్సేల్ అలాగే ఈ-రూపాయి-రిటైల్ విలువలు వరుసగా రూ. 10.69 కోట్లు రూ. 5.70 కోట్లుగా ఉన్నాయి.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు నోట్ల ఇండెంట్, సరఫరాలు రెండూ గత సంవత్సరంతో (2021–22) పోలిస్తే 1.6 శాతం స్వల్పంగా పెరిగాయి. రూ.2000 నోట్ల ప్రింటింగ్కు ఇండెంట్ లేదు.

రూ.2000 నోట్ల సంగతి ఇదీ...

ఆర్బీఐ నివేదిక ప్రకారం రూ.2,000 నోట్ల అంశాన్ని పరిశీలిస్తే, 2023 మార్చి చివరి నాటికి రూ.3,62,220 కోట్ల విలువ చేసే 4,55,468 లక్షల నోట్లు వ్యవస్థలో ఉన్నాయి. పరిమాణం పరంగా చెలామణిలో ఉన్న రూ. 2,000 నోట్లు 2023 మార్చి చివరినాటికి చెలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో 1.3 శాతానికి తగ్గాయి. 2022 మార్చి నాటికి ఈ నోట్లు 1.6 శాతంగా ఉన్నాయి. విలువ పరంగా కూడా నోట్లు 2022 మార్చిలో మొత్తం నోట్లలో 13.8 శాతం ఉంటే, 2023 మార్చి నాటికి 10.8 శాతానికి పడిపోయింది.

తగ్గుతున్న మోసాల 'విలువ'..: 2022–23లో బ్యాంకింగ్ రంగంలో మోసాల సంఖ్య 13,530కి చేరుకుంది. అయితే విలువ మాత్రం దాదాపు సగానికి తగ్గి రూ. 30,252 కోట్లుగా ఉంది. కార్డ్, ఇంటర్నెట్ డిజిటల్ పేమెంట్లలోనే మోసాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.

ఎనిమిది లేయర్ల వాటర్ ట్యాంక్కు డిమాండ్



హైదరాబాద్: ఆర్పీ ప్లాస్టో విడుదల చేసిన ఎనిమిది లేయర్ల నీటి నిల్వ ట్యాంకుకు మంచి స్పందన లభిస్తోంది. నివాస, వాణిజ్య కస్టమర్ల నుంచి అనూహ్య స్పందన వస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. దేశంలో నీటి నిల్వ పరంగా కొత్త ప్రమాణాలను ఇది నెలకొల్పినట్టు పేర్కొంది. నాణ్యమైన, మన్నికైన ఉత్పత్తులు అందించాలన్న కంపెనీ లక్ష్యంలో భాగమే ఇదని తెలిపింది.

మహిళా ఇంజనీర్లకు టాటా టెక్నాలజీస్ ప్రాధాన్యం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్మెంట్ డిజిటల్ సేవల సంస్థ టాటా టెక్నాలజీస్ మరింత మంది మహిళలను రిక్రూట్ చేసుకోవాలని భావిస్తోంది. కార్యాలయాల్లో లింగ వైవిధ్యాన్ని పాటించే క్రమంలో 'రెయిన్బో' కార్యక్రమం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,000 మంది పైగా మహిళా ఇంజనీర్లను తీసుకునే యోచనలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. అలాగే, నాయకత్వ బాధ్యతలను చేపట్టేలా మహిళా ఉద్యోగులను తీర్చిదిద్దే దిశగా ఆరు నెలల లీడర్బ్రిడ్జ్-వింగ్స్ ప్రోగ్రామ్ను రూపొందించినట్లు వివరించింది. ఉద్యోగినులు నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని టాటా టెక్నాలజీస్ వివరించింది. సంస్థలో సమ్మిళిత సంస్కృతిని పెంపొందించేందుకు, ఉద్యోగులు చురుగ్గా పాలు పంచుకునేందుకు మరిన్ని కొత్త ప్లాట్ఫామ్లను కూడా ఆవిష్కరిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.



అదానీ పోర్ట్స్ లాభం ఫ్లాట్

క్యూ4లో రూ. 1,141 కోట్లు • షేరుకి రూ. 5 డివిడెండ్

న్యూఢిల్లీ: అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్) గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 3 శాతం పుంజుకుని రూ. 1,141 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,112 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం మరింత అధికంగా 30 శాతం వృద్ధితో రూ. 6,179 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 4,739 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,497 కోట్ల నుంచి రూ. 3,994 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదికి సైతం

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఏపీసెజ్ దాదాపు 9 శాతం అధికంగా రూ. 5,393 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2021–22లో రూ. 4,953 కోట్ల లాభం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు ఎన్ఎస్ఈలో 0.5 శాతం నీరసించి రూ. 734 వద్ద ముగిసింది.



అదానీ ట్రాన్స్మిషన్ లాభం జూమ్

అదానీ ట్రాన్స్మిషన్ చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 85 శాతం దూసుకెళ్లి రూ. 440 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 237 కోట్లు ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 3,165 కోట్ల నుంచి రూ. 3,495 కోట్లకు ఎగసింది. నికర లాభాల్లో ట్రాన్స్మిషన్ విభాగం నుంచి 11 శాతం వృద్ధితో రూ. 221 కోట్లు లభించగా.. పంపిణీ విభాగం వాటా 478 శాతం జంప్చేసి రూ. 218 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి అదానీ ట్రాన్స్మిషన్ నికర లాభం రూ. 1,281 కోట్లకు స్వల్పంగా బలపడింది. 2021–22లో రూ. 1,236 కోట్ల లాభం ప్రకటించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 11,861 కోట్ల నుంచి రూ. 13,840 కోట్లకు జంప్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ట్రాన్స్మిషన్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 3 శాతం పతనమై రూ. 810 వద్ద ముగిసింది.

జాబ్ పాయింట్

ప్రకాశం జిల్లా జీజీహెచ్లో 64 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ/ప్రభుత్వ జనరల్ హాస్పిటల్.. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 64

- » **విభాగాలు:** పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయోకెమిస్ట్రీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పాథాలజీ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్లో ఎంబీబీఎస్/ఎండీ/డీఎన్బీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:** కౌన్సిలింగ్ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- » **ఈమెయిల్:** rimsongole@yahoo.com
- » **కౌన్సిలింగ్ వేదిక:** కాన్ఫరెన్స్ హాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఒంగోలు.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023.
- » **కౌన్సిలింగ్ తేది:** 01.06.2023.
- » **వెబ్సైట్:** www.prakasam.ap.gov.in

ఏపీ సమగ్ర శిక్షా సొసైటీలో 1358 టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మహిళా అభ్యర్థులు అర్హులు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1358
- » **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపాల్–92, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)–846, సీఆర్టీ–374, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)–46.

అర్హత

- » **ప్రిన్సిపాల్:** కనీసం 50 శాతం మార్కులతో బీఈడీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ):** బీఈడీ, బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంబీబీఎస్/పీజీ డిప్లొమా/ఎంఏ/ఎంకామ్/ఎంఎస్సీ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి.
- » **సీఆర్టీ:** బీఈడీ, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **పీఈటీ:** అండర్ గ్రాడ్యుయేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్/బీపీఈడీ/ఎంపీఈడీ, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** జనరల్ అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ /బీసీలకు ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. మొత్తం 100 మార్కులకు సెలక్షన్ ప్రక్రియ ఉంటుంది. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, సర్వీస్ వెయిటేజీ, స్కిల్ టెస్ట్లో ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
- » **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.05.2023.
- » **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2023.
- » **వెబ్సైట్:** https://apkgbv.apcfss.in

ఇస్రోలో 303 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ సెంటర్, ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్మెంట్ బోర్డ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో కేంద్రాలు/యూనిట్లలో సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(గ్రూప్-ఎ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 303
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(ఎలక్ట్రానిక్స్)–90, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(మెకానికల్)–163, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(కంప్యూటర్ సైన్స్)–47, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(ఎలక్ట్రానిక్స్)–అటానమస్ బాడీ–పీఆర్ఎల్–02, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్సీ(కంప్యూటర్ సైన్స్)–అటానమస్ బాడీ–పీఆర్ఎల్–01.
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్.
- » **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 14.06.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- » **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **రాతపరీక్ష కేంద్రాలు:** అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చెన్నై, గువాహటి, హైదరాబాద్, కోల్కతా, లక్నో, ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
- » **ఆన్లైన్ రిజిస్ట్రేషన్కు చివరితేది:** 14.06.2023.
- » **వెబ్సైట్:** www.isro.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్లో 70 పోస్టులు

హైదరాబాద్లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
- » **పోస్టులు:** ప్రాజెక్ట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్.
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వేతనం:** ప్రాజెక్ట్ ఇంజనీర్ నెలకు రూ.45,000, టెక్నికల్ ఆఫీసర్ నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **ఇంటర్వ్యూ వేదిక:** సీఎల్డీసీ, నలందా కాంప్లెక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్ పోస్టు, హైదరాబాద్–500062.
- » **ఇంటర్వ్యూ సమయం:** ఉ. 9 గంటల నుంచి
- » **ఇంటర్వ్యూ తేది:** 31.05.2023, 01.06.2023, 05.06.2023, 06.06.2023.
- » **వెబ్సైట్:** www.ecil.co.in

త్రివిధ దళాల్లో.. కొలువు+కోర్సు

ఇంటర్మీడియెట్తోనే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ల్లో..పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కొలువు సొంతం చేసుకోవచ్చు. త్రివిధ దళాల్లో కెరీర్తోపాటు బ్యాచిలర్ డిగ్రీకి మార్గం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (ఎన్డీఏ,ఎన్ఏ)! యూపీఎస్సీ తాజాగా ఎన్డీఏ, ఎన్ఏ-2(2023) నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 3న పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో..ఎన్డీఏ, ఎన్ఏ ఎంపిక దశలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » ఎన్డీఏ,ఎన్ఏ(2)-2023 నోటిఫికేషన్ విడుదల
- » 395 పోస్టులకు యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- » ఇంటర్మీడియెట్ అర్హతగా పోటీ పడే అవకాశం
- » ఎంపికైతే కొలువుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్

మొత్తం 395 పోస్టులు

- ఎన్డీఏ, ఎన్ఏ(2)–2023 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 395 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఇందులో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో.. ఆర్మీ–208 (మహిళలకు 10 పోస్టులు), నేవీ 42(మహిళలకు 12 పోస్టులు); -ఎయిర్ఫోర్స్ ఫ్లయింగ్ విభాగంలో 92, ఎయిర్ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్) 18, ఎయిర్ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్) 10 ఖాళీలు; అలాగే నేవల్ అకాడమీలో(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) 25 (మహిళలకు 7) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎయిర్ఫోర్స్కు సంబంధించి మూడు విభాగాల్లోనూ ప్రతి విభాగంలో మహిళలకు రెండు పోస్టులు కేటాయించారు. నేవల్ అకాడమీ 10+2 కేడట్ ఎంట్రీ స్కీమ్లో ఈ ఏడాది నుంచి కొత్తగా మహిళా అభ్యర్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు.

అర్హతలు

- ఆర్మీ వింగ్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జనవరి 2, 2005–జనవరి 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

ఎన్డీఏ, ఎన్ఏకు ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. అవి..రాత పరీక్ష, ఎస్ఎస్బీ ఎంపిక ప్రక్రియ. తొలి దశలో యూపీఎస్సీ ఎన్డీఏ, ఎన్ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి తదుపరి దశలో ఎస్ఎస్బీ ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి.



శిక్షణతోపాటు బ్యాచిలర్ డిగ్రీ

ఎన్డీఏ, ఎన్ఏ రాత పరీక్షతోపాటు ఎస్ఎస్బీ ఎంపిక ప్రక్రియల్లో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో మూడేళ్ల శిక్షణనిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ఫోర్స్, నేవీ విభాగలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో; నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ–పుణెలో.. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే విధంగా శిక్షణ ఉంటుంది. చివరి ఆరు నెలలు అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రెనింగ్ ఇస్తారు. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్యూ–ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు.

- ఎయిర్ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు కూడా అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి.

క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ శిక్షణ

నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్కు ఎంపికైన వారికి శిక్షణ భిన్నంగా ఉంటుంది. వీరికి ఎజిమలలోని నేవల్ అకాడమీలో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్లలో ఏదో ఒక బ్రాంచ్తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

ఫిజికల్ ట్రైనింగ్

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నిర్దిష్ట వ్యవధిలో మళ్లీ ఫిజికల్ ట్రెనింగ్ ఇస్తారు. ఆర్మీ క్యాడెట్లకు ఐఎంఏ (డెహ్రాడూన్), నేవీ క్యాడెట్స్కు నేవల్ అకాడమీ (ఎజిమల), ఎయిర్ఫోర్స్ క్యాడెట్లకు ఎయిర్ ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లలో ఫీల్డ్ ట్రైనింగ్ ఉంటుంది.

స్టయిఫండ్ రూ.56,100

ఎన్డీఏ,ఎన్ఏ విజేతలకు శిక్షణ సమయంలో పే లెవల్–10కు సమానమైన రూ.56,100 స్టైపెండ్గా అందిస్తారు. ఫీల్డ్ ట్రెనింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.56,100–1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్తో కెరీర్ ప్రారంభమవుతుంది.

రాత పరీక్ష ఇలా

- ఎన్డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్–1లో మ్యాథమెటిక్స్ 300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- పేపర్–2లో జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఇలా మొత్తం 900 మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది.
- పేపర్–2గా నిర్వహించే జనరల్ ఎబిలిటీ టెస్ట్లో పార్ట్–ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. పార్ట్–బి జనరల్ నాలెడ్జ్ విభాగం 400 మార్కులకు ఉంటుంది.

ఎస్ఎస్బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు తదుపరి దశలో 900 మార్కులకు ఎస్ఎస్బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ఎయిర్ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్ఎస్బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.
- ఎస్ఎస్బీ ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల మానసిక, శారీరక ధృఢత్వాన్ని పరిశీలిస్తారు. ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, తార్కిక విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అదే విధంగా పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా మొత్తం అయిదు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ విజేతలుగా నిలిచిన వారికి నేషనల్ డిఫెన్స్ అకాడమీ–పుణె, నేవల్ అకాడమీ(ఎజిమల)లో శిక్షణ ఇస్తారు.

పటిష్ట ప్రణాళికతోనే సక్సెస్

- **పేపర్–1:** ఆల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ ఆల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రాక్టీస్ టెస్ట్లు, మాక్ టెస్ట్లు రాయడం కూడా మేలు చేస్తుంది.
- **పేపర్–2:** బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్కు సంబంధించి..ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర–భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్పై అవగాహన పెంచుకోవాలి. ఫిజిక్స్లో ఎలక్ట్రోమాగ్నటిజం, మెకానిక్స్, డైనమిక్స్లోని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కెమిస్ట్రీలో కెమికల్ అనాలసిస్, ఇనార్గానిక్ కాంపౌండ్స్, పీరియాడిక్ టేబుల్స్, కాన్సెప్ట్ ఆఫ్ ఫిజికల్ కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్, థర్మోడైనమిక్స్, క్వాంటమ్ మెకానిక్స్పై ప్రధానంగా దృష్టి సారించాలి. జనరల్ సైన్స్లో వ్యాధులు–కారకాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్లపై అవగాహన ఏర్పరచుకోవాలి. కరెంట్ అఫైర్స్ కోసం పరీక్ష జరిగే తేదీకి ముందు ఆరు నెలల వ్యవధిలో జరిగిన సమకాలీన మార్పులపై దృష్టి సారించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 6, 2023
- **ఆన్లైన్ దరఖాస్తు సవరణ:** జూన్ 7– జూన్ 13, 2023
- **ఎన్డీఏ, ఎన్ఏ పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 3, 2023
- **ఆన్లైన్ దరఖాస్తు వెబ్సైట్:** upsconline.nic.in
- **పూర్తి వివరాలకు వెబ్సైట్:** www.upsc.gov.in

క్లుప్తంగా...

భారత సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక గోవా

గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్



సాక్షి, అమరావతి: ప్రకృతి సోయగం, ఆత్మీయ ఆతిథ్యానికి ప్రతీకైన గోవా రాష్ట్రం భారతీయ సంస్కృతికి వైవిధ్యాన్ని అందిస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన గోవా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఏక్ భారత్...శ్రేష్ఠ భారత్' పేరుతో కేంద్రం చేపట్టిన కార్యక్రమం జాతీయ సమైక్యతను పెంపొందిస్తుందన్నారు. దేశ అభివృద్ధిలో గోవా గణనీయమైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. పలువురు గోవా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

నేడు జేఎన్‌టీయూకే 9వ స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా కాకినాడలోని జేఎన్‌టీయూకే 9వ స్నాతకోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వర్సిటీ కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గౌరవ డాక్టరేట్‌ను ప్రముఖ వ్యాపారవేత్త చలమలశెట్టి అనీల్‌కు ప్రదానం చేస్తారు. అలాగే వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన 66 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 144 మందికి పీహెచ్‌డీలు అందజేస్తారు. అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, శాంత బయోటెక్ అధినేత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నారని వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు.

నేడు విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు

విశిష్ట సేవలందించిన నౌకాదళ సిబ్బందికి సేవా అవార్డులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించిన వారికి గ్యాలంట్రీ, విశిష్ట సేవా పతకాలను అందించే బృహత్తర కార్యక్రమానికి బుధవారం విశాఖ వేదిక కానుంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని నేవల్ బేస్‌లో ఈ నెల 31న సాయంత్రం నేవల్ ఇన్వెస్టిచర్ సెర్మనీ–2023 పేరుతో ఈ వేడుకలు జరగనున్నాయి. భారత రాష్ట్రపతి తరఫున సేవా పతకాలను అందించేందుకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ విశాఖకు చేరుకున్నారు. ఇద్దరికి నవ్‌సేనా శౌర్య పతకాలు, 13 మందికి నవ్‌సేనా డివోషన్ టు డ్యూటీ పతకాలు, 16 మందికి విశిష్ట సేవా పతకాలు, ఇద్దరికి జీవన్ రక్ష పతకాలు కలిపి 33 మందికి అవార్డులను అందజేయనున్నారు.భారత నౌకాదళంలో మార్గదర్శక పరిశోధనలు చేస్తున్న వారికి లెఫ్టినెంట్ వీకేజైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్, విమాన భద్రతని ప్రోత్సహిస్తున్న వారికి కెప్టెన్ రవిధీర్ మెమోరియల్ గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా చెప్పారు.

వారినీ ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీ చేయండి

ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ వినతి

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో ఇప్పటికే స్పెషల్ కేటగిరీలో 'స్పౌజ్' అవకాశాన్ని గతంలో వాడుకుని ఇప్పుడు విడో అయినవారు, వైద్యపరంగా ఇబ్బందులున్న వారు ఎనిమిదేళ్ల సర్వీసు నిండకున్నా వారిని ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను కోరింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ నాయకులు కమిషనర్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గత బదిలీల్లో.. కోవిడ్ కారణంగా భాగస్వామిని కోల్పోయిన (స్పౌజ్) వారికి ప్రత్యేకంగా అవకాశం కల్పించారని, ఇప్పుడూ అదే అవకాశం కల్పించాలని వారు కోరారు.

మేనిఫెస్టోతో వైఎస్సార్ సీపీకి తడిసిపోతోంది

యువగళం సభలో లోకేశ్

జమ్మలమడుగు : రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టోతో వైఎస్సార్‌సీపీ నాయకులకు తడిసిపోతోందని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణంలోకి యువగళం పాదయాత్ర చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల కష్టాలు తెలుసుకున్న తర్వాత మీ అన్న చంద్రన్న మహాశక్తి పథకం పేరుతో సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించారన్నారు. తాము మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను ఎలా అమలు చేస్తారంటూ వైఎస్సార్‌సీపీ పేటీఎం డాగ్స్ రోడ్లపైకి వచ్చి అరుస్తున్నాయన్నారు. మద్య నిషేధం చేస్తామని చెప్పి ఇంత వరకు అమలుచేయలేదని, జగన్ మహిళల్ని మోసం చేశారని లోకేశ్ అన్నారు. జగన్ మోసగాడు కాబట్టే టీడీపీ ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్లు, పండుగ కానుకలు, ఇలా వందకు పైగా పథకాలను కట్ చేశాడన్నారు. 2019లో జమ్మలమడుగు జాతకం మారుస్తాడని భారీ మెజార్టీతో మూలె సుధీర్‌రెడ్డిని గెలిపించారని.. కాని పేదవాడుగా ఉన్న సుధీర్‌రెడ్డి నేడు జమీందారు ఎలా అయ్యాడని ఆయన ప్రశ్నించారు.

వాస్తవాలు కనలేరా.!

గత 5 నెలల్లో రూ..3059.4 కోట్లతో 3,633.81 ఎంయూల కొనుగోలు

- రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- అయినా డిమాండ్‌కి సరిపడా సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- బహిరంగ మార్కెట్ నుంచి రూ.కోట్లు ఖర్చు చేసి కొనుగోలు
- అకాల వర్షాలు, గాలులతో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బ
- వాటి పునరుద్ధరణతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో అంతరాయం



సాక్షి, అమరావతి: పసలేని కథనాలకు ఈనాడు కేరాఫ్‌గా మారింది. లేని వాటిని ఉన్నట్లుగా అవాస్తవాల అచ్చుతో పబ్బం గడుపుకుంటోంది. అలాంటి పనికిరాని కథనాల్లో ఒకటి ఈ విద్యుత్ కోతల కథనం. రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడా ఏ విధమైన విద్యుత్ కోతలు అమలులో లేవు. అయినా ప్రతి రోజూ 2 – 3 గంటలు విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఈనాడు పదే పదే అసత్య ప్రచారం చేస్తోంది. ప్రజలు నవ్వుతారనే కనీస ఇంగితం కూడా లేకుండా గత ప్రభుత్వంలో ఐదేళ్లు విద్యుత్ కోతలే లేవని మరో అబద్ధం చెబుతోంది. వేసవి కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం రోజూ రూ.కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్‌ను కొని మరీ ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా సరఫరా చేస్తుంటే, కరెంటు కొనలేరా? అంటూ కళ్లుండీ గుడ్డిరాతలు అచ్చేసింది. అసలు వాస్తవాలను ఇంధన శాఖ 'సాక్షి'కి వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం..

ఫ్యాక్ట్ చెక్

ఆరోపణ: డిమాండ్ మేరకు విద్యుత్ అందుబాటులో లేనప్పుడు మార్కెట్‌లో కొనాలి. అలా కాకుంటే ఉత్పత్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు లేని కోతలు ఇప్పుడెందుకు వచ్చాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవం: ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు ఈ ఐదు నెలల్లో ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో రూ.3059.4 కోట్లు వెచ్చించి 3,633.81 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేసింది. అలాగే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వంద శాతం కరెంటు ఉత్పత్తి చేస్తోంది. రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో 40 నుంచి 45 శాతం ఏపీజెన్‌కో నుంచే సమకూరుతోంది. రోజూ దాదాపు 105 మిలియన్ యూనిట్లు జెన్‌కో అందిస్తోంది. ఫలితంగా రాష్ట్రంలో ఏ ఒక్క రోజూ విద్యుత్ కోతలు విధించాల్సిన అవసరమే రావడంలేదు.

ఆరోపణ: షెడ్యూల్ వేసి సరఫరా నిలిపివేస్తున్నారు. డిమాండ్ సర్దుబాటు కోసం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోత పెడుతున్నారు.

వాస్తవం: విద్యుత్ డిమాండ్ గతేడాదితో పోల్చితే భారీగా పెరిగింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ రేట్లు అధికంగా ఉన్నప్పటికీ యూనిట్ పది రూపాయలైనా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అంతరాయాల్లేకుండా విద్యుత్ సరఫరా చేస్తోంది. సర్దుబాటు అవసరమే లేదు. ఈనాడు చెబుతున్న 0.24 మిలియన్ యూనిట్లు, 0.19 మిలియన్ యూనిట్లు అనేది కేవలం గ్రిడ్ ఫ్రీక్వెన్సీని నిర్దిష్ట స్థాయిలో నిలిపి ఉంచడానికి చేసిన డిమాండ్ సర్దుబాటు మాత్రమే. విద్యుత్ కొరతతో లేక కోతో కాదు.

ఆరోపణ: రాత్రి వేళ అనూహ్యంగా పెరుగుతున్న డిమాండ్‌ను నియంత్రించలేని పరిస్థితి. ఆ సమయంలో కోతలకు సాంకేతిక కారణాలను సాకుగా చెబుతున్నారు.

వాస్తవం: వేసవి కారణంగా రాత్రి వేళ అనూహ్యంగా విద్యుత్ వినియోగం పెరిగి 11 కె.వి. పంపిణీ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. 33 కె.వి. లైన్లపై, సబ్‌స్టేషన్లపై కూడా అధిక లోడు ప్రభావం ఉంటోంది. దీంతో ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. పంపిణీ సంస్థ (డిస్కం)లలో క్షేత్ర స్థాయిలో 33/11 కె.వి. సబ్‌స్టేషన్ పరిధిలో 24 గంటలు నిర్వహణ సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అధిక లోడు, అధిక ఉష్ణోగ్రతలు, అకాల గాలివానల వల్ల కొన్ని చోట్ల స్వల్పకాలం ఏర్పడే విద్యుత్ అంతరాయాలను భూతద్దంలో చూపిస్తూ రాష్ట్రమంతటా పరిస్థితి ఇలానే ఉందని ఈనాడు కట్టు కథలు అల్లుతోంది.

ఆరోపణ: ప్రకాశం జిల్లాలో 2, 3 గంటలు, విజయనగరం జిల్లాలో 2 నుంచి 4 సార్లు కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆక్వా రైతులు జనరేటర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

వాస్తవం: వేసవి ఎండలు, వాతావరణంలో మార్పుల కారణంగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, విజయనగరం జిల్లా గజపతినగరం, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలులు సంభవిస్తున్నాయి. ఈ కారణంగా విద్యుత్ స్తంభాలు విరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడం జరుగుతోంది. వాటిని పునరుద్ధరించే క్రమంలో ఆ ప్రాంతాల్లో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంతే తప్ప విద్యుత్ కోతలు విధిస్తున్నారనేది అవాస్తవం.

ఆరోపణ: లోడ్ అంచనా వేసి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. కానీ డిస్కంలు అలా చేయలేకపోయాయి.

వాస్తవం: వేసవి కాలంలో రాత్రి వేళ ఏసీలు, కూలర్ల వినియోగం బాగా పెరిగింది. తద్వారా పెరిగే డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్ సరఫరా కూడా జరుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో లోడును అంచనా వేసి దానికి తగ్గట్టుగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు వాడుకునేలా మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు డిస్కంల వద్ద సిద్ధంగా ఉన్నాయి.

ఆరేళ్లకే ఎవరెస్ట్ అధిరోహణ

ఒంగోలు చిన్నోడు అక్షజ్ ఘనత



ఒంగోలు టౌన్: ఒంగోలుకు చెందిన ఓ చిన్నారి ఎవరెస్ట్ ఎక్కాడు. ఆ చిన్నోడి ధైర్య సాహసాలు మెచ్చుకున్న నేపాల్ రాయబారి ఎవరెస్ట్ డే రోజున అవార్డుతో సత్కరించారు. ఒంగోలులోని సంతపేటకు చెందిన వెలగపూడి వెంకటరమణ ఏపీ ట్రాన్స్‌కో లో ఎస్ఈ గా చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన అల్లుడు అమిత్, కూతురు అనురాధ ఇంజినీర్లుగా మస్కట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి అక్షజ్ ఉడియావాల(6) అనే కుమారుడున్నాడు. అక్షజ్ గతేడాది ఎవరెస్ట్ శిఖరంలోని బేస్ క్యాంపు వరకు అంటే 5,364 మీటర్ల ఎత్తు వరకు ఎక్కి అక్కడ భారత జాతీయ జెండాను ఎగరేశాడు. ప్రతి ఏడాది మే 29న ఎవరెస్ట్ డే సందర్భంగా మస్కట్‌లోని నేపాల్ రాయబార కార్యాలయంలో జరిగిన ఎవరెస్ట్ డే కార్యక్రమానికి అక్షజ్‌తో పాటు అతడి తల్లిదండ్రులకు ఆహ్వానం అందింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అక్షజ్ తన అనుభవాలను అక్కడ వివరించాడు. అక్షజ్‌కు నేపాల్ రాయబారి దోర్నాథ్ ఆర్యల్ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేట్ అవార్డును ప్రదానం చేశారు. అక్షజ్ తల్లిదండ్రులు అమిత్, అనురాధలను సత్కరించారు.

విశాఖలో 'అంతర్జాతీయ ఆర్గానిక్ మహోత్సవ్

జూన్ 2 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

- రూ.100 కోట్లకు పైగా ఒప్పందాలకు సన్నాహాలు
- బ్రోచర్ విడుదల చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



అంతర్జాతీయ సేంద్రియ మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

సాక్షి, అమరావతి/నెల్లూరు (దర్గామిట్ట): విశాఖ వేదికగా 'అంతర్జాతీయ సేంద్రియ మహోత్సవ్ –2023' జూన్ 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఏపీ వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థలు సంయుక్తంగా విశాఖ బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించడం, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, వినియోగదారులను ఒక వేదికపైకి తీసుకురావాలన్న సత్సంకల్పంతో దేశంలోనే తొలిసారి ఈ మహోత్సవ్ నిర్వహిస్తున్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రైతులు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, మిల్లెట్ ఉత్పత్తిదారులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కొనుగోలుదారులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొననున్నారు. ఈ మహోత్సవ్‌లో ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా 123 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా రూ.100 కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేకంగా ఆర్గానిక్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేస్తున్నారు. 50 వేల మందికిపైగా సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. సెమినార్లు, వర్క్ షాప్‌లు కూడా నిర్వహించనున్నారు. సాగర తీరంలో తొలిసారి నిర్వహిస్తోన్న అంతర్జాతీయ ఆర్గానిక్ సదస్సును విజయవంతం చేయాలని మంత్రి కాకాణి ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. బ్రోచర్ విడుదల కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ ప్రభాకర్, ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్(ఐసీసీఓఏ) ప్రతినిధులు జయదీప్‌రాయ్, అనిత పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు గ్రీన్ టెక్ సేఫ్టీ అవార్డు–2023

ఉక్కునగరం (గాజువాక): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు జాతీయ స్థాయి గ్రీన్ టెక్ సేఫ్టీ అవార్డు–2023 లభించింది. గ్రీన్ టెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యూహాత్మక స్థిరత్వం, సురక్షితమైన భద్రత, ఆరోగ్యం, అగ్ని ప్రమాదాల నివారణకు చేపడుతున్న ఉత్తమ సంస్థలను గుర్తించి గ్రీన్‌టెక్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో సత్కరిస్తుంది. ఎత్తయిన నిర్మాణాలు, చిమ్నీలు మొదలైన వాటికి డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించడం, సేఫ్టీ పరికరాలు ట్రాక్ చేయడానికి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ అభివృద్ధి చేయడం వంటి చర్యలను చేపట్టినందుకు 2022–23కు ఈ పురస్కారం ప్రకటించారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన 21వ వార్షిక గ్రీన్‌టెక్ అవార్డుల కార్యక్రమంలో అస్సాం మాజీ గవర్నర్ జగదీష్ ముఖి చేతుల నుంచి స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ అవార్డును అందుకున్నారు.



గ్రీన్ టెక్ అవార్డు అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

కర్ణాటక పథకాల కాపీయే బాబు మేనిఫెస్టో

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్



రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వ్యవహారం చూస్తుంటే ఏదోలా అధికారంలోకి రావాలని కర్ణాటక పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోగా ప్రకటించినట్టుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. ఎన్‌డీఏ పాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాలన్నీ కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్నవేనని మాధవ్ అన్నారు. బస్సు పథకంతో పాటు అన్నీ మక్కికి మక్కీగా దింపేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అలసత్వం కారణంగానే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల పంపిణీకి ఇబ్బందులు పడుతోందన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఎన్నికలు సమీపించడంతో పసుపు కుంకుమతో సరిపెట్టారని, నిరుద్యోగ భృతి సాధ్యం కాక మళ్లీ కొత్త నినాదంతో చంద్రబాబు హామీలు గుప్పిస్తున్నాడని ధ్వజమెత్తారు. మోదీ పాలనలో తీవ్రవాదం లేకుండా అరికట్టగలిగామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి 'టెన్త్' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతిస్తామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 915 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 915 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 11 వేల మంది ఇన్విజిలేటర్లు, 86 ఆకస్మిక తనిఖీ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లతో సహా ఎవరూ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్స్, కెమెరాలు, ఇయర్ ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. జూన్ 13, 14 తేదీల్లో రాష్ట్రంలోని 23 కేంద్రాల్లో మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం విజయవాడలో 0866–2974540 తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇది జూన్ 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

రేపు ఢిల్లీలో పోలవరంపై కీలక భేటీ

- తొలిదశ సవరించిన అంచనాలపై కేంద్ర జల్‌శక్తి శాఖకు నివేదిక ఇచ్చిన సీడబ్ల్యూసీ
- దానిపై చర్చించి, సవరించిన అంచనాను ఖరారు చేయడమే అజెండాగా సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేయడమే అజెండాగా గురువారం ఢిల్లీలో కేంద్రం కీలక సమావేశం ఏర్పాటుచేసింది. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆ శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొననున్నారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.16,952.07 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పీపీఏకి అందజేసింది. దీనిపై ఈనెల 25న సీడబ్ల్యూసీ, పీపీఏ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను క్షుణ్ణంగా అధ్యయనం చేసి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తొలిదశ 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించడం, భూసేకరణ, ప్రధాన డ్యామ్, కుడి, ఎడమ కాలువల్లో మిగిలిన పనుల పూర్తికి అయ్యే వ్యయంపై సమీక్షించిన సీడబ్ల్యూసీ, పీపీఏ అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనతో ఏకీభవిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖకు నివేదిక ఇచ్చినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నివేదిక ఆధారంగా పోలవరం తొలిదశ అంచనా వ్యయాన్ని ఖరారు చేసి కేంద్ర మంత్రిమండలికి పంపేందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ సిద్ధమైంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే తొలిదశ సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది.

ఫ్యామిలీతో..ఫస్ట్ డే..ఫస్ట్ షో!

- విడుదలైన రోజే ఇంట్లోనే కొత్త సినిమా వీక్షించే అవకాశం
- ఫైబర్ నెట్ ద్వారా రూ.99కే సినిమా
- ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ గౌతమ్ రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి/బస్టాండ్(విజయవాడ పశ్చిమ): థియేటర్‌లో సినిమా విడుదలైన రోజునే ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ప్రేక్షకులందరూ ఇంట్లో కూర్చొని వీక్షించేలా వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) చైర్మన్ డా.పి.గౌతమ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిర్మాతకు, ప్రేక్షకుడికీ లాభం కలిగే విధంగా ఇకపై ఇంట్లోనే కొత్త సినిమా చూసేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫస్ట్ డే ఫస్ట్ షో అనే పద్ధతిలో దీన్ని రూపకల్పన చేశామన్నారు. జూన్ 2న విశాఖలోని పార్క్ హోటల్‌లో ప్రారంభించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, హీరో సాయి రోనక్, నిర్మాత మండలి సభ్యులు సి.కళ్యాణ్, రమా సత్యనారాయణ హాజరవుతారని చెప్పారు. ఏపీ ఎస్ఎఫ్ఎల్ లో తొలుత 'నిరీక్షణ' అనే సినిమాను ప్రదర్శిస్తామని తెలిపారు.



ఏపీఎస్ఎఫ్ఎల్‌ను కూడా ఒక థియేటర్‌లా భావించాలన్నారు. రూ.99తో సబ్‌స్క్రైబ్ చేసుకునేవారికి సినిమా వీక్షించే అవకాశం కల్పించామని దీని కాల పరిమితి 24 గంటలు ఉంటుందన్నారు. ఓటీటీ తరహాలో కాకుండా లైవ్ చూసే విధంగానే రూపొందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏపీఎస్ఎఫ్ఎల్ కనెక్టివిటీ ఎక్కువ ఉండటంతో పట్టణాలకు వచ్చి థియేటర్‌లో సినిమా వీక్షించలేని వారికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానం యాజమాన్యానికి గానీ, థియేటర్ ఓనర్స్ కి గానీ, నటులకు గానీ ఇబ్బంది కలిగించేది కాదన్నారు. థియేటర్ యాజమాన్యాలు కూడా దీని ద్వారా తమ ఆదాయం పడిపోతుందని భావించాల్సిన అవసరం లేదన్నారు. నిర్మాతలు ఎవరైనా ఏపీఎస్ఎఫ్ఎల్ సంస్థతో మాట్లాడిన తర్వాత ఇందులో సినిమాను ప్రదర్శిస్తామన్నారు.

కవిత అసలైన పెట్టుబడిదారు!

సాక్షి, న్యూఢిల్లీ

ఢిల్లీ మద్యం విధానంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసలైన పెట్టుబడిదారు అని.. ఆమె బినామీగా వ్యవహరించిన అరుణ్ పిళ్లై తన వాంగ్మూలంలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని ఈడీ అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొంది. రూ.100 కోట్ల కిక్‌బ్యాక్‌ల గురించి కవితకు తెలుసని పిళ్లై అంగీకరించారని తెలిపింది. సౌత్ గ్రూప్ (శరత్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవ మాగుంట, కె.కవిత తరఫున ప్రాతినిధ్యం వహించిన అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు)తో కలిసి మనీశ్ సిసోడియా, ఇతర ఆప్ నేతల ప్రతినిధి విజయ్‌నాయర్ ఈ కుట్ర చేశారని వివరించింది. లిక్కర్ విధానం కేసుకు సంబంధించి ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాపై ఇటీవల ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను ఢిల్లీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ మంగళవారం పరిగణనలోకి తీసుకున్నారు. దీనిపై విచారణ జూన్ 1వ తేదీకి వాయిదా వేశారు. 278 పేజీల ఈ అనుబంధ చార్జిషీటులో ఈడీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేరును 53 సార్లు ప్రస్తావించింది.

ఈడీ అనుబంధ చార్జిషీట్‌లో ప్రధాన అంశాలివీ..

- ▲ ఈ కేసుకు సంబంధించి 2022 నవంబర్ 11, 20 తేదీలతోపాటు 2023 ఫిబ్రవరి 16, మార్చి 6వ తేదీల్లో జరిగిన కార్యకలాపాల్లో కవిత తరఫు ప్రతినిధిగా ఇండో స్పిరిట్స్ (ఎల్1) భాగస్వామి అరుణ్ పిళ్లై పాల్గొన్నారు.
- ▲ 2022 ఏప్రిల్ 8న ఢిల్లీలోని ఒబెరాయ్ మైడెన్స్‌లో విజయ్‌నాయర్, దినేశ్ అరోరాలతో కవిత, అరుణ్ పిళ్లై సమావేశమై సౌత్‌గ్రూపునకు కిక్‌బ్యాక్‌ల రూపంలో చెల్లింపులపై చర్చించారు.
- ▲ కవిత తరఫున పనిచేస్తున్న వారికి కిక్‌బ్యాక్‌ల సొమ్ము చెల్లింపుకోసం ఢిల్లీ సీఎం, డిప్యూటీ సీఎంల తరఫున విజయ్‌నాయర్ పాలసీలో అనుకూలంగా మార్పులు చేశారని బుచ్చిబాబు వాంగ్మూలంలో వెల్లడించారు.
- ▲ మద్యం విధానం రూపకల్పనకు ముందు, తర్వాత కూడా విజయ్‌నాయర్‌తో కవిత పలుసార్లు సమావేశమయ్యారు. ఢిల్లీ సీఎంతో మాగుంట శ్రీనివాసులురెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీ మద్యం వ్యాపారంలోకి మాగుంట రాకను ఢిల్లీ సీఎం స్వాగతించారు.
- ▲ కవిత ప్రతినిధిగా అరుణ్ పిళ్లై మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రతినిధిగా మేరకు ప్రేమ్ ఇండోస్పిరిట్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే దీనిలో 65 శాతం వాటా గురించి మాత్రం అరుణ్ పిళ్లైతోనే చర్చించానని, తానెప్పుడూ ప్రేమ్‌ను కలవలేదని సమీర్ మహేంద్రు వాంగ్మూలం ఇచ్చారు.
- ▲ అరుణ్ పిళ్లై, ఇతరులు కూడా ఇందులో అసలు పెట్టుబడిదారులు రాజకీయ సంబంధాలున్న కవిత, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శరత్‌రెడ్డి అని పలు సందర్భాల్లో వెల్లడించారు.
- ▲ సమీర్ మహేంద్రు వాంగ్మూలం ప్రకారం.. తన వెనక ఎవరున్నారో చెప్పాలని అడగ్గా తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత అని సమీర్‌కు అరుణ్ పిళ్లై వెల్లడించారు. ఢిల్లీ మద్యం వ్యాపారంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందంటూ కవిత ఫేస్‌టైం యాప్‌లో సమీర్‌కు చెప్పారు. ఎల్1 దరఖాస్తు విషయంలో ఏవైనా ఇబ్బందులొస్తే ఏ సాయం కావాలన్నా అరుణ్ పిళ్లై ద్వారా తెలియజేయాలని సూచించారు. 2022 తొలినాళ్లలో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో జరిగిన సమావేశంలో ఆమెతోపాటు సమీర్ మహేంద్రు, శరత్, అరుణ్ పిళ్లై అభిషేక్ బోయినపల్లి, కవిత భర్త అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌పిళ్లై తన కుటుంబ సభ్యుడితో సమానమని, అతడితో కలసి వ్యాపారం చేస్తున్నామని, తమ వ్యాపారాన్ని భారీగా ముందుకుతీసుకెళ్లాలని భావిస్తున్నామని సమీర్‌కు కవిత తెలిపారు. ఈ సమయంలోనే ఇండోస్పిరిట్స్ ఎల్1 దరఖాస్తు సమస్యపై కవిత ఆరా తీశారు.
- ▲ ఢిల్లీలోని గౌరి అపార్ట్‌మెంట్స్‌లో భేటీ సందర్భంగా అర్జున్ పాండే, అరుణ్ పిళ్లై బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లిలను విజయ్‌నాయర్ తనకు పరిచయం చేశారని.. వారు ఎంఎస్ రెడ్డి, కవితలకు బాగా దగ్గరవారని, మద్యం వ్యాపారంలో సాయం చేస్తారని చెప్పారని.. దినేష్ అరోరా ఈడీకి వాంగ్మూలం ఇచ్చారు.
- ▲ దినేష్ అరోరా కవితతో రెండుసార్లు సమావేశమయ్యారు. ఒబెరాయ్‌లో సమావేశం సందర్భంగా అడ్వాన్స్ కిక్‌బ్యాక్స్‌ను విజయ్‌నాయర్‌కు చెల్లించడంపై చర్చించారు.
- ▲ రూ.100 కోట్ల ముడుపులకు బదులుగా కవితకు ఇండోస్పిరిట్స్‌లో వాటా ఇవ్వడంపై.. ఆమెకు, ఆప్ నేతలకు మధ్య అవగాహన/ఒప్పందం ఉందని అరుణ్ పిళ్లై తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఆ మేరకే తాను కవితకు ప్రాతినిధ్యం వహించానని, అవసరమైన పెట్టుబడి ఇస్తూ కాగితాలపై భాగస్వామి అయ్యారని తెలిపారు. తాను చాలా కాలంగా కవితకు స్నేహితుడినని పేర్కొన్నారు.

దశాబ్దంగా బీజేపీ ఎదగకుండా కుట్రలు!

రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఫైర్

సాక్షి, అమరావతి: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల మేర రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు అందజేస్తున్నా కూడా దశాబ్ద కాలంగా రాష్ట్రంలో కొంతమంది బీజేపీపై బురద చల్లే రాజకీయాలు చేస్తున్నారంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మండిపడ్డారు. మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సహచర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎవరి పేర్లు ప్రత్యేకంగా ప్రస్తావించకుండా మాట్లాడుతూ.. ఇక్కడ బీజేపీ బలోపేతం జరిగితే వారి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని వారంతా ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీపై బురద చల్లేందుకు రాష్ట్రంలోని ఒక రాజకీయ పార్టీ భూత వైద్యులను ప్రవేశపెడుతుందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. స్వయం ప్రకటిత మేధావులుగా చెప్పుకునే ఒక టీమ్ సమయం సందర్భం లేకుండానే రాష్ట్రంలో పర్యటిస్తుందని.. వారిని భూతవైద్యులుగా, తీసేసిన తహసీల్దార్‌లుగా సోము వీర్రాజు అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీని ఆడిపోసుకోవడం వీరికి అలవాటుగా మారిపోయిందని చెప్పారు. ఈ భూతవైద్యుల బృందం బీజేపీని రాష్ట్ర ప్రజలను దగ్గర కాకుండా చూసేందుకు పనిచేస్తుందని దుయ్యబట్టారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943